ఆగస్టు
2014

100

సంపుటి : 9 సంచిక : 4

వెల రు. 10/-

## ఈ సంచికలో........

నరేంద్ర మోడీ ప్రభుత్వం: వామపక్షాల ముందున్న కర్తవ్యం
ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికులపై సంస్కరణల ప్రభావం
కార్యకర్తల అభివృద్ధి
ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేది దామాషా ఎన్నికల విధానమే
గాజాపై ఇజ్రాయిల్ దాడులు అమెరికా వ్యూహంలో భాగం
"ఆక్రమించు, ప్రతిఘటించు, వుత్పత్తి చేయి"
చైనా సాంస్కృతిక విప్లవ సేనాని లూ షన్
నిబద్ధత, అంకితభావానికి ప్రతిరూపం అల్లూరి
పార్లమెంట్‌లో వామక్షాల బలం తగ్గిన పరిస్థితుల్లో పార్లమెంట్ బయట పోరాటాలకు ప్రాధాన్యత పెరిగింది

నివాళి

# నిబద్ధత, అంకితభావానికి ప్రతిరూపం అల్లూరి

యు. రామకృష్ణ

మృదుభాషణ.. నమ్రత.. నిరాడంబరత.. నిబద్ధత.. అంకితభావానికి ప్రతిరూపం ఆయన.. సంప్రదాయ భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, పేదల బాగు కోసం బాల్యంలోనే తన జీవనయానాన్ని కష్టాల దారికి మలుచుకున్న కంకణధారి.. తన వాటాగా వచ్చిన యావదాస్తినీ అభిమానించే కమ్యూనిస్టు పార్టీకి సమర్పించిన త్యాగి.. సహధర్మచారిణిని సైతం విప్లవకారిణిగా తీర్చిదిద్దిన ఉన్నతాశయం.. పార్టీ నిర్మాణంలో అత్యంత క్రమశిక్షణ.. కార్యకర్తల పట్ల అమిత ప్రేమాభిమానం.. విప్లవోద్యమంలో నిర్బంధాలు, అజ్ఞాతవాసాలు, జైలు జీవితాలు.. అన్నింటినీ అధిగమిస్తూ విద్యార్థి, ఉపాధ్యాయ, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు, రైసు మిల్లు తదితర కార్మిక సంఘాల నిర్మాణంలోనూ, వాటిని ఉద్యమపథాన నడిపించడంలోనూ ఏడు దశాబ్దాల నిర్విరామ కృషి ఆయనది.. ఆయనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ పూర్వ సభ్యుడు అల్లూరి సత్యనారాయణ. పార్టీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులను విచార సాగరంలో ముంచి ఇటీవలే కన్నుమూశారు.

అల్లూరి జన్మస్థలం తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి. గోదావరి ఒడ్డునున్న గ్రామమది. ఆనాడే వందెకరాల పైబడిన భూస్వామ్య కుటుంబం వారిది. తండ్రి రామరాజుకు కాంగ్రెస్ భావాలుండేవి. అల్లూరికి ఐదుగురన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు. సొంతూళ్లోనే ఐదో తరగతి వరకూ చదివారు. అక్కడ ఆరో తరగతి లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలోని మలికిపురం వెళ్లి చదవాల్సి వచ్చింది. ఇంతదూరమూ రోజూ నడిచివెళ్లి ఆరో తరగతి పూర్తి చేశారు. సఖినేటిపల్లి-మలికిపురం దారిలో చెట్లతోపులో దయ్యాలు, ఏదో శక్తి ఉన్నాయని ప్రచారం ఉండేది. అంత చిన్న వయస్సులోనూ మనోధైర్యంతో స్కూలుకు వెళ్లి వస్తుండేవారు. దీనివల్ల ఆయనకు నిర్భయత్వం అలవడింది. చదువుకునే రోజుల్లోనే మరో సందర్భంలో మేనమామగారి ఊరెళ్లే తొందరలో తెలతెలవారుతుండగా గోదావరి ఒడ్డుకు చేరారు. అక్కడెవ్వరూ లేరు. నది ఒడ్డున నావ ఖాళీగా కనిపించింది. తెడ్లు, పనిముట్లు వంటివేమీ అందులో లేవు. పడవ మనిషీ లేడు. నావలో కూర్చొని చేతులను తెడ్లు మాదిరిగా ఆడిస్తూ గోదావరి అవల వైపు (పశ్చిమ గోదావరిజిల్లా)కు చేరుకున్నారు. మొండిగా అటువంటి పని చేసి ఉండాల్సి కాదని తరువాత కాలంలో ఆయన అభిప్రాయపడ్డారు. మలికిపురంలో చదివేటప్పుడే కొందరు విద్యార్థులు ఎర్రజెండాలు పట్టకొని కూలీల పాటలు పాడుకుంటూ గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అదేమిటో తనకేమీ తెలియకపోయినా విద్యార్థులు చేస్తున్నారనే భావనతో అందులో పాల్గొన్నారు. ఆ తరువాత కాలంలో ఈ ఘటనను 'నా జీవితంలో మరపురాని ఘట్టం' అనేవారాయన.



చించినాడ తన మేనమామ గారి ఊరు కావడంతో గోదావరి అవల (తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి) నుంచి ఈవలకు (పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి) తరచూ వచ్చేవారు. బంధువుల కారణంగానూ, ఆ ప్రాంతం బాగా పరిచయం ఉండటం వల్లనూ నరసాపురంలో బ్రిటీష్‌వారు నిర్మించిన టేలర్ హైస్కూల్లో చేరారు. మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు చదువుకున్న హైస్కూలది. తాను హైస్కూల్లో చేరేనాటికి (1942లో) 'క్విట్ ఇండియా' ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. తానూ ఏదో ఒకటి చేయాలనే ఆవేశంతో సహచర విద్యార్థులు రుద్రరాజు సూర్యనారాయణరాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), మీసాల శ్రీరామమూర్తి తదితరులతో కలిసి పోలీసుల కంటబడకుండా పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో గోడలపైన 'క్విట్ ఇండియా' అనే నినాదాన్ని బొగ్గులతో రాశారు. స్వాతంత్రోద్యమం పట్ల అలా వారిలో ఉత్తేజం ఉరకలు వేసింది. ఆ చిన్నవయస్సులోనే మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి కథలు కథలుగా చెప్పుకోవడం విన్నారు. బ్రిటీష్ వారిని తరిమివేయడానికి విల్లంబులతో పోరాడాడనీ, పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు తీసుకుని వెళ్లిపోయేవాడనీ విన్నారు. ఈ నేపథ్యంలోనే అల్లూరికి దేశంలోని వివిధ విప్లవకారుల చరిత్ర ఉన్న పుస్తకం సంపాదించాలనే కోరిక కలిగింది. ఈ విషయం దండు సత్యనారాయణరాజు అనే విద్యార్థి వద్ద ప్రస్తావించగా.. అతడెలాగో దాన్ని సంపాదించి అల్లూరికిచ్చాడు. అది చదివి ఆయన ఎంతో ఉత్తేజం పొందారు. తరువాత దండు సత్యనారాయణ, ఆయన మేనమామ కమ్యూనిస్టులని తెలుసుకున్నారు.

అప్పటికే స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సత్యనారాయణరాజు (తరువాత కాలంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు), ఉద్దరాజు రామం, గారపాటి సత్యనారాయణ వంటివారు జిల్లా కాంగ్రెస్‌లో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. వీరు జిల్లా తొలితరం నేతలు. వీరు పుచ్చలపల్లి సుందరయ్య ప్రభావంతో కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. తన సహ విద్యార్థి దండు సత్యనారాయణ కమ్యూనిస్టు కావడం వల్లనూ, జిల్లాలో ఉద్దండులైన ఉద్దరాజు రామం, గారపాటి సత్యనారాయణ వంటివారు రైతు, కూలీ, విద్యార్థి, మహిళా ఉద్యమాలను నిర్మిస్తున్న దశలో అల్లూరిలో క్రమంగా కమ్యూనిస్టు భావాలు పెంపొందాయి. అల్లూరి, ఆయన బంధువులైన ఆర్.సత్యనారాయణరాజు, సూర్యనారాయణ రాజు తదితరులు కమ్యూనిస్టు అభిమానులుగా తయారయ్యారు. నరసాపురంలో కొందరు కమ్యూనిస్టులతో పరిచయాలు పెరిగాయి. అల్లూరి ఫోర్త్ ఫారం చదివేరోజుల్లో పధ్నాలుగో ఏట పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఆ సమయంలో విద్యార్థి సెల్ ఏర్పడింది. దానికి అల్లూరే కార్యదర్శి. హైస్కూల్లో స్టూడెంట్ ఫెడరేషన్‌ను ఏర్పరిచి విద్యార్థుల సమస్యలపై పనిచేశారు.

1946లో పదోతరగతి చదివేటప్పుడు, బొంబాయిలో జరుగుతున్న విద్యార్థి ఫెడరేషన్ ఆలిండియా మహాసభకు తనతోపాటు వీరవల్లి సత్యనారాయణ అనే విద్యార్థిని కూడా తీసుకు వెళ్లారు. అక్కడ విద్యార్థి ప్రదర్శన, బహిరంగసభలను ప్రభుత్వం నిషేధించి 144వ సెక్షన్ విధించింది. అయినా ఆ నిషేధాజ్ఞలు ఉల్లంఘించి కాంగార్ మైదానంలోకి చేరుకున్నారు. మైదానంలోకి చొరబడ్డ వారందరినీ పోలీసులు లాఠీలతో విచక్షణా రహితంగా కొట్టారు.

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. నిబద్ధత, అంకితభావానికి ప్రతిరూపం అల్లూరి**
– యు. రామకృష్ణ 2

**2. నరేంద్ర మోడీ ప్రభుత్వం: వామపక్షాల ముందున్న కర్తవ్యం**
– ప్రకాశ్ కరత్ 4

**3. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికులపై సంస్కరణల ప్రభావం**
– బి.వి. రాఘవులు 10

**4. కార్యకర్తల అభివృద్ధి**
– ఎస్. వీరయ్య 14

**5. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేది దామాషా ఎన్నికల విధానమే**
– ఎస్. వెంకట్రావు 16

**6. గాజాపై ఇజ్రాయిల్ దాడులు అమెరికా వ్యూహంలో భాగం**
– ఆర్. అరుణ్ కుమార్ 21

**7. "ఆక్రమించు, ప్రతిఘటించు, ఉత్పత్తి చేయి"**
– మరీనా సిట్రిన్ 28

**8. చైనా సాంస్కృతిక విప్లవ సేనాని లూ షన్**
– పెకింగ్ రివ్యూ నుండి 31

**9. పార్లమెంట్‌లో వామక్షాలబలం తగ్గిన పరిస్థితుల్లో పార్లమెంట్ బయట పోరాటాలకు ప్రాధాన్యత పెరిగింది**
– బివి రాఘవులు 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866–2573822**
**మేనేజర్: 040–27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# 'మార్క్సిస్టు' 100

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక ప్రారంభమై శతమాసాలైంది. మీ చేతిలో ఉన్నది 100వ సంచిక. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఉద్యమ సైద్ధాంతిక ప్రచార అవసరాల కోసం తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభమైన పత్రిక క్రమంగా పాఠకుల ఆదరణ పొందుతూ వచ్చింది. అయితే అంతర్జాతీయ, జాతీయ పరిణామాలు వేగంగా మారుతూ, మరింత సంక్లిష్టమవుతున్న నేపథ్యంలో సైద్ధాంతిక ప్రచార అవసరం నేడు మరింత ఎక్కువైంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సంక్షోభంలో పడింది. నయా–ఉదారవాద విధానాల వల్ల వచ్చిన సంక్షోభానికి ఆ విధానాలను మరింత ఊపుగా అమలు చేయడమే పరిష్కారమని సామ్రాజ్యవాద పండితులు ప్రవచిస్తున్నారు, వివిధ దేశాల పాలకులు అమలు చేస్తున్నారు. ఫలితంగా ప్రపంచవ్యాపితంగా ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం పెరుగుతున్నాయి. అయినా ఈ ఆర్థిక విధానాలను సమర్థించుకోడానికి పాలక వర్గాలు పలు ప్రచార పద్ధతులు అనుసరిస్తున్నాయి. వారి మోసపూరిత ప్రచారాన్ని పటాపంచలుచేసి ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన అవసరం గతంలో ఎన్నటికన్నా నేడు ఎక్కువగా ఉంది.

ఆర్థిక సంక్షోభం ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో రాజకీయ కల్లోలాలు సృష్టిస్తోంది. గాజాపై ఇజ్రాయిల్ దుర్మార్గపు దాడులకు తెగబడుతోంది. సిరియా, లిబియా, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, ఆఫ్రికాలోని అనేక దేశాలు అంతర్యుద్ధాలతో అట్టుడుకుతున్నాయి. అనేక దేశాల్లో ఫాసిస్టు, మతోన్మాద శక్తులు పెచ్చరిల్లుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని వనరుల దోపిడీ, మార్కెట్లపై పట్టుకోసం సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాల ఫలితమే ఈ కల్లోలాలు. 'ప్రజాస్వామ్యం' పేరుతో సామ్రాజ్యవాదులు సాగిస్తున్న ఈ కుట్రలు, కుయుక్తులను బయటపెట్టాల్సిన అవసరం గతంలో ఎన్నటికన్నా నేడు ఎక్కువగా ఉంది.

ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా సామ్రాజ్యవాదుల యుద్ధ వ్యూహాలు అంతం కాలేదు. చైనాలో మిగిలి ఉన్న సోషలిజాన్ని అంతం చేసేందుకు అష్టదిగ్బంధన వ్యూహం అనుసరిస్తోంది. దానిలోకి భారత దేశాన్ని కూడా లాగుతోంది. ప్రచ్ఛన్న యుద్ధం పోయినా అణుబాంబులు పోలేదు. అణు యుద్ధ ప్రమాదమూ పోలేదు. కొత్త కొత్త ఆయుధాలు సృష్టించబడుతున్నాయి. ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదుల ఆయుధాల అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి. ఆయుధాల దిగుమతిలో మన దేశం ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఆయుధ బేహారుల అడ్డగోలు వ్యవహారాలు వెల్లడించాల్సిన అవసరం గతంలో ఏనాటికన్నా నేడు ఎక్కువగా ఉంది.

'నాగరికతల ఘర్షణ' పేరుతో సామ్రాజ్యవాదులు వివిధ మతాల మధ్య, మతాల్లోనే వివిధ శాఖల మధ్య చిచ్చు రేపుతున్నారు. అన్ని దేశాల్లోనూ, అన్ని మతాల్లోనూ మతతత్వ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్నారు. మధ్య ఆసియాలో మతోన్మాద శక్తులనూ, భారత దేశం దాని చుట్టూ దేశాల్లో మతతత్వ శక్తులనూ అమెరికా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎగదోస్తోంది. మన దేశంలో బిజెపీ–ఎన్డీఎ అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థల్లోకీ మతతత్వ శక్తులను ప్రవేశపెట్టే చర్యలూ, ప్రజల ఆలోచనా విధానాన్ని మతతత్వ పూరితం గావించే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఒకవైపు నయా–ఉదారవాదం, మరోవైపు మతతత్వం దేశానికి ప్రమాదకరంగా మారాయి. ఈ దుష్టయత్నాలనూ, వాటి దుష్ఫలితాలనూ బహిర్గతం చేయాల్సిన అవసరం గతంలో ఎన్నటికన్నా నేడు ఎక్కువగా ఉంది.

అందుకే 'మార్క్సిస్టు' సైద్ధాంతిక పత్రిక అవసరం గతంలో ఏనాటికన్నా నేడు ఎక్కువగా ఉంది. పత్రిక ఒక్కటే కాదు, పుస్తక పఠనాలు, స్టడీ సర్కిళ్లు, చర్చలు, సమావేశాలు మొదలైన అనేక రూపాల్లో ప్రజల వద్దకు సైద్ధాంతిక విషయాలు తీసుకుపోవాలి. సిద్ధాంతం ప్రజలపరమైనప్పుడు అది భౌతిక శక్తిగా మారుతుందని కారల్ మార్క్స్ చెప్పారు. ఇప్పుడు మనం ఆ పనిచేయాలి. అందుకుగాను 'మార్క్సిస్టు'ను ప్రజల వద్దకు పెద్ద ఎత్తున తీసుకుపోవాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ. 10,** సంవత్సర చందా: **రూ. 100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.


**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్** (ప్రజాశక్తి కార్యాలయం),
**అజామాబాద్, హైదరాబాద్- 20**

**ఈ మాసం ముఖ్యాంశం**

# నరేంద్ర మోడీ ప్రభుత్వం వామపక్షాల ముందున్న కర్తవ్యం

**ప్రకాశ్ కరత్**



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి

**భారతభకమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య శతజయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని జులై 4న విజయవాడలో జరిగిన బహిరంగ సభలో సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ చేసిన ప్రసంగ పాఠాన్ని 'మార్క్సిస్టు' పాఠకులకు అందజేస్తున్నాం.**

నేడు భారత దేశ రాజకీయాలు మిత వాద మలుపు తీసుకున్నాయి. ఇటీవలి ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపీ-ఎన్డీఎ ప్రభుత్వం అధికారంలోకి రావడం అంటే ఒక మతతత్వ పార్టీ అధికారంలోకి రావడం మాత్రమే కాదు, భారతదేశ పెట్టుబడిదారీ వర్గం లో నయా-ఉదారవాద మార్గాన్ని ఎన్నుకున్న భాగం అధికారంలోకి రావడం. ఆ విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒకవైపు నయా-ఉదారవాద మార్గానికీ, మరోవైపు మతతత్వానికీ ప్రాతినిథ్యం వహిస్తోంది. అందుకనే భారతదేశ రాజకీయాలు ఖచ్చితంగా మితవాదంవైపు మళ్లా యని చెప్పవచ్చు. ఈ పరిస్థితి మన ముందు అనేక సవాళ్లను విసురుతోంది.

భారత దేశంలోని బడా-బూర్జువా వర్గం తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని, తన వర్గ ప్రయోజనాలు నెరవేర్చే ప్రభుత్వాన్ని నెలకొల్ప డానికి చేసిన తీవ్ర ప్రయత్నాల ఫలితంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిం ది. మనం గనుక ఇటీవలి భారత దేశ చరిత్రను పరిశీలిస్తే, దేశంలో తమ వర్గ ప్రయోజనాలు కాపాలడుకోవాలంటే నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని నెలకొల్పాలని బడా-బూర్జువా వర్గం మొత్తం 2010-11 సంవత్సరం నాటికి ఒక నిశ్చయా నికి వచ్చారు. గుజరాత్ రాజధాని అహమ్మదా బాద్‌లో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పారిశ్రామికవేత్తల సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో దేశంలోని కార్పొరేట్ రంగానికి చెందిన బడా పారిశ్రామిక వేత్తలందరూ పాల్గొంటారు. 2011లో జరిగిన సదస్సులో మన దేశంలోని కార్పొరేట్ దిగ్గజాలైన టాటా, బిర్లా నుండి అంబానీ, అదానీ వరకు అందరూ పాల్గొన్నారు. ఈ సదస్సులోనే అంతా కూడబలు క్కుని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి గానే కాదు భారత దేశానికి సిఇఓగా అంటే ప్రధాన మంత్రిగా రావాలి అని నిర్ణయానికి వచ్చారు. భారతదేశ కార్పొరేట్ రంగ చరిత్రలో ఏనాడూ కూడా మొత్తం కార్పొరేట్ అధిపతు లంతా కలిసి ఒకే వ్యక్తికి మద్దతివ్వడం అనేది జరగలేదు. కానీ అది ఇప్పుడు నరేంద్ర మోడీ విషయంలో జరిగింది. అందుకే గత ఎన్నిలకు ముందు భారతదేశంలోని మీడియా ఏదైనా కూడా అది ప్రింట్ మీడియా కానీయండి, ఎలక్ట్రానిక్ మీడియా కానీయండి ఏకగ్రీవంగా నరేంద్ర మోడీకి అనుకూలంగా ప్రచారం చేశాయి. ఆ విధంగా నరేంద్ర మోడీ-బిజెపీ విజయం వెనుక కార్పొరేట్ మీడియా ప్రధాన పాత్ర నిర్వహించింది.

దీనితోపాటు నరేంద్ర మోడీ-బిజెపీ విజయం కోసం మరో శక్తి కూడా పనిచేసింది. అది సంఘ్ పరివారం. మొత్తం ఆర్ఎస్ఎస్ తన మొత్తం బలాన్నీ, వనరులనూ మోడీ విజయం కోసం వినియోగించింది. హిందూత్వ మతతత్వ ఎజెండాకు సంబంధించిన అన్ని సమస్యలనూ ఎన్నికల్లో లేవనెత్తడం ద్వారా వారు దేశంలో మతాల వారీ విభజన సృష్టించడం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఇది ఉత్తర ప్రదేశ్, బీహార్, ఇతర అనేక రాష్ట్రాల్లో బిజెపీ మెజారిటీ సాధించడం వెనుక ముఖ్యమైన పాత్ర నిర్వహించింది.

ఈ విధంగా ఒకవైపు కార్పొరేట్ రంగం, మరోవైపు హిందూత్వ శక్తులు కలిసి బిజెపీకి విజయాన్ని చేకూర్చిపెట్టాయి. అందువల్ల రాను న్న కాలంలో ఈ బడా పెట్టుబడిదారీ వర్గ-మతతత్వ శక్తుల వినాశనకరమైన కల యిక దేశ ప్రజాస్వామిక, లౌకిక రాజకీయ వ్యవస్థకు పెద్ద ప్రమాదకరంగా మారనుంది.

ఇప్పటికే ఈ ప్రభుత్వం నుండి వచ్చే ప్రమా దం ఏమిటీ మనకు అర్ధమవుతోంది. ఈ నెల రోజుల కాలంలోనే ప్రభుత్వం మన దేశంలోని అనేక రంగాలోకి ముఖ్యంగా రక్షణ, బీమా ఇంకా అనేక రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను తీసుకు రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

కార్పొరేట్ రంగం నుండి తనకు లభించిన మద్దతుకు గాను మోడీ ప్రభుత్వం ఇప్పుడు రుణం తీర్చుకుంటోంది. ఇప్పటికే ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలు ఉపసంహరించుకోవ డం ప్రారంభించింది. జాతీయ బ్యాంకులను ప్రయివేటీకరించాలని నాయక్ కమిషన్‌ను సిఫార్సు చేసింది. అలాగే బీమా, బ్యాంకింగు రంగాలను విదేశీ పెట్టుబడులకు తెరవడానికి ప్రతిపాదనలను ముందుకు తెస్తోంది.

నయా-ఉదారవాద విధానాలను ఉద్ధృ తంగా అమలు జరపాలని మన దేశంలోని బడా-బూర్జువా వర్గం కోరుతోంది. గత రెండు సంవత్సరాలుగా మన ఆర్థిక పురోగతి మంద గించింది. దీన్ని అధిగమించేందుకు సంస్కరణల


వేగం పెంచాలని దేశంలోని బడా బూర్జువా వర్గం, విదేశీ ఫైనాన్స్ పెట్టుబడిదారులూ కోరుతున్నారు. నయా-ఉదారవాద విధానాలను మరింత వేగంగా అమలు చేయాలని కోరుతున్నారు. దానివల్ల బడా పారిశ్రామికవేత్తలకూ, విదేశీ పెట్టుబడిదారులకూ విపరీతమైన లాభాలు వస్తాయి. కానీ దీనివల్ల మరోవైపు ప్రజల మీద విపరీతమైన భారాలు పడతాయి. సామాన్యుల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలపై కోత పడుతుంది.

ఇప్పటికే మనం ఈ విధానాల ఫలితాలు చూస్తున్నాం. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ధరలు విపరీతంగా పెంచుతూ అనేక చర్యలు తీసుకుంది. రైల్వే ఛార్జీలు పెంచేసింది. డీజిల్, పెట్రోల్ ధరలు పెంచింది. ఇదంతా కూడా మరింత ద్రవ్యోల్బణానికీ, ధరల పెరుగుదలకూ దారితీస్తుంది. మరోవైపు సామాన్య ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు తగ్గిపోతాయి. ప్రజలకు ఉపయోగపడుతున్న సంక్షేమ పథకాలపై దాడి ఇప్పటికే ప్రారంభమైంది. యుపిఎ1 ప్రభుత్వ హయాంలో వామపక్షాల చొరవతో అమలులోకి వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని పరిమితం చేయడం ఎలా అన్న ఆలోచనలు చేస్తోంది.

కేంద్రలోని ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ చేత నడపబడుతున్నదన్న విషయం మన పార్టీకి తెలుసు. ఆర్ఎస్ఎస్ ఎజెండాలో ముఖ్యమైన విషయం దేశంలో హిందూ రాష్ట్రను స్థాపించడం. దానికోసం అది రానున్న కాలంలో తన పట్టు పెంచుకోడానికి ప్రయత్నిస్తుంది. 1998-2004 మధ్య కాలంలో వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వం హయాంలో ఆర్ఎస్ఎస్ వ్యక్తులు వివిధ ప్రభుత్వ వ్యవస్థల్లోకి ఎలా చొచ్చుకు పోయారో, విద్యారంగాన్ని ఎలా మత తత్వ పూరితం గావించడానికి ప్రయత్నించారో మనం చూశాం. ఇప్పుడు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ వచ్చింది కాబట్టి ఆ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయడం కోసం ఈ శక్తులు ఇప్పుడు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాయి.

మతతత్వం అనేది పాలక వర్గాల చేతిలో ఒక ఆయుధం. హిందూత్వ మతతత్వ శక్తులు శ్రామిక ప్రజలను మతాలవారీగా విభజిస్తాయి. హిందూత్వ శక్తులు ఎక్కడైతే రాజకీయంగా పట్టు సాధించాయో అక్కడల్లా ప్రజలు మతాల ప్రాతి పదికగా విడిపోయి ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ఘర్షణలకు దిగడం చూస్తున్నాం. ఈ రోజున పాలకవర్గాలు ఒకవైపు నయా-ఉదారవాద విధానాలను ఉద్ధృతంగా అమలు చేస్తూ మరోవైపు వాటికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు పోరాడకుండా వారిమధ్య ఐక్యత చెడగొట్టడం కోసం మతతత్వాన్ని ఉపయోగించుకుంటున్నాయి.

"మతతత్వం అనేది పాలక వర్గాల చేతిలో ఒక ఆయుధం. హిందూత్వ మతతత్వ శక్తులు శ్రామిక ప్రజలను మతాలవారీగా విభజిస్తాయి. హిందూత్వ శక్తులు ఎక్కడైతే రాజకీయంగా పట్టు సాధించాయో అక్కడల్లా ప్రజలు మతాల ప్రాతిపదికగా విడిపోయి ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ఘర్షణలకు దిగడం చూస్తున్నాం."




గుజరాత్ నమూనా గురించి గొప్పలు చెబుతున్నారు. బడా పారిశ్రామిక వేత్తలు, బడా కార్పొరేట్లు గుజరాత్ నమూనావైపు బాగా ఆకర్షితులవుతున్నారు. ఏమిటీ గుజరాత్ నమూనా? పారిశ్రామికవేత్తలకు కావలసిన రాయితీలు, ఉచిత భూమి, ఉచిత విద్యుత్తు వగైరా సదుపాయాలు కల్పించడమే కాదు, 1980ల నుండి గుజరాత్ మతతత్వ శక్తులకు ఒక ప్రయోగశాలగా మారింది. నాలుగేళ్లపాటు అక్కడ మత ఘర్షణలు నిరంతరాయంగా జరిగాయి. దానికి పరాకాష్టగా 2002లో గుజరాత్ మారణకాండ జరిగింది. అక్కడ మతతత్వ, మితవాద శక్తులు సమాజంపై ఆధిపత్యం సాధించాయి. దీని వల్ల అక్కడ భూస్వామ్య, కార్పొరేట్ దోపిడీ విపరీతంగా పెరిగింది. సమాజంపై మితవాద శక్తులు పట్టు సాధించడం వల్ల నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా శ్రామికవర్గం ప్రతిఘటన నిర్మించడానికి జరుగుతున్న ప్రయత్నాలు పక్కదారి పట్టించబడుతున్నాయి. ఇప్పుడు అవి గుజరాత్ నమూనాను దేశం మొత్తానికి విస్తరించడానికి ప్రయత్నిస్తున్నాయి. అందుకే గత ఎన్నికల్లో బిజెపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందీ అంటే బడా- బూర్జువా వర్గంలోని పచ్చి మితవాద సెక్షన్లు, మరోవైపు పచ్చి మితవాద సైద్ధాంతిక శక్తు లైన మతతత్వ వాదుల కలయిక అధికారంలోకి వచ్చినట్లు చెబుతున్నాం. ఈ రెండు శక్తులూ కలిసి అధికారంలోకి వచ్చాయి. ఈ పరిస్థితి దేశంలోని వామపక్షాల ముందు తీవ్రమైన సవాళ్లను ఉంచుతోంది.

ఇప్పటికే ఈ ప్రభుత్వం రాజ్యానికి చెందిన ఇతర అన్ని సంస్థలను ఎలా అణచివేతకు గురిచేస్తున్నదో చూస్తున్నాం. ఇటీవల సుప్రీం కోర్టు న్యాయవాదుల నియామకం దీనికొక ఉదాహరణ. సుప్రీంకోర్టు కొలీజియం నలుగురు న్యాయవాదుల పేర్లు సూచిస్తే, వారిలో ఒక ప్రముఖ న్యాయవాది అయిన గోపాల్ సుబ్రమణ్యం పేరును తొలగించాల్సిందిగా ప్రభుత్వం చెప్పడంతో ఆయన ప్యానల్ నుండి తప్పుకున్నారు. గతంలో ఆయన నరేంద్ర మోడీ కుడిభుజం, గుజరాత్ హోమ్ మంత్రి అయిన అమిత్ షాపై విచారణకు సుప్రీం కోర్టు నియమించిన అమికస్ క్యూరీగా ఉన్నారు. ఆయన విచారణ ఫలితంగానే సోహ్రాబుద్దీన్ హత్య కేసులో అమిత్ షా పాత్ర గురించిన నిజాలు బయటపడ్డాయి. ఆయన తన నివేదికను సుప్రీం కోర్టుకు సమర్పించడంతో అమిత్ షా పై కోర్టు క్రిమినల్ చర్యలు తీసుకుంది. ఈ కక్షతోనే బిజెపీ ప్రభుత్వం ఇప్పుడు ఆ న్యాయవాది పేరును అడ్డుకుంది.

అందువల్ల ఇప్పుడు రాజకీయాల్లో రెండు పరిణామాలు ఒకేసారి జరిగాయి. దేశంలో ఒకవైపు అభివృద్ధి నిరోధక ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాజకీయాలు మితవాద మలుపు తీసుకోగా, మరోవైపు వామపక్షాలు ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తిన్నాయి. మనం ఈ ఎదురుదెబ్బలను తీవ్రంగా పరిశీలించాలి. ఎందుకు సిపిఐ(ఎం), వామపక్షాలు వెనుకపట్టు పట్టాయి అన్న విషయాన్ని తీవ్రంగా సమీక్షించాలి.



# సిపిఎం, వామపక్షాల నవీకరణకు నాలుగు చర్యలు

సిపిఐ(ఎం), వామపక్ష పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో పేలవమైన ఫలితాలు సాధించాయి. పార్టీ మొత్తం 93 సీట్లలో పోటీచేసి 3.25% ఓటింగ్‌తో 9 సీట్లనే గెలుచుకుంది. వీటితో పాటు కేరళలో పార్టీ, ఎల్‌డిఎఫ్ మద్దతిచ్చిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. సిపిఐ గెలిచిన ఒక్క సీటుతో కలిపితే మొత్తం 12 సీట్లను వామపక్షాలు గెలుచుకున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో పేలవమైన ఫలితాలపై సిపిఐ (ఎం) లోతైన సమీక్ష చేయాల్సి ఉంది. ఇటువంటి సమీక్షపై ఆధారపడి మాత్రమే సరైన నిర్ధారణలకు రాగలం. ఈ నిర్ధారణల ఆధారంగా పార్టీ రాజకీయ వేదికనూ, నిర్మాణాన్నీ ప్రక్షాళన గావించగలం.

జూన్ 7, 8 తేదీలలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఎన్నికల్లో పార్టీ పనితీరుపై లోతుగా సమీక్షించింది. పార్టీ స్వతంత్ర బలం, ప్రజాపునాది క్షీణించిందని తేలింది. ఈ పరిణామం కేవలం పశ్చిమ బెంగాల్‌లో ఎదురు దెబ్బవల్లనే కాదు దేశవ్యాప్తంగా పార్టీని ముందుకు తీసుకు వెళ్ళడంలో జరిగిన వైఫల్యం వల్ల కూడా జరిగింది. పార్టీనీ, పార్టీ రాజకీయ ప్రభావాన్నీ ముందుకు తీసుకు వెళ్ళడంలో వైఫల్యం బాధ్యత పోలిట్‌బ్యూరోమీదా, పార్టీ నాయకత్వం మీదా ఉంది.

వరుస కేంద్ర ప్రభుత్వాలు – అవి బిజేపి నాయకత్వంలోనివి అయినా లేదా కాంగ్రెస్ నాయకత్వంలోనివి అయినా అవి అనుసరించిన నయా–ఉదారవాద విధానాలను సిపిఐ (యం), వామపక్షాలు నిలకడగా వ్యతిరేకిస్తూ వచ్చాయి. తమ హక్కులు కాపాడుకోడానికీ, ఈ విధానాల తాకిడి నుంచి తమను తాము రక్షించుకోడానికీ శ్రామిక ప్రజలు చేస్తున్న పోరాటాలను అవి నడిపాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రత్యామ్నాయ విధానాల కోసం సిపిఐ(యం), వామపక్ష పార్టీలు ప్రచారం, ఆందోళన చేస్తూ వచ్చాయి. వామపక్షాలు నిరంతరం లౌకిక వాదాన్ని సమర్ధిస్తూ వచ్చాయి. మతతత్వాన్ని వ్యతిరేకించాయి. సామాజికంగా అణగారిన వారి హక్కుల కోసం పోరాడాయి. ఇన్ని చేసినప్పటికీ ఎన్నికల ఫలితాలు వచ్చేటప్పటికీ ప్రజలూ, యువత మద్దతు పొందడంలో పార్టీ విఫలమైంది. లోపాలను సరిదిద్దడానికీ, ప్రజల నుండి పార్టీ వేర్పాటును అధిగమించడానికీ తక్షణం కొన్ని ప్రధానమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని కేంద్ర కమిటీ తన సమీక్షా నివేదికలో పేర్కొంది.

ప్రస్తుత పరిస్థితిని అధిగమించడానికీ, పార్టీ, వామపక్షాలు, ప్రజాస్వామికశక్తుల పురోగమనానికి ప్రాతిపదిక వేసేందుకుగానూ నాలుగు ప్రధాన చర్యలు తీసుకోవాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

**నాలుగు చర్యలు**

1. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవాలని వరుసగా అనేక పార్టీ మహాసభల్లో రాజకీయ–ఎత్తుగడల పంథాల్లో ఆమోదించినప్పటికీ మనం ఆ పని చేయలేకపోయాం. మూడు బలమైన రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర బయట ఈ విషయంలో పురోగమనం లేనేలేదు. పార్టీ స్వతంత్ర బలం వృద్ధి చెందకుండా మన వ్యూహాత్మక లక్ష్యమైనటువంటి బలమైన వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించడమూ, వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను ప్రత్యామ్నాయంగా ముందుకు తీసుకుపోవడమూ సాధ్యం కాదు.

మొట్టమొదటిగా మనం తీసుకోవలసిన చర్య మనం అనుసరిస్తున్న రాజకీయ–ఎత్తుగడలను పంథాను పునపరిశీలించడం. మనం అనుసరిస్తున్న ఐక్యసంఘటన ఎత్తుగడలతో సహా పార్టీకి రాజకీయ పంథాకు చెందిన అన్ని అంశాలనూ విమర్శనాత్మకంగా పరిశీలించాలి. ఇలా చేయడం ద్వారా మాత్రమే మనం సరైన, పరిస్థితులకు అనుగుణమైన రాజకీయ వేదికనూ, నినాదాలనూ ఇవ్వడంలో ఏమైనా లోటుపాట్లూ, తప్పులూ ఉన్నాయేమో గమనించగలం.

సహజంగా పార్టీ మహాసభల సందర్భంగా ఇటువంటి రాజకీయ –ఎత్తుగడల సమీక్షలు జరుపుతాం. కానీ ఇప్పుడున్న పరిస్థితిలో ఇది మాత్రమే సరిపోదు. మనం మన రాజకీయ–ఎత్తుగడలను పంథానే లోతుగా పరిశీలనచేసి, సరైన నిర్ధారణలు తీయాలి. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే పార్టీ మహాసభ ముందుగానే ఇటువంటి పునఃపరిశీలన జరిపి, ఒక నిర్ధారణకు రావాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. రాజకీయ–ఎత్తుగడల పంథాపై జరిపిన ఈ సమీక్షా నివేదికను ముసాయిదా రాజకీయ తీర్మానంతోబాటు మొత్తం పార్టీ ముందు పెట్టడం జరుగుతుంది. ముసాయిదా రాజకీయ తీర్మానంలో పార్టీ మహాసభలో చర్చించబోయే తాజా రాజకీయ–ఎత్తుగడల పంథా ఉంటుంది. ఈ విధంగా రానున్న పార్టీ మహాసభలో ఆమోదించ

ఎన్నికల అనంతరం, ఏ ఎన్నికల తరువాతనైనా ఫలితాలపై సమీక్షించడం పార్టీలో జరుగుతుంది.

గతంలో వామపక్షాలకు ఎక్కువ స్థానాలు పశ్చిమ బెంగాల్‌నుండి వచ్చేవి. కానీ ఇప్పుడు ఈ ఎన్నికల్లో బెంగాల్‌లో సిపిఐ(ఎం), వామపక్షాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దీనికి ఒక కారణం ఎన్నికల్లో వామపక్షాలపై తృణమూల్ గుండాలు జరిపిన దాడులు. గత శాసనసభ ఎన్నికల తరువాత తృణమూల్ కాంగ్రెస్ గూండాల దాడుల్లో మన పార్టీకే చెందిన 150 మంది కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో తీవ్రస్థాయిలో రిగ్గింగు జరిగింది. మొత్తం 65 వేల పోలింగ్ కేంద్రాలకు గాను 10,000 కేంద్రాలను పాలక పార్టీ గూండాలు స్వాధీనం చేసుకుని రిగ్గింగు జరిపారు. అయితే ఈ దాడులనూ, రిగ్గింగునూ, హింసాకాండనూ మన కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఎన్నికల సందర్భంగా మన వాళ్లు లక్షలాదిమంది ప్రజలను సమీకరించి హింసాకాండను ప్రతిఘటించారు. అందుకనే ఎన్నికలు అయిపోయిన తరువాత కూడా మనవారి మీద భౌతిక దాడులు జరుగుతూనే ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ వారు గూండాలను సమీకరించి మనవారిపై దాడులు జరుపుతున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో పార్టీ, వామపక్షాల

బోయే తాజా రాజకీయ-ఎత్తుగడల పంథాపై పార్టీ మొత్తం పార్టీలో ఆంతరంగిక చర్చ జరుగుతుంది.

2. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, మన దేశంలో సరళీకరణ, నయా-ఉదారవాద విధానాల అమలు వల్ల గత రెండున్నర దశాబ్దాల కాలంలో సామాజిక-ఆర్థిక పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. వర్గాల స్థితిగతుల్లో మార్పులు వచ్చాయి. వర్గాల్లో కూడా తేడాలు వచ్చాయి, మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులు కార్మికవర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, మధ్య తరగతుల్లో వచ్చాయి. కొన్ని సంవత్సరాలుగా ఈ మార్పులు రాజకీయ, సంస్థాగత కార్యకలాపాలపై ఎటువంటి ప్రభావాలు వేస్తున్నాయో మనం చూస్తున్నాం. బడా-బూర్జువావర్గం, ఇతర బూర్జువా వర్గం బలాబలాల్లో మార్పులు వచ్చాయి.

మనం నినాదాలు రూపొందించుకునేటప్పుడూ, నయా-ఉదారవాద విధానాలవల్ల బాగా నష్టపోయిన ప్రజల సమస్యలు చేపట్టేటప్పుడూ ఈ మార్పులన్నిటినీ గమనంలోకి తీసుకోవాలి. పాలక వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలంటే మన నినాదాల్లోనూ, వివిధ సెక్షన్లు, వర్గాల పట్ల మనం అనుసరించే ధోరణిలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉంది.

ఇలాంటి మార్పులు తేవాలంటే సమాజంలో వచ్చిన మార్పులనూ, వివిధ వర్గాలు, దొంతర్ల స్థాయిల్లో వచ్చిన మార్పులనూ నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. వివిధ రంగాల్లో అటువంటి నిర్దిష్టమైన అధ్యయాన్ని సాగించాలి. అటువంటి నిర్దిష్ట విశ్లేషణ ఆధారంగానే మనం మన పార్టీ వ్యూహాత్మక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని మన నినాదాలనూ, డిమాండ్లనూ రూపొందిం చుకోవాలి.

ఇటువంటి నిర్దిష్ట అధ్యయనాన్ని ఒక కాలపరిమితి లోపల పూర్తి చేయాలనీ, దాని వల్ల సరైన రాజకీయ-ఎత్తుగడల పంథాను రూపొం దించుకోవడానికి ఉపయోగపడుతుందనీ కేంద్ర కమిటీ నిర్ణయించింది.

3. రాజకీయ మథనంతోపాటు మన పార్టీ నిర్మాణాన్నీ, దాని పని విధానాన్నీ, ప్రజల్లో దాని పని దృక్పథాన్నీ కూడా చూడాల్సిన అవసరం ఉంది. పార్టీ చేస్తున్న ఉద్యమాలు, పోరాటాలను పార్టీకి రాజకీయంగా పనికొచ్చేట్లు మార్చుకోలేకపోవడం ఒక సమస్య. దాంతో పాటు పార్టీలో క్రమంగా మాంద్యం పెరిగిపోయింది. దాంతో అది పోరాటాలను అభివృద్ధి చేయలేకపోతోంది. ఉద్యమాలను ప్రోత్సహించలేకపోతోంది. మూసపోత పనివిధానం, ప్రజలతో సజీవ సంబంధాలు కొనసాగించలేకపోవడం సమ స్యలు. ఆందోళనలు నడపడంలోనూ, ప్రజలతో సంబంధాలు నెరపడంలోనూ సృజనాత్మకత ఉండాలి, కొత్త సాంకేతికతను ఉపయోగించుకోవాలి. పార్టీ నిర్మాణాన్ని ప్రక్షాళన చేయాలి. తప్పుడు పద్ధతులను దిద్దుకోవాలి.

4. పార్టీ భవిష్యత్తులో పురోగమించాలంటే ప్రజా సంఘాలను అభివృద్ధి చేయడం, అవి స్వతంత్రంగా పనిచేసేట్లు చూడ్డం, అవి ప్రజలను విస్తృతంగా సమీకరించేట్లు చూడ్డం అత్యంత ముఖ్యమైన విషయం. ఎన్నికల్లో పార్టీలోనూ, ప్రజా సంఘాల్లోనూ గణనీయమైన భాగం పార్టీకిగానీ, వామపక్షాలకు గానీ ఓటు వేయలేదని రాష్ట్ర కమిటీలు చేసిన ఎన్నికల సమీక్షలు తెలియజేశాయి. వర్గ, ప్రజా సంఘాలను స్వతంత్రంగా పనిచేయిండడంలోనూ, ఈ సంఘాల్లోని ప్రజల మధ్య పార్టీ సభ్యులు నిర్వహించాల్సిన రాజకీయ కృషిలోనూ చాలా లోపాలున్నాయి. వీటిని చాలా తీవ్రంగా తీసుకుని సరిచేయాల్సి ఉంది.

పైన పేర్కొన్న నాలుగు చర్యలూ ఒకదానితో మరొకటి సంబంధం కలిగినవి అందువల్ల వాటిని కలిపి ఒకేసారి చేపట్టాల్సి ఉంది. పార్టీ ఎదుర్కొంటున్న పరిస్థితి తీవ్రతను యావత్ పార్టీ యంత్రాంగం గుర్తించి ఈ నాలుగు చర్యలు తీసుకోడానికి ఉమ్మడి కృషి జరపాలని కేంద్ర కమిటీ మొత్తం పార్టీకి పిలుపునిస్తోంది.

**కొత్త పరిస్థితి**

ఎన్నికల తరువాత, నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపీ-నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేశ:లో కొత్త రాజకీయ పరిస్థితి తలెత్తింది. ఈ ప్రభుత్వం నయా-ఉదారవాద విధానాలను మరింత ఉధృతంగా అమలు జరపబూనుకుంది. ఇప్పటికే బడా-బూర్జువా వర్గమూ, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ముందుకు తెచ్చిన డిమాండ్లు నెరవేర్చడానికి చర్చలు తీసుకుంటు న్నారు. అదే సమయంలో ప్రజలనూ, వారి జీవన ప్రమాణాలనూ దిగజార్చే చర్యలను ముమ్మరం చేశారు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు కారణమైన విధానాలను కొనసాగిస్తున్నారు.

బిజెపీ-ఆర్ఎస్ఎస్ కూటమి హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోడానికి ప్రయత్నాలు చేస్తుంది. రాజ్యంలోని వివిధ సంస్థల్లోకి ఆర్ఎస్ఎస్ చొచ్చుకు పోవడానికి అవకాశాలు కల్పిస్తుంది. హిందూత్వ తీవ్రవాద శక్తులు ఇప్పటికే మైనారిటీల మీదా, లౌకిక విలువల మీదా దాడులు ప్రారంభించారు. పుణెలో జరిగిన పరిణామాలు, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్నాటక, హర్యానాల్లోని కొన్ని ప్రాంతాల్లో జరిగిన మతఘర్షణలు మనకు హెచ్చరిక సంకేతాలు.

**వామపక్షాల పునరుత్తేజం**

సిపిఐ(ఎం), వామపక్షాలు ఈ మితవాద దాడికి ప్రతిఘటనను పెంచాలి. వివిధ సెక్షన్ల శ్రామిక ప్రజలను వారి హక్కుల పరిరక్షణ కోసం సమీకరించాలి, ఉద్యమించాలి. మతతత్వానికీ, మతతత్వ రాజకీయాలను వ్యతిరేకించి నిలిచే స్థిరమైన శక్తి వామపక్షం మాత్రమే. మెజారిటీ మతతత్వపు నిరంతర ప్రమాదానికి వ్యతిరే కంగా జరిగే పోరాటంలో అన్ని రకాల లౌకిక, ప్రజాతంత్ర శక్తు లను సమీకరించడంలో వామపక్షాలు కీలకమైన పాత్ర నిర్వహిం చాలి. అందువల్ల వామపక్షాలను పునరుత్తేజపరిచి, బలపరచడంపై వెంటనే దృష్టి పెట్టాలి. అన్ని రకాల వామపక్ష శక్తులతో కలవడానికి సిపిఐ(ఎం) శక్తివంచనలేకుండా కృషి చేస్తుంది. అన్నిరకాల వామపక్ష ఆలోచనగల శక్తులనూ, గ్రూపులనూ, మేధావులనూ ఏకం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఐక్యమైన, పునరుత్తేజం పొందిన వామపక్షం మాత్రమే భారత దేశ రాజకీయాల్లో వచ్చిన ఈ మితవాద మార్పును ఎదుర్కొనగలదు.

**(పీపుల్స్ డెమోక్రసీలో ప్రకాశ్ కరత్ వ్యాసం)**

ఓటమికి రిగ్గింగు ఒక ప్రధాన కారణం. కానీ అదొక్కటే కారణం మాత్రం కాదు. బెంగాల్‌లోని మన పార్టీలో సంస్థాగత బలహీనతలు కూడా రాష్ట్రంలో మన ఓటమికి ఒక కారణం. 2008 పంచాయితీ ఎన్నికలు, 2009 లోక్‌సభ ఎన్నికల దగ్గరనుండి పశ్చిమ బెంగ్‌లో సిపిఐ(ఎం), వామ పక్షాల ప్రజా పునాది క్షీణిస్తూ వస్తున్నది. ప్రజా పునాది తరుగుదలను ఆపడం కోసం, పోయిన పార్టీ పలుకుబడిని తిరిగి సంపాదించడం కోసం గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన ప్రయత్నం జరిగినా ఫలితం లేకపోయింది. పార్టీ కోల్పోయిన ప్రజా బలాన్ని తిరిగి పొంద లేకపోయింది. వామపక్ష సంఘటన బెంగాల్‌లో వరుసగా 34 సంవత్సరాలు పరిపాలించింది. ఇది దేశ చరిత్రలోనే అరుదైన విషయం. మన ప్రభుత్వాలు అక్కడ ప్రజలకు గొప్ప సేవ చేయడమే కాదు ఈ కాలంలో కొన్ని ప్రతికూలాం శాలు కూడా చోటు చేసుకున్నాయి. మన పార్టీ ప్రజలనుండి కొంతవరకు దూరమైంది. సంస్థా గతంగా బలహీనపడింది. అందుకనే ఈ ప్రతికూలాంశాలు ఏమిటి అనే విషయాన్ని పార్టీ పరిశీలన చేయాల్సి ఉంది.

మనం ఉన్న బూర్జువా రాజ్యాంగ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలను నడపాల్సి ఉంటుందన్న విషయం గుర్తించాలి. పశ్చిమ బెంగాల్ ప్రభు త్వం విప్లవాత్మక మార్పుల ద్వారా అధికారం లోకి రాలేదు. ఈ ప్రభుత్వం ప్రస్తుత బూర్జువా-

> **❝ దేశం మొత్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో వామపక్షాల స్వతంత్ర బలం తగ్గిపోయింది. ఈ వాస్తవాన్ని మనం గుర్తించక తప్పదు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర బయట వున్న రాష్ట్రాల్లో కూడా వామపక్షాలకు పేలవమైన ఫలితాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో పరిస్థితి భిన్నంగా లేదు. అందువల్ల సిపిఐ (ఎం), వామపక్షాల స్వతంత్ర బలాన్ని పెంచుకోకుండా మనం దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించలేం. ❞**




2011లో జరిగిన వైబ్రంట్ గుజరాత్ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ యజమానులతో నరేంద్ర మోడీ

భూస్వామ్య రాజ్యం పరిధిలోనే పనిచేయాలి. అందువల్ల ఈ రాజ్యాంగ వ్యవస్థ కల్పిస్తున్న అనేక ప్రతికూలాంశాలు మన పరిపాలనపై ప్రభావం చూపిస్తాయి.

బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలైంది. ఈ మూడు సంవత్సరాల కాలంలో పశ్చిమ బెంగాల్‌లో మతతత్వ రాజకీయాలు వేళ్లూనుకున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ఒకవైపు బిజెపీ వంటి ఇతర బూర్జువా పార్టీలు మరోవైపు ప్రజలను మతతత్వ ప్రాతిపదికపై విభజించడం ప్రారంభించారు. అందువల్ల నేడు బెంగాల్‌లో మతతత్వ శక్తులు ముందడుగు వేశాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో మతతత్వ బిజెపీకి దాదాపు 17 శాతం ఓట్లు వచ్చాయి. స్వాతంత్ర్యానికి పూర్వం పశ్చిమ బెంగాల్ మొత్తం బెంగాల్‌లో ఒక భాగంగా వుండేది. అటువంటి ప్రాంతాన్ని మత ప్రాతిపదికపై తూర్పు, పశ్చిమ బెంగాల్‌లుగా చీల్చారు. మత ఘర్షణలు జరిగా యి. వేలాది మంది ప్రజలు మత ప్రాతిపదికపై వలసలు పోయారు. బెంగాల్‌లో వామపక్షాలు బలమైన శక్తిగా తయారైన తరువాత మాత్రమే మతతత్వ శక్తులను వెనక్కు నెట్టడం జరిగింది. హిందూమహాసభ నేతృత్వంలోని హిందూత్వ శక్తులనూ, ముస్లిం పార్టీల నేతృత్వంలోని మైనారిటీ మతతత్వ శక్తులనూ వెనక్కు కొట్టడం జరిగింది. 34 సంవత్సరాల వామపక్ష సంఘటన ప్రభుత్వ పాలన ఫలితంగా ఈ శక్తులు పూర్తిగా ప్రజలనుండి వేరుపడ్డాయి. కానీ ఆ శక్తులు నేడు మళ్లీ బలం పుంజుకుంటున్నాయి. అందువల్ల నేడు పశ్చిమ బెంగాల్‌లో రాజకీయంగా, సంస్థాపరంగా ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటాం అనేది మన ముందున్న కర్తవ్యం. ఈ సవాలును అధిగమించేందుకు మనం ఎలా వుద్యమాలు నిర్వహించాలి, ఎలా మన బలాన్ని కూడతీసుకోవాలి అనే అంశాలపై వామపక్షాలు చర్చించి, నిర్ణయాలు తీసుకోవాలి.

దేశం మొత్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో వామపక్షాల స్వతంత్ర బలం తగ్గిపోయింది. ఈ వాస్తవాన్ని మనం గుర్తించక తప్పదు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర బయట వున్న రాష్ట్రాల్లో కూడా వామపక్షాలకు పేలవమైన ఫలితాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో పరిస్థితి భిన్నంగా లేదు. అందువల్ల సిపిఐ (ఎం), వామపక్షాల స్వతంత్ర బలాన్ని పెంచుకోకుండా మనం దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించలేం.

మనం ఇప్పుడు తక్షణ సమస్యలపై సమీక్షిస్తే సరిపోదు. దీర్ఘకాలిక అంశాలపై సమీక్షించాలి. ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయాం, మన బలం ఎందుకు తగ్గిపోయింది, దాన్ని అధిగమించడానికి ఏం చేయాలి అన్నదొక్కటే సరిపోదు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ దీర్ఘకాలిక అంశాలపైన, గత కొంత కాలంగా పార్టీ ఎందుకు దేశవ్యాపితంగా పురోగమించలేకపోతోంది, ఎందుకని మనం చేస్తున్న పోరాటాలనూ, వుద్యమాలనూ రాజకీయ బలంగా మలుచుకోలేకపోతున్నాం అన్న అంశాలపై లోతైన సమీక్ష చేస్తుంది.

ఎన్నికల సమీక్షలు మొత్తంగా పరిశీలిస్తే మనకు అర్థమయ్యే అంశం ఏమంటే పార్టీ యువ జనులను, కొత్తతరం ఓటర్లను ఆకర్షించలేకపోతున్నది. చివరికి గత ఎన్నికల కన్నా మంచి ఫలితాలు సాధించిన కేరళలో కూడా ఫలితాలు మనకు సంతృప్తినివ్వడం లేదు. అక్కడ మొత్తం ఓటింగు శాతం పెరిగినప్పటికీ లోతుగా సమీక్షించినప్పుడు 20-25 సంవత్సరాల యువతరం ఓటింగు మనకు పెద్దగా పెరగలేదని తేలింది. అందువల్ల మార్క్సిస్టు పార్టీ, వామపక్షాలు ఎందుకని యువతరం ఓటర్లను ఆకర్షించలేకపోతున్నాయన్న విషయాన్ని మనం లోతుగా పరిశీలించాలి.

ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని మనం రానున్న పార్టీ మహాసభలో మనం మన రాజకీయ ఎత్తుగడల విధానాన్ని సమీక్షించనున్నాం. దానిలో ఏమైన లోటుపాట్లున్నాయేమోనని పరిశీలించనున్నాం. లేక రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో మనం వెనుకబడుతున్నామా అన్న విషయాన్నీ పరిశీలించనున్నాం. కొత్త పరిస్థితులకు అనుగుణంగా సరైన రాజకీయ నినాదాలు ఇవ్వడంలోనూ, రాజకీయ వేదికలు సృష్టించడంలోనూ యువకులను ఆకర్షించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి అన్న విషయాలను గురించి రానున్న పార్టీ మహాసభలో చర్చించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఈ సమీక్ష జరపడంతోబాటు, మరో అంశాన్ని కూడా పరిశీలించాల్సి వుంది. గత రెండున్నర దశాబ్దాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వల్ల మన దేశంలో కొన్ని సామాజిక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశంలో వుండే వర్గాలు కొన్ని మారాయి. వర్గాల్లోనే కొన్ని విభజనలు ఏర్పడ్డాయి. ఈ మార్పుల ప్రభావం పార్టీమీదా, పార్టీ వుద్యమాల మీదా ఎలా వుందనే విషయం పరిశీలించాల్సి వుంది. భారత దేశంలోని కార్మికులు, మధ్య తరగతి, రైతాంగంలో రైతులు, మధ్యతరగతి రైతులు, వ్యవసాయ కార్మికులు వీరిలో కూడా కొన్ని మార్పులు సంభవించాయి. వారిలో కూడా కొన్ని విభజనలు ఏర్పడ్డాయి. ఆ మార్పులను మనం అర్థం చేసుకోవాల్సి వుంది. కార్మికులనే తీసుకుంటే కార్మికుల పని స్వభావంలో మార్పు వచ్చింది, వారి పని స్థలంలో మార్పు వచ్చింది. మరింత మంది కార్మికులు పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే సమస్యలకు పరిష్కారాలు వెదుకుతున్నారు. ఈ మార్పులను మొత్తంగా అర్థం చేసుకోకపోతే, అర్థం చేసుకుని దానికనుగుణమైన నినాదాలు రూపొందించి, నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకోక

పోతే మనం బలమైన కార్మిక వర్గ ఉద్యమాన్ని నిర్మించలేం.

కార్మికవర్గంలో వస్తున్న మార్పులను గమనించడం, నయా-ఉదారవాద విధానాలను వ్యతిరేకిస్తూ సాధారణ నినాదాలు రూపొందించడంతో సరిపోదు. భారత దేశంలో నయా-ఉదారవాద విధానాలు అనేక రూపాల్లో అమలు జరపబడుతున్నాయి. అందువల్ల సాధారణ నినాదాలతో ఇప్పుడు ప్రజలను సమీకరించడం సాధ్యం కాదు. నయా-ఉదారవాద విధానాల ప్రభావం వల్ల ప్రజలు ఎటువంటి బాధలు పడుతున్నారు, వీటి వల్ల ఏ వర్గాలు ఎలా ప్రభావితమవుతున్నాయి, ఏ వర్గాలు నష్టపోతున్నాయి అన్న విషయాన్ని గమనించి ఆ నష్టపోతున్న వర్గాలను ఉద్యమాల్లోకి సమీకరించినప్పుడే మనం మన లక్ష్యాన్ని సాధించగలం. పార్టీలోనూ, ప్రజా సంఘాల్లోనూ ఈరకమైన మార్పు రావాలి. ఇటువంటి మార్పుల ఎలా తేవాలి, దీనికి గాను ఎటువంటి చర్యలు తీసుకోవాలి అన్న విషయాన్ని మహాసభలో చర్చిస్తాము.

మన పార్టీ పని విధానం, మన ప్రజా సంఘాల పని విధానం గురించి కూడా సమీక్షించాల్సిన అవసరం ఉంది. మనం గతంలో అనుసరించిన మూసపోత పని పద్ధతుల్ని విడనాడాల్సి ఉంది. సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. దానికి అనుగుణమైన నిర్మాణ పద్ధతులు, పనిపద్ధతులను మనం అనుసరించాలి. గతంలో లాగా రొడ్డకొట్టుడు పద్ధతి, మూసపోత పద్ధతి పనికిరాదు. నేను ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర బీహార్‌లో మన పార్టీ సానుభూతిపరుడైన ఒక వ్యవసాయ కార్మికుని ఇంటికి వెళ్లాను. అదో ఉమ్మడి కుటుంబం. వారి ఇంట్లో నీటి కుళాయిలుగానీ, ఇతర ప్రాథమిక సదుపాయాలు గానీ ఏమీ లేవు. కానీ రెండు టీవీలు ఉన్నాయి. వాళ్లు మోడీ గురించీ, గుజరాత్ పరిణామాల గురించీ టివీలో చూసి చెప్పగలుగుతున్నారు. అందువల్ల ఈనాడు సమాజంలో వస్తున్న ఇటువంటి మార్పులను మనం గమనించి వాటికి అనుగుణమైన నినాదాలివ్వాలి, నిర్మాణ పద్ధతులు అనుసరించాలి. అంతేగానీ గతంలో లాగా మూసపోత పద్ధతులు ఇప్పుడు పనికిరావు.

మనం అనేక రకాల వర్గ, ప్రజా సంఘాల్లో పనిచేస్తుంటాం. ఈ వర్గ, ప్రజా సంఘాల్లో పని చేయడం ద్వారానే మనం మన రాజకీయ ఉద్యమాన్ని నిర్మించుకుంటాం. కానీ మనం ఈ ఎన్నికలకు సంబంధించి ఒక విషయం గమనించాల్సింది ఏమంటే, మన వర్గ సంఘాల్లో, మన ప్రజా సంఘాల్లో ఉన్న వారు ట్రేడ్‌యూనియన్లలో, వ్యవసాయ కార్మికసంఘంలో, యువజన సంఘాల్లో ఉన్న వాళ్లు మనకు చాలా వరకు ఓటు వేయలేదు. వాళ్లు ఉద్యమంలో మనతో ఉన్నారు కానీ రాజకీయంగా సిపిఐ (ఎం)తోనూ, వామపక్షాలతోనూ లేరు. మనతో ఉద్యమంలో ఉండే వారు కూడా మనకు ఎందుకు ఓటు వేయలేదు అన్న విషయాన్ని కూడా మనం లోతుగా పరిశీలించాల్సి ఉంది. వాళ్లు సమస్యలు వచ్చేసరికి మనతో ఉంటారు, కానీ ఎన్నికలు వచ్చేసరికి ఓట్లు ఎందుకు ఇతర పార్టీలకు వేస్తారు అన్ని విషయం అధ్యయనం చేయాల్సి ఉంది.

❝ వామపక్ష ఐక్యత గురించి చెబుతున్నానంటే అది కేవలం ఎన్నికల్లో ఐక్యత మాత్రమే కాదు. ఉమ్మడి వేదికల మీద, ఉమ్మడి నినాదాల ప్రాతి పదికపై ఏర్పడే ఐక్యత, ఐక్య ఉద్యమాలు, చర్యల అధారంగా ఏర్పడే ఐక్యత కావాలి. ఇది కావాలంటే వామపక్ష శక్తుల మధ్య మరింత ఎక్కువ, లోతైన అవగాహన ఏర్పడ్డం అవసరం. ప్రజా ఉద్యమాల నిర్మాణంలో వాటి మధ్య మరింత సమన్వయం అవసరం. ❞

ఈ విషయాలన్నింటినీ కూడా కూలంకషంగా పరిశీలన చేసి మనం రానున్న రోజుల్లో అనేక మార్పులు చేసుకుంటాం. నిర్మాణంలో, వ్యవస్థాగతంగా అనేక మార్పులు చేసుకుంటాం. ఆ విధంగా మార్పులు చేసుకుని పార్టీ తిరిగి ప్రజల్లోకి వెళ్లి వాళ్లను సమీకరిస్తుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో వామపక్ష ఐక్యత అవసరం ఎంతో ఉంది. అయితే నేను వామపక్ష ఐక్యత గురించి చెబుతున్నానంటే అది కేవలం ఎన్నికల్లో ఐక్యత మాత్రమే కాదు. ఉమ్మడి వేదికల మీద, ఉమ్మడి నినాదాల ప్రాతి పదికపై ఏర్పడే ఐక్యత, ఐక్య ఉద్యమాలు, చర్యల అధారంగా ఏర్పడే ఐక్యత కావాలి. ఇది కావాలంటే వామపక్ష శక్తుల మధ్య మరింత ఎక్కువ, లోతైన అవగాహన ఏర్పడ్డం అవసరం. ప్రజా ఉద్యమాల నిర్మాణంలో వాటి మధ్య మరింత సమన్వయం అవసరం. ఇటువంటి ఐక్యత కేవలం మూడు, నాలుగు వామపక్ష పార్టీల మధ్య ఏర్పడితే సరిపోదు. మన దేశంలో ఇంకా విశాలమైన వామపక్ష శక్తులున్నాయి. వామపక్ష పార్టీలు, వామపక్ష గ్రూపులు, వామపక్ష మేధావులు వీరంతా విశాల ఐక్య వేదిక మీదకు రావాలి. ఇది జరగాలంటే వామపక్షాలకు చెందిన వివిధ సంస్థలు, గ్రూపుల మధ్య చర్చ జరగాలి. ఆ చర్చ ద్వారా వారు ఒక ఉమ్మడి అభిప్రాయానికి రావాలి. ఇటువంటి వామపక్ష శక్తులన్నిటి ఐక్య కార్యాచరణ మాత్రమే దేశంలో బలమైన వామపక్ష ఐక్యతను నిర్మించగలదు. ఇటువంటి వామపక్ష ఐక్య వేదిక చుట్టూ దేశంలోని ప్రజాతంత్ర శక్తులను సమీకరించాలి. బలమైన వామపక్ష ఉద్యమం లేకుండా దేశంలో ఇతర ప్రజాతంత్ర శక్తులను సమీకరించడం సాధ్యం కాదు. ఇటువంటి బలమైన వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమం మాత్రమే దేశంలో మితవాద, అభివృద్ధి నిరోధక శక్తులను ఎదుర్కొనగలదు.


ఇదేదో దీర్ఘకాలిక కర్తవ్యంగా మనం చూడకూడదు. ఈ పనిని మనం వెంటనే ప్రారంభించాలి. సాధ్యమైనంత వరకు ఒకటి రెండు మాసాల్లోనే అంటే జులైలోగానీ, ఆగష్టులో గానీ జాతీయ స్థాయిలో వామపక్ష పార్టీలు, శక్తులు, గ్రూపులను ఒక వేదిక మీదకు తెచ్చి వాటి మధ్య ఇటువంటి చర్చ ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

నేను ఇంతకు ముందే చెప్పినట్లు నరేంద్ర మోడీ ప్రభుత్వం తన నయా-ఉదారవాద విధానాలను మరింత ఉధృతంగా అమలు చేసే పరిస్థితిలో మనం ఉన్నాం. సామాన్య ప్రజలపై, ముఖ్యంగా పేద వర్గాలపై రానున్న కాలంలో మరిన్ని భారాలు పడనున్నాయి. ఈ దేశంలో మోడీ నయా-ఉదారవాద విధానాలను వ్యతిరేకించే, ప్రజల పక్షాన నిలిచి వారి ప్రయోజనాలు కాపాడేందుకు పాటుపడే ఏకైక శక్తి వామపక్షాలు మాత్రమే. ఇతర ఏ శకీ ఈ పనిచేయలేవు. రెండోది, దేశంలో వామపక్షాలు మాత్రమే నిజమైన లౌకికతత్వం కోసం నిలబడతాయి. కాంగ్రెస్ పార్టీతో సహా ఇతర పార్టీలు, గ్రూపులు, లౌకిక తత్వం కోసం ఎంతవరకు నిలబడుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. అందువల్ల మతతత్వ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడాలంటే, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా నిలబడా

(మిగతా 20వ పేజీలో)

**అధ్యయనం**

# ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికులపై సంస్కరణల ప్రభావం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బి.వి. రాఘవులు**

**1)** సరళీకరణ విధానాలు ప్రవేశించిన తర్వాత వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు వ్యవసాయ కార్మికుల పరిస్థితిలో కూడా మార్పులు తెచ్చాయి. పంటలలో వైవిధ్యం పెరగడం, వాణిజ్య పంటల విస్తీర్ణం పెరగడం, లావాదేవీలన్నీ డబ్బుద్వారా జరగడం, వినిమయ దారీ ధోరణి మారుమూల గ్రామాలలోకి సైతం వ్యాపించటం... ఇవన్నీ వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులమీదా, పని పరిస్థితుల మీదా, వినిమయ అలవాట్ల మీదా ప్రభావం చూపాయి. వ్యవసాయ కార్మికుల జీవితంలో వచ్చిన మార్పు ఒకవైపు వారు ఒక తరగతిగా ఐక్యమయ్యే శక్తిని బలహీనపర్చిందిబీ మరోవైపు భూస్వామ్య అవశేషాలను అధిగమించి స్వతంత్రంగా వ్యవహరించగలిగే అవకాశాలను పెంచింది. ఈ వైరుధ్య పూరిత ప్రభావాలు ఒక వైపున గ్రామీణ పెత్తందార్ల ప్రభావాన్ని వ్యవసాయ కార్మికులపై బలహీనంచేస్తుంటే మరోవైపున కొత్తపద్ధతుల్లో ఆధిపత్యాన్ని నిలబెట్టుకొనే అవకాశాలను పెంచుతున్నాయి.

**2)** ఆంధ్రప్రదేశ్‌లో 2001 జనగణన ప్రకారం మొత్తం పనివాళ్లలో 40శాతం మంది వ్యవసాయ కార్మికులు. జిల్లాలవారీగా చూస్తే తెలంగాణాలోని ఖమ్మం జిల్లాలో అత్యధికంగానూ (44 శాతం), అదిలాబాద్‌జిల్లాలో అతి తక్కువగానూ (22శాతం) ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతంలో పశ్చిమగోదావరిజిల్లాలో అత్యధికంగానూ (53 శాతం), విశాఖజిల్లాలో అతి తక్కువగానూ (20 శాతం) ఉన్నారు. నీటిపారుదల సౌకర్యాలు, వ్యాపార పంటలు అధికంగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయ కార్మికుల సంఖ్య అధికంగా ఉన్నదనేది పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల సంఖ్య ప్రతి దశాబ్దంలోనూ పెరుగుతూ వస్తున్నది. వ్యవసాయ దారుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. కమతాల విభజన ద్వారా రైతుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అంతకన్నా ఎక్కువగా పేద రైతులు దివాళా తీసి వ్యవసాయ కార్మికులుగా మారుతున్నారు. చేతివృత్తులు దెబ్బతిని కూలీలుగా మారుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూలీలసంఖ్య పెరుగుతున్న వేగానికి తగినట్టుగా పారిశ్రామిక సేవా రంగాల్లో పనులు పెరగకపోవడంతో పనివాళ్లు వ్యవసాయంమీదే ఆధారపడి బతకాల్సి వస్తున్నది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలలో 7శాతం పట్టణ జనాభా పెరిగినప్పటికీ వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరగడం చూస్తే వ్యవసాయేతర రంగాల పెరుగుదల పనివాళ్లను ఇమిడ్చుకునే పద్ధతిలో జరగలేదని స్పష్టంగా కన్పిస్తున్నది. ఉపాధిని సృష్టించలేని అభివృద్ధి ఇలాగే జరిగితే వ్యవసాయ రంగంపై ఆధారపడి బతకాల్సిన జనాభా ఎక్కువై పేదల పరిస్థితులు ఇంకా అధ్వాన్నంగా మారే అవకాశం ఉన్నది. గ్రామసీమల్లో వ్యవసాయేతర కార్యకలాపాలు పెరిగి గ్రామాల్లో ఉన్న పేదలు ఆ పనుల్లోకి వెళితే వ్యవసాయంపై కొంత భారం తగ్గుతుంది. గ్రామసీమల్లో వ్యవసాయేతర పనులు కొంతకాలం పెరిగి ఇప్పుడు స్తబ్దతలోకి వచ్చినట్టు కన్పిస్తోంది. అలాగే దగ్గరలో ఉన్న పట్టణాలకు వలసలు వెళ్లి బతకగల్గే అవకాశాలు కూడా ఈ మధ్య సన్నగిల్లడం జరిగింది.

గణాంకాల్లో వ్యవసాయేతర పనుల్లో ఉండేవారు కొంత మంది వ్యవసాయ కార్మికులుగా నమోదై ఉండవచ్చు. స్వచ్ఛమైన వ్యవసాయ కార్మికులుగా ఉండే వారు గణాంకాల్లో కన్నా తక్కువగా ఉండవచ్చు.

**3)** వ్యవసాయ కార్మికులలో ఒకప్పుడు స్త్రీ, పురుషులు దాదాపు సరిసమానమైన పాత్ర నిర్వహించే వారు. ఇప్పుడు వ్యవసాయ పనులు అత్యధిక భాగం స్త్రీలే చేస్తున్నారు. మొత్తం వ్యవసాయ పనుల్లో పురుషులు 30శాతం పాల్గొంటే 70శాతం స్త్రీలు చేస్తున్నారు. క్రమేణా స్త్రీల ప్రమేయం పెరుగుతూ వస్తున్నది. సాంప్రదాయకంగా పురుషులు చేసే పనులన్నీ యంత్రాలతో చేయించటం ఒక కారణమైతే ఎక్కువ కూలీ గిట్టుబాటయ్యే వ్యవసాయేతర పనులకు పురుషులు మరలడం ఇంకో కారణం. స్త్రీలలో చదువు తక్కువ ఉండడం, కుటుంబ భారం మోయాల్సి రావడం, స్థానిక వ్యవసాయ పనులకు స్త్రీలను పరిమితం చేస్తున్నాయి. వ్యవసాయ కార్మిక కుటుంబాలలో చదువుకున్న కొత్త తరం యువకులు గ్రామాల్లో నివసిస్తున్నప్పటికీ వ్యవసాయేతర పనులవైపు మొగ్గుచూపుతున్నారు. వ్యవసాయంలో కూడా నైపుణ్యమైన పనులు చేయడానికి సిద్ధం అవుతున్నారు. అందువలన ఎక్కువమంది కూలీలు అవసరమైన పనులన్నీ మహిళలే చేస్తున్నారు.

వ్యవసాయేతర పనులు గ్రామాల్లో పెరగడం పట్టణాలలో గ్రామీణ వేతనాలకన్నా అధికంగా వచ్చే అవకాశాలు ఉండడం పురుషులను వ్యవసాయేతర పనులు ఆకర్షిస్తున్నాయి. అప్పుడప్పుడు వ్యవసాయంలో గిరాకీ పెరిగి కూలిరేట్లు ఆకర్షణీయంగా ఉన్నప్పుడు వ్యవసాయ పనులుచేసినా పురుషులు ఎక్కువగా వ్యవసాయేతర పనులవైపుకే మొగ్గుచూపు తున్నారు. వ్యవసాయ కార్మికసంఘ ఆందోళనలలో, సమీకరణలలో ప్రధానంగా మహిళలే పాల్గొనడానికీ, పురుషులు ప్రేక్షక పాత్ర వహించడానికీ వ్యవసాయ పనులలో పురుషులు నేరుగా పాల్గొనకపోవడం ఒకముఖ్య కారణం కావచ్చు.

**4)** గత రెండు దశాబ్దాలలో వ్యవసాయేతర ఆర్థిక కార్య కలాపాలు పెరగడంతో పట్టణాలలో నిర్మాణ రంగం, సేవా రంగం పెరగడంతో గ్రామీణ పేదలు పనులకోసం పట్టణాలకు

> **"యంత్రాల వినియోగం మూలంగా వ్యవసాయంలో ఉత్పాదకత పెరిగింది. పంటల తీవ్రత పెరిగింది. యాంత్రీకరణ వలన తగ్గిన పనిదినాల కన్నా రెండు పంటలు వేయడం, వ్యాపారపంటలు వేయడం మూలంగా వ్యవసాయ కార్మికులకు మొత్తం పని దినాలు కొంత మేరకు పెరిగాయి."**



రాష్ట్రంలో త్వరితగతిన వ్యవసాయ కార్మికుల స్థానాన్ని యంత్రాలు ఆక్రమిస్తున్నాయి.

వలస వెళ్లడం పెరిగింది. రవాణా సౌకర్యం మెరుగు కావడం, దగ్గర ప్రాంతాలకు, దూర ప్రాంతాలకు కూడా ప్రయాణం చేయడం సులువుగావడం, వలసలను పెంచాయి. నైపుణ్యం కలిగిన పురుషులు ఎక్కువ సంపాదన కోసం వలస వెళ్లితే కరువు ప్రాంతాలనుండి, మెట్ట ప్రాంతాలనుండి వ్యవసాయ కూలీలు, పేద రైతులు పొట్టకూటికోసం సుదూర ప్రాంతాలకు సైతం వలసలు వెళుతున్నారు. కొన్ని నెలల్లో పేటలకు పేటలే నిర్మానుష్యం అవుతున్నాయి.

వలస కార్మికులను పనికి తీసుకెళ్లే దళారీ వ్యవస్థకూడా విస్తృతంగా వ్యాపించింది. కొన్ని పనులకు (ఇటుక బట్టీలు వేయడం, పొగాకు కొట్టడం, చెరుకు నరకడం, మిర్చి ఏరడం) దళారీలు ముందుగా అప్పులు ఇచ్చి, కూలీల ముఠాలను సుదూర ప్రాంతాలనుంచి సీజన్‌లో తెచ్చి పనులు చేయిస్తారు. ఈ దళారీలు వెట్టి చాకిరి చేయించటంతో పాటు తీవ్ర దోపిడి చేస్తారు. కూలీలు స్థానికులు కానందున రోజంతా పని చేస్తారనీ, తొందరగా పని అవుతుందనీ, ప్రతిఘటించకుండా అణిగి మణిగి ఉంటారనీ వలస కార్మికులను భూ యజమానులు కూడా కోరుకుంటారు.

**5)** సరళీకరణ విధానాలు ప్రవేశించిన తర్వాత కౌలు దారీ వ్యవసాయం వేగంగా పెరిగింది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో వరి వ్యవసాయంలో కౌలు పద్ధతి వేళ్లూనుకున్నది. వ్యవసాయ కార్మికులలో అనేక మంది ఇప్పుడు కౌలు దార్లుగా మారారు. కౌలు వ్యవస్థ బలంగా ఉన్న జిల్లాల్లో కూడా వ్యవసాయ కార్మికుల సంఖ్య అత్యధికంగా ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. బహుశా కౌలుదార్లనూ, సీజనల్‌గా వ్యవసాయేతర పనులలో ఉండే కూలీలను కూడా వ్యవసాయ కార్మికులుగానే పరిగణించడం దీనికి కారణం కావచ్చు. భూయజమానులు ఉద్యోగ రీత్యా, వ్యాపార రీత్యా, సౌఖ్యవంతంగా జీవించాలన్న అభిలాష రీత్యా పట్టణాలకు వలసలు పోవడంవలన, అంతే కాకుండా వ్యవసాయేతర వ్యాపకాలు ప్రధానంగా ఉన్నందున డెల్టా ప్రాంతాలలో ఉన్న అనేక మంది భూయజమానులు తమ భూములను గ్రామల్లో ఉన్నప్పటికీ కౌలుకి ఇస్తున్నారు. గతంలో వ్యవసాయం చేయడం తమకు సాధ్యం కాదనుకున్నప్పుడు భూములను అమ్మకం పెట్టేవారు. ఇప్పుడు దానికి పూర్తి భిన్నంగా భూములను ఉంచుకోవడమే కాకుండా అదనంగా కూడా కొంటున్నారు. సరళీకరణ విధానాల తర్వాత భూమి విలువ నిరంతరం పెరుగుతుండడంతో బంగారంలాగానే భూమిని కూడా సంపద నిల్వ చేసుకునే సాధనంగా భూ యజమానులు చూస్తున్నారు. కౌలు ద్వారా వచ్చేది అదనపు ఆదాయంగా భావిస్తున్నారు. అందుకే పెట్టుబడిదారీ విధానం వ్యాపించే కొద్దీ కౌలు వ్యవస్థ తగ్గాల్సింది పోయి పెరగడం చూస్తున్నాము. డెల్టాల్లోనే కాకుండా వ్యాపార పంటలు వ్యాపించిన మెట్ట ప్రాంతాలలో కూడా కౌలు వ్యవస్థ బలపడుతున్నది. అన్ని ప్రాంతాలలో పెట్టుబడి దారీ కౌలు పద్ధతికన్నా పేద రైతుల కౌలుపద్ధతి ఎక్కువగా వ్యాపిస్తున్నది.

వ్యవసాయ కార్మికులే ఎక్కువగా కౌలు రైతులుగా మారడం వ్యవసాయ కార్మిక ఉద్యమానికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. భూయజమానులు తెరవెనక్కి పోవడంతో కూలీలకూ, కౌలుదార్లకూ వైరుధ్యం ఏర్పడే సందర్భాలు వస్తున్నాయి. కౌలుదార్లు ప్రధానంగా కుటుంబ శ్రమమీద ఆధారపడినప్పటికీ అప్పుడప్పుడు కూలీలను పెట్టుకునే సందర్భాలు వున్నందున కూలీరేట్లు పెరగడం తమకు నష్టమన్న భావంతో కూలీరేట్ల ఉద్యమం పట్ల ప్రతికూలంగా ఉంటున్నారు. అందువలన కౌలుదారీ పద్ధతి బాగా వ్యాపించిన ప్రాంతంలో కూలి రేట్ల ఉద్యమం బలంగా ముందుకు రావడంలేదు.

**6)** ఈ కాలంలో వ్యవసాయంలో యాంత్రీ కరణ పెరిగింది. మెట్ట, మాగాణితో నిమిత్తం లేకుండా, పంటలతో నిమిత్తం లేకుండా యంత్రాల వినియోగం వ్యాపించింది. యాంత్రీ కరణ మూలంగా వ్యవసాయ కార్మికుల పనిదినా లు తగ్గాయి. యంత్రాల మూలంగా కొన్ని కొత్తరకం పనులు వచ్చినప్పటికీ వాటివలన కోల్పోయిన పనిదినాలే ఎక్కువ. వచ్చిన పనులు కూడా నైపుణ్యం కలిగిన కొద్ది మందికి మాత్రమే పరిమితం అయ్యాయి.

అయితే యంత్రాల వినియోగం మూలంగా వ్యవసాయంలో ఉత్పాదకత పెరిగింది. పంటల తీవ్రత పెరిగింది. యాంత్రీకరణ వలన తగ్గిన పనిదినాల కన్నా రెండు పంటలు వేయడం, వ్యాపారపంటలు వేయడం మూలంగా వ్యవసాయ కార్మికులకు మొత్తం పని దినాలు కొంత మేరకు పెరిగాయి.

అలాగే పెరిగిన పనిదినాలు కూడా సంవత్సరం మొత్తంమీద విస్తరించి ఉంటే స్థానిక వ్యవసాయ కార్మికులకు చేతినిండా పని ఉంటుంది. ఆధునిక ఉత్పత్తి పద్ధతులు, మార్కెట్ అవసరాల మూలంగా పంట సేకరణ, అమ్మకం, రవాణా అన్నీ స్వల్ప కాలంలోనే జరుగుతుండడం వలన వ్యవసాయ పని దినాలన్నీ కొద్ది కాలంలోకే కుక్కబడుతున్నాయి. దీంతో ఉన్న కార్మికులతో పాటు వలస కార్మికులను రప్పించి వ్యవసాయ తరుణాన్ని స్వల్ప వ్యవధిలోనే పూర్తి చేయడంతో పనిదినాలు పెరిగినప్పటికీ స్థానిక వ్యవసాయ కార్మికులకు ప్రయోజనం లేకుండా పోతున్నది.

**7)** నైపుణ్యమైన పనులను, ఎక్కువ కూలీ గిట్టుబాటయ్యే పనులను సహజంగానే యువకులైన వ్యవసాయ కార్మికులు చేజిక్కించుకుంటున్నారు. స్త్రీలు, వయసు మళ్ళినవారు చొరవలేని వ్యవసాయ కార్మికులు తక్కువ ఆదాయం వచ్చే పనుల్లో ఎక్కువ చాకిరి చేయాల్సిన పనులలో చిక్కుకుంటున్నారు. ఆ రకంగా ఎక్కువదోపిడీకి గురౌతున్నారు.

❝ వినిమయ దారీ సంస్కృతి పెరగడం, తాగుడు పెరగడంతో ఆదాయంలో పోషకాహారానికి పెట్టే భాగం పరిమితమై, వ్యవసాయ కార్మికులలో పోషకాహారలోపం ఈ కాలంలో తీవ్రమైంది. ❞

పంటలలో వైవిధ్యం పెరగడం, గ్రామసీమల్లో వ్యవసాయేతర పనులు పెరగడం గ్రామీణ శ్రామికుల పని పరిస్థితుల్లో కూడా మార్పులు తెచ్చాయి. పనులలో నైపుణ్య విభజన పెరిగింది. నైపుణ్యమైన పనులు చేయగల్గిన కూలీలకు ఎక్కువ ఆదాయం రావడంతో వ్యవసాయ కార్మిక కుంటుంబాల మధ్య ఆదాయ వ్యత్యాసాలు పరిమితంగానైనా ప్రారంభం అయ్యాయి.

**8)** వ్యవసాయ పనులలో కాంట్రాక్టు పద్ధతి బాగా విస్తరించింది. సామూహికంగా చేయాల్సిన పనులన్నీ గుత్త పద్ధతి కిందకు వచ్చాయి. కొన్ని వ్యక్తిగత పనులుకూడా పీస్‌రేట్ రూపంలోకి మారిపోయాయి. దీని మూలంగా పని తీవ్రత పెరగడం, యువకులూ, దృఢ శరీరం కలిగిన వారూ మాత్రమే పని ముఠాలలో నిలబడగల్గడం జరుగుతున్నది. దోపిడి తీవ్రత పెరిగింది. దీని మూలంగా భూ యజమాని అన్ని రకాలా లాభపడుతున్నాడు.

**9)** ఒకే ప్రాంతంలో, ఒకే గ్రామంలో రకరకాల పంటలు వ్యాపించటంతో పనులలో వైవిధ్యం, కూలీ రేట్లలో వైవిధ్యం, పని సీజనల్‌లో వైవిధ్యం పెరిగింది. దీంతో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడానికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించటం, డిమాండ్‌లను తయారు చేయడం, కార్యక్రమాలను ఇవ్వడం సమీకరణలను చేయడం కష్టమవుతున్నది.

**10)** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధిహామీ పనులు సాపేక్షంగా ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు మెరుగుగా అమలు జరుగుతున్నాయి. చట్టం 100రోజుల పని కల్పించాలని చెపుతున్నప్పటికీ ప్రభుత్వ అంచనా ప్రకారం 79 రోజులు పనులు కల్పించబడ్డాయి. ఇందులో కొంతభాగం అక్రమాల మూలంగా వ్యవసాయ కార్మికులకు లబ్ది చేకూరకపోయినా, మొత్తంమీద ఆశించేంత కాకపోయినా వ్యవసాయ కార్మికులకు ముఖ్యంగా స్త్రీలు, వయసు మళ్ళిన వారికి కొంత లబ్ది జరిగింది. కూలీ రేట్లు పతనం కాకుండా అడ్డుకోగల్గింది. అప్పుల ఊబిలో పడకుండా కొంత రక్షించింది.

అయితే ఉపాధిహామీ పథకం వ్యవసాయానికి ఎంతో హాని చేస్తున్నదని పాలక వర్గాలు, మీడియా తీవ్రమైన దాడి ప్రారంభించాయి. కూలీల కొరత తీవ్రమైందనీ, కూలీ రేట్లు విపరీతంగా పెరిగిపోయాయనీ ప్రచారం చేస్తున్నాయి. ఈ ప్రచారంలో వాస్తవం కన్నా వర్గ ద్వేషం ఎక్కువగా కన్పిస్తోంది. ఉపాధిహామీ పనులు జరిగిన వివరాలను పరిశీలిస్తే వ్యవసాయ సీజన్‌లో జరిగింది తక్కువ, ఇతర సమయాల్లో జరిగింది ఎక్కువన్న విషయం ఎవరికైనా అర్థమవుతుంది. అయితే వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు ఆదాయం పెరిగి, గ్రామసీమల్లో పేదలు స్వతంత్రంగా వ్యవహరించే శక్తి వచ్చి, భూస్వాముల పెత్తనానికి ఆటంకం ఏర్పడుతుందన్నదే ఈ ప్రచారాలలో ఎక్కువ కన్పిస్తున్నది. కౌలుదార్ల బేరసారాల శక్తి పెరిగి తమ తీవ్ర దోపిడీకి ఇబ్బంది జరుగుతుందన్న భావన కూడా దుష్ప్రచారం వెనక ఉన్నది. ఈ ఆధిపత్య కోణం నుండే ప్రధానంగా పాలక వర్గాల వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

వాస్తవంగా ప్రభుత్వం ప్రచారాలు ఎన్ని చేసినా వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించలేక పోయింది. ఉపాధిహామీ పథకం యాంత్రీకరణను వేగిరపర్చింది. అయితే జీవంలేని యంత్రాలమీద ఆధారపడితే లాభం పెరగవచ్చునేమో గానీ వ్యవసాయ కూలీలు పనికోసం తమ మీద ఆధారపడితేనే గ్రామసీమల్లో భూకామాందుల పెత్తనం స్థిరంగా ఉంటుంది. అందుకే గ్రామీణ పాలక వర్గాలు ఉపాధి పథకాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాయి. పథకాన్ని తొలగించకపోయినా తమ వ్యక్తిగత వ్యవసాయానికి అనుసంధానం జేయాలని డిమాండ్ చేస్తున్నాయి. బూర్జువా పార్టీలన్నీ ఇందుకు వంత పాడుతున్నాయి.

**11)** వ్యవసాయ కార్మికుల వినిమయ అలవాట్లుకూడా పరిస్థితుల ప్రభావం మూలంగా మారుతున్నాయి. వ్యవసాయ కార్మికుల జీవి తాలు కూడా పూర్తిగా డబ్బు, లావాదేవీలతో ముడిపడుతున్నాయి. అన్నింటికీ మార్కెట్ మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి ప్రభావం, ప్రభుత్వ విధానాల ప్రభావం వ్యవసాయ కార్మికుల జీవి తాల మీద తక్షణం పడేంతగా వారి జీవితాలు మిళితం అయిపోయాయి. వినిమయ సరుకుల కొనుగోలు వ్యవసాయ కార్మికులలో కూడా పెరిగింది. సెల్‌ఫోన్లు, టి.విలు, ఫ్యాన్లు, చిన్నతరహా వాహనాలను 15 నుండి 20 శాతం కుటుంబాలు సమకూర్చుకున్నాయి. విద్యుత్, వంటగ్యాస్‌లను కొన్ని కుటుంబాలు సమకూర్చుకున్నాయి. పిల్లలను చదివించుకోవాలనే ఆకాంక్ష వ్యవసాయ కార్మిక కుటుంబాలలో పెరిగింది. ఆరోగ్యంకోసం పెట్టేఖర్చు పెరిగింది. అయితే ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రైవేటు రంగంవైపుకూడా కొంతమంది మొగ్గు చూపిస్తున్నారు. మగవారిలో తాగుడు ఎక్కువైంది. ప్రభుత్వ విధానాలు తాగుడును ప్రోత్సహిస్తుండడం, మద్యం విచ్చల విడిగా అందుబాటులోకి రావడం, తాగుడు పట్ల చులకనభావం సమాజంలో తగ్గడం, తాగుబోతు తనం పెరగడానికి దోహదపడింది. వ్యవసాయ కార్మికులలో తాగుడుకు బానిసలై యవ్వనంలో చనిపోయే మగవారి సంఖ్య ప్రతిపేటలోనూ గుర్తించదగినంతగా ఉంటోంది. తాగుబోతు భర్తలు చనిపోయిన యువతుల సంఖ్య గణనీయంగా ఉంటున్నది.

వినిమయ దారీ సంస్కృతి పెరగడం, తాగుడు పెరగడంతో ఆదాయంలో పోషకాహారానికి పెట్టే భాగం పరిమితమై, వ్యవసాయ కార్మికు లలో పోషకాహార లోపం ఈ కాలంలో తీవ్ర మైంది.

**12)** వ్యవసాయ కార్మిక కుటుంబాలకు అప్పులు గణనీయంగా పెరిగాయి. ప్రతి కుటుంబాన్నీ అప్పుల వలయంలోకి లాగడం ద్వారా వినిమయ సరుకుల అమ్మకాలనూ, మార్కెట్‌నూ అభివృద్ధి చేసుకోవడం అనేది సరళీకరణ విధానాలలో ఒక ముఖ్య అంశం. పాలకులు పెంచి పోషిస్తున్న అప్పుల సంస్కృతి విష వలయంలో వ్యవసాయ కార్మిక కుటుంబాలు కూడా చిక్కుకుంటున్నాయి. వ్యక్తులనుంచీ, స్థానిక వడ్డీ వ్యాపారుల నుండే కాకుండా డ్వాక్రా బృందాల ద్వారా అప్పులు తీసుకుంటున్నారు. ప్రపంచ బ్యాంక్ తదితర అంతర్జాతీయ సంస్థలు ప్రోత్సహిస్తున్న మైక్రోఫైనాన్స్ సంస్థలు వ్యవసాయ కార్మికుల కుటుంబాలను ఋణ బంధనాలలో ఇరికిస్తున్నాయి. మొత్తంమీద తెచ్చిన అప్పులను తీర్చటం, మళ్ళీ అప్పులు చేయడం అత్యధిక వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఊపిరిసలపని నిరంతర కార్యక్రమంగా మారిపోయింది.

**13)** వ్యవసాయ కార్మికుల సంఖ్యలోనూ, వ్యవసాయ కార్మికుల సామాజిక పొందికలోనూ కూడా మార్పు వస్తున్నది. 2001 సంవత్సరం వివరాలను పరిశీలిస్తే వ్యవసాయ కార్మికులలో

43 శాతం బి.సిలు, 35శాతం ఎస్సీలు, 14 శాతం ఇతర కులాలు ఉండేవి. 7 శాతం గిరిజనులనుండి ఉన్నారు. ఆ రకంగా సామాజిక పొందికలో వైవిధ్యం పెరగడం దీర్ఘకాలంలో ఉద్యమానికి తోడ్పడేదైనా అస్థిత్వభావాలు బలపడిన కాలంలో వ్యవసాయ కార్మికుల ఐక్యతను నిర్మించటంలో కొంత ఇబ్బందిని కూడా కల్గిస్తుంది.

**14)** రాష్ట్రంలో రెండున్నర దశాబ్దాలుగా అమలైన వ్యవస్థీకృత సర్దుబాటు సంస్కరణల వలన వ్యవసాయ కార్మిక కుటుంబాలు ప్రధానంగా బరువు భారాలను మోయాల్సి వచ్చింది. పెరుగుతున్న ధరల భారం వ్యవసాయ కార్మికుల పై అత్యధిక భారాన్ని మోపాయి. ప్రస్థుతం అన్నింటికన్నా ఆహార వస్తువుల ధరలే భారీగా పెరిగినందున, వచ్చే ఆదాయంలో ఎక్కువభాగం ఆహారం కోసం ఖర్చుచేసే వ్యవసాయ కార్మికులే తీవ్రంగా నష్టపోయారు. విద్యా, వైద్యం, మంచి నీటి సరఫరా వంటి ప్రభుత్వ సేవలన్నీ క్రమేణా క్షీణించడం, ప్రవేటీకరించబడటం వలన వ్యవసాయ కార్మికులు ఎక్కువగా నష్టపోతున్నారు. ప్రభుత్వ బ్యాంకులు సైతం వ్యాపార దృష్టితో వ్యవహరిస్తుండడం వలన పరపతికి, వ్యవసాయ కార్మికులు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దోపిడికి బలవుతున్నారు. మద్యం ద్వారా పేదల ఆరోగ్యాన్నే కాకుండా కష్టార్జితమైన ఆదాయాన్ని కూడా తిరిగి కాజేస్తున్నారు.

అయితే వ్యవసాయ కార్మికులు ఇతర పేదలలో సరళీకరణ విధానాల పట్ల అశాంతి ప్రబలకుండా పాలక వర్గాలు కొన్ని తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకుంటున్నాయి. బియ్యం వంటి నిత్యజీవితావసర సరుకులను సబ్సిడీపై సరఫరా చేయడం, పింఛన్లు విస్తృతంగా ఇవ్వడం, సబ్సిడీపై గృహ సదుపాయాన్ని కల్పించడం వంటి సంక్షేమ చర్యలు అమలుజేయడం ద్వారా పేదలను తమ ప్రభావంలో పాలక వర్గాలు ఉంచుకోగలుగుతున్నాయి. అయితే ఆర్థికాభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పుడు కొన్ని వనరులను పేదలకు ఎరగా వేయడానికి పాలక వర్గాలు సంకోచించకపోయినా ఆర్థికాభివృద్ధి మందగించినప్పుడు సంక్షేమ పథకాలపై దాడి చేస్తాయి. గత నాలుగేళ్లుగా దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో పాలక వర్గాలు సంక్షేమ పథకాలను బలహీనం చేయడం ప్రారంభించాయి. ఇప్పుడు మోడీ నాయకత్వాన ఎన్‌డిఏ సర్కారు ఈ దాడిని ఉధృతం చేసే అవకాశం ఉంది. ఆహార సబ్సిడీ, ఉపాధిపనుల కేటాయింపులు, ఇంధన సబ్సిడీలు క్రమేణా తగ్గించే అవకాశం ఉంది. వ్యవసాయ కార్మికులకు కీలకమైన భూసంస్కరణ చట్టాలను ఇప్పటికే అన్ని రాష్ట్రాలు బలహీనం చేస్తున్నాయి.

❝ వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులూ, ప్రభుత్వ విధానంలో వచ్చిన మార్పుల వలన వ్యవసాయ కార్మికుల జీవన విధానంలోనూ, పని పరిస్థితులలోనూ వచ్చిన మార్పులు వ్యవసాయ కార్మికురాద్యమానికి అనేక సవాళ్ళను విసురుతున్నాయి. ❞



కూలీలను పక్కనబెట్టి కొత్త యంత్రాలకోసం పరుగులు: కూలీలు దొరకడం లేదని సాకులు

**15)** వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులూ, ప్రభుత్వ విధానంలో వచ్చిన మార్పుల వలన వ్యవసాయ కార్మికుల జీవన విధానంలోనూ, పని పరిస్థితులలోనూ వచ్చిన మార్పులూ వ్యవసాయ కార్మిక రాద్యమానికి అనేక సవాళ్ళను విసురుతున్నాయి. వ్యవసాయ కార్మికులలో పెరిగిన వైవిధ్యాన్ని వివిధ శ్రేణులమధ్య వచ్చిన వ్యత్యాసాలను అధిగమించి సంఘటితం ఎలా చేయాలి.? పని స్వభావంలో, వేతన స్థాయి ల్లో వచ్చిన తేడాలకనుగుణంగా అందరినీ కదిలించగలిగే డిమాండ్లు ఎలా ఉ ండాలి? వైవి ధ్యం కలిగిన వ్యవసాయ కార్మికులను కదిలిం చటానికీ, ప్రచారం చేయడానికీ ఎలాంటి నిర్మాణ ఆందోళన పద్దతులు అనుసరించాలి.? ఆధునిక మీడియా, పాలక వర్గాల ప్రభావంతో వినిమయ వాద భావాల ప్రభావం నుండి వర్గ దృష్టిని కలిగించడం ఎలా? అనేవి కొన్ని సమస్యలు. వీటన్నింటినీ సక్రమంగా పరిష్కారం చేసుకోవడంపై వ్యవసాయ కార్మికోద్యమ, మొత్తం పీడిత ప్రజల ఉద్యమ భవిష్యత్తు ఆధారపడిరాంది.

ఒకే శ్రామికుడు కొంతకాలం వ్యవసాయ పనులలో, కొంతకాలం వ్యవసాయేతర పనులలో, కొంతకాలం పట్టణాలలో వలస కూలీలుగా పనిచేస్తున్న తరుణంలో ఈ అన్ని ప్రదేశాల్లో సమస్యలపై పనిచేసినప్పుడే అటువంటి శ్రామికు లను సంఘటితం చేయగల్గుతాం. ఏక కాలంలో అటు వ్యవసాయ కూలీల గురించీ, ఇటు కౌలు దార్ల గురించీ కృషిజేసినప్పుడే వారి మధ్య వైరుధ్యాన్ని తొలగించి శ్రామికులను ఐక్యం చేయ గల్గుతాం. మహిళలు అత్యధికంగా వ్యవసాయ కార్మికులుగా ఉంటున్నప్పటికీ వ్యవసాయ కార్మికో ద్యమం నిర్మాణం మాత్రం పురుషాధిక్యతతోనే నడుస్తున్నది. వ్యవసాయ కార్మిక మహిళల రాద్యమంగా రూపాంతరం చెందాల్సి ఉంది. వ్యవసాయ కార్మికులలో వ్యక్తమవుతున్న వైవిధ్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో విడివిడి, సమిష్టి నిర్మాణరూపాలలో నిర్థిష్టంగా వికేంద్రీకరించి ఉద్యమాన్ని అభివృద్ధి చేయాలి. వైవిధ్యానికి తగినట్టుగా విడివిడి డిమాండ్లనూ, మొత్తం వర్గాన్ని ఐక్యం చేసే వర్గ డిమాండ్లనూ రూపొందించి సమన్వయంతో ఉద్యమాలు నిర్వహించాలి. వ్యవసాయ కార్మికులలో సామాజిక అణచివేతను నిరమ్మాలించేందుకు ప్రచార సంస్కరణ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి. వర్గ ఐక్యత పేరుతో ఈ కృషిని ఏమాత్రం విస్మరించినా వ్యవసాయ కార్మిక వర్గ ఐక్యత దీర్ఘకాలంలో బలపడడానికి తోడ్పడదు. వ్యవసాయ కార్మికుల చైతన్యాన్ని మొద్దుబార్చి భ్రమలను సృష్టించే పాలకవర్గ ప్రచారాలనూ, వినిమయవాద ధోరణులనూ నిర్దిష్టంగా ఎదుర్కొనేట్టుగా సాంస్కృతిక కృషిని ఉద్యమంలో అంతర్భాగంగా నిర్వహించాలి. వ్యవసాయ కార్మికుని జీవితంలో ఎదురయ్యే ప్రత్యక్ష, పరోక్ష దోపిడీ రూపాలనన్నింటినీ గుర్తించి వాటికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించాలి. ఒక సమగ్ర రూపంలో వ్యవసాయ కార్మిక రంగంలో కృషి చేస్తేనే గ్రామీణ పెత్తందారీ శక్తుల ప్రభావంనుండి బయటపడి వ్యవసాయ కార్మికవర్గం ఒక స్వతంత్రమైన శక్తిగా అభివృద్ధి అవుతుంది.

పార్టీ నిర్మాణం

# కార్యకర్తల అభివృద్ధి


రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, ప్రజాశక్తి తెలంగాణా సంపాదకులు

ఎస్. వీరయ్య

రాష్ట్రంలో గత కొంత కాలంగా అననుకూల పరిస్థితుల్లో పనిచేశాం. జాతీయంగానూ, రాష్ట్రంలోనూ కొంత పునాది చెదిరింది. ఆ మేరకు ఉత్సాహానికి పరిమితులు ఏర్పడటం కూడా చూస్తున్నాం. అక్కడక్కడ కొందరు కార్యకర్తలు జారిపోవటమూ చూస్తాం. పరిస్థితులను బట్టి ఉత్సాహ, నిరుత్సాహాలు సహజమే. వాటి ప్రభావాలు కార్యాచరణ మీద కూడా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పెద్దనాయకులు కూడా జారిపోవటమేమిటని కామ్రేడ్స్ ప్రశ్నిస్తారు. దీనికి రెండు కోణాలున్నాయి. పెద్దనాయకులంటే ఎవరన్నది మొదటి ప్రశ్న. పార్లమెంటరీ వ్యవస్థలో కమ్యూనిస్టు ప్రమాణాలతో నిమిత్తం లేకుండానే గుర్తింపుకు అవకాశాలున్నాయి. మీడియా పాత్ర కూడా ఇందుకు తోడవుతుంది. కేవలం మీడియాతోనే అర్హతకు మించి గుర్తింపు పొందే సందర్భాలూ ఉంటాయి. వీటితో సంబంధం లేకుండానే గొప్పనాయకులై కూడా కొన్ని సందర్భాల్లో అన్యవర్గ ధోరణులకు లోనుకావచ్చు. కార్యకర్తలలోగానీ, నాయకులలోగానీ బలహీనతలు ఉద్యమం ఊపులో ఉన్నప్పుడు బయటపడకపోవచ్చు. ఎదురు దెబ్బల సమయంలోనే బయటపడతాయి. పార్టీలో నిరుత్సాహకర వాతావరణమే వీటికి అనుకూల పరిస్థితులు. అందుకే అననుకూల పరిస్థితుల్లో ఉద్యమాన్నీ, పార్టీనీ కాపాడుకుంటాం. అనుకూల పరిస్థితుల్లో ఉద్యమాలు పెరుగుతాయి. పార్టీ బలపడుతుంది. విప్లవ పరిస్థితుల్లో సమాజాన్ని సమూలంగా మార్చే ప్రజా తిరుగుబాటు రావచ్చు. లేదా అందుకు అవసరమైన అధికారమే చేతికి రావచ్చు. ఈ వాస్తవాలను అర్థం చేసుకొని పార్టీని నిర్మించగల కార్యకర్తలను తయారు చేసుకోవడం అవసరం.

పార్టీకి ప్రతిష్ట ఉన్నది. కానీ పునాది బలహీనపడ్డది. సాధారణంగా ప్రతిష్టను చూసి సంతృప్తిపడుతూ ఉంటాం. పార్టీ ప్రతిష్టకూ, పార్టీ పెరుగుదలకూ మధ్యగల విభజన రేఖను విస్మరిస్తాం. ప్రతిష్ట మాత్రమే ఉంటే అది బూర్జువా పార్టీలకే ఉపయోగం. పార్టీ పెరిగితే అది కమ్యూనిస్టు ఉద్యమానికి ఉపయోగం. పార్టీ పెరిగితే మనమే అధికారంలోకి రావచ్చు. లేదా నిర్ణయాత్మక పాత్ర నిర్వహించవచ్చు. లేదా అధికారపక్షాన్ని ప్రభావితం చేయవచ్చు. ప్రతిష్ట మాత్రమే ఉండి పార్టీ పునాది బలహీనంగా ఉన్నప్పుడు ఎన్నికల పోరాటంలో మిత్రులు కూడా దొరకడం కష్టమేనని గత ఎన్నికలు రుజువు చేశాయి. తెలంగాణలో టిఆర్ఎస్ నాయకత్వం సిపిఎం మద్దతును ఆశించిందే తప్ప సీట్లు పంచుకోవడానికి సిద్ధపడలేదు. వైసిపి నాయకత్వం సిపిఎంతో సన్నిహితంగా ఉన్నట్టు సంకేతాలు పంపే ప్రయత్నం చేశారే తప్ప సీమాంధ్రలో సీట్ల సర్దుబాటుకు సిద్ధపడలేదు. ఈ రెండు సందర్భాల్లోనూ మన ప్రతిష్టను వారు పంచుకొనే ప్రయత్నమే జరిగింది. కీలక సమయాల్లో పార్టీ తీసుకునే సరైన వైఖరులు, నిర్వహించే పోరాటాలు మన ప్రతిష్టను పెంచుతాయి. ప్రతిష్టతోటే పార్టీ దానంతట అది పెరగదు. పార్టీని నిర్మించే కృషి చైతన్య పూరితంగా చేయాలి. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలను తయారు చేసుకోవడం ముఖ్యమైన కర్తవ్యం. పార్టీని విస్తరింప చేసేది వీరే.

మాకు తగినంత కార్యకర్తలు లేరనడం తరచూ వింటుంటాం. కార్యకర్తలు ఉండరు. తయారు చేసుకోవాలి. నిర్ణయాల అమలు, పార్టీ విస్తరణ కార్యకర్తల మీదనే ఆధారపడి ఉంటుంది. మార్క్సిస్టు మహోపాధ్యాయుల అనుభవాలను పార్టీ కేంద్ర కమిటీ 1967 తీర్మానంలో క్రోడీకరించింది. వీరికి నాలుగు లక్షణాలు ఉండాలని నిర్ణయించింది. 1. మార్క్సిజం లెనినిజం మీద, పార్టీ మీద అచంచలమైన విశ్వాసం ఉండాలి. 2. ప్రజలతో నిత్య సంబంధాలు ఉండాలి. 3. స్వతంత్రంగా పని చేయగలగాలి. 4. పార్టీ క్రమశిక్షణకు బద్ధులై ఉండాలి.

కార్యకర్తలకు మార్క్సిస్టు సిద్ధాంతం మీదా, పార్టీ మీదా అచంచలమైన విశ్వాసం ఎలా వస్తుంది? మార్క్సిస్టు మౌలిక సూత్రాలను అధ్యయనం చేయటం, వర్గపోరాటంలో భాగస్వాములు కావటం ద్వారా ఇది సాధ్యమవుతుంది. సాధారణంగా ఈ నేపథ్యం ఉన్నవారు జారిపోవడానికి అవకాశాలు తక్కువ. అయినా అన్యవర్గ ధోరణులకు ఎవరూ అతీతులు కారు. చాలా కాలం ఆరోగ్యంగా ఉన్నవారు కూడా అనారోగ్యానికి గురికావడం ఎంత సహజమో, ఇది కూడా అంతే సహజం. మార్క్సిజం పట్ల సరైన అవగాహన కలిగినవారు గతితార్కిక సూత్రాలను సరిగ్గా అన్వయించగలరు. ఎదురుదెబ్బలు తగిలినపుడు వాటికి కారణం వెతుకుతారు. వాటిని అధిగమించేందుకు మార్గాలు అన్వేషిస్తారు. అననుకూల పరిస్థితుల పట్ల సరైన అంచనాకు వస్తారు. అందుకు అనుగుణమైన ఎత్తుగడలు, పని పద్ధతులు రూపొందించుకుంటారు.

ప్రజలే చరిత్ర నిర్మాతలు. వారితో సంబంధాలు బలహీనపడితే సమాజాన్ని మార్చడం అసంభవం. అందుకే కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి. తమ సమస్యలు తామే పరిష్కరించుకునే విధంగా ప్రజలను సన్నద్ధం చేయాలి. ఇందుకు భిన్నంగా ప్రజల సమస్యలు తామే పరిష్కరిస్తామనటం పైరవీకారుల లక్షణమే అవుతుంది. అది బూర్జువా పార్టీల సంస్కృతి. నిర్ణయాలలోనూ, పోరాటాలలోనూ, ప్రజలను భాగస్వాములను చేయాలి. ఈ విషయంలో కార్యకర్తలకు స్పష్టత అవసరం. అంతేకాదు, జనం నాడిని సరిగ్గా పట్టుకోగలగాలి. సంతృప్తి, అసంతృప్తుల మోతాదును సరిగ్గా బేరీజు వేయగలగాలి. రాజకీయ వైఖరులు, ఎత్తుగడలు రూపొందించుకోవడానికి, పోరాట రూపం ఎంచుకోవడానికి ఇది అవసరం. జనంతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నప్పుడు మాత్రమే ఇది సాధ్యం. ఎన్నికల సందర్భంగా ఆయా నియోజకవర్గాలలో మన ఓట్ల పట్ల ఏమేరకు సరైన అంచనాకు రాగల్గుతున్నాం? అనేక సంద

ర్భాలలో అతి అంచనాలు వేసి ఫలితాల అనంతరం నీరస పడటం చూస్తున్నాం. ఇది ప్రజలతో మన సంబంధాల మోతాదును తెల్పుతుంది. కొన్ని సందర్భాలలో జనంలో ఉన్నా లేనట్టే. ఎందుకంటే, జనానికి చెప్పడమే తప్ప వారి అభిప్రాయాలు వింటున్నామా? "ప్రజల నుండి ప్రజల వద్దకు" అన్నారు మావో. ప్రజల అభిప్రాయాలు విన్నప్పుడే వాటిని విశ్లేషించి, సిద్ధాంతీకరించి, మళ్ళీ ప్రజలకు అందించగలం. అప్పుడా నిర్ధారణ లేదా సిద్ధాంతం వాస్తవాలకు దగ్గరగా ఉంటుంది. ఓటములు చవిచూసినపుడు లేదా ఎదురుదెబ్బలు తగిలినపుడు కూడా జనంలో ఉంటే టానిక్‌లాగా పని చేస్తుంది. ఏం చేయాలో తోచనపుడు కూడా జనంలో ఉంటే ఏం చేయాలో వారే చెప్తారు.

ప్రతిదానికీ నాయకత్వం వైపు చూడకుండా స్వతంత్రంగా పని చేయగలవారు ఎంత మంది ఉంటే పార్టీకి అంత బలం. కానీ కార్యకర్తల్లో ఉద్యోగి మనస్తత్వం గురించి తరచూ చర్చకు వస్తున్నది. కార్యకర్తగా పనిచేయడమంటే వృత్తి విప్లవకారుడని వీరనుకోరు. ఇది ఒక ఉపాధి అవకాశంగా భావిస్తారు. అందుకే ఉద్యోగి తరహాలోనే పనిచేస్తారు. విప్లవం మీద నమ్మకం సడలినపుడు కూడా ఈ ధోరణి రావచ్చు. ప్రపంచీకరణ విధానాల ప్రభావాలు కూడా పోరాటతత్వాన్ని బలహీనపరుస్తున్నాయి. పార్టీ మీద బలమైన విశ్వాసం లేకుండా వృత్తి విప్లవకారులుగా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. బలమైన విశ్వాసం ఉన్నప్పుడు మాత్రమే స్వతంత్రంగా పని చేయాలన్న పట్టుదల, ఫలితం సాధించాలన్న దృఢదీక్ష ప్రదర్శించగలరు.

క్రమశిక్షణ పార్టీ సభ్యులందరికీ అవసరమే. పార్టీ నిబంధనావళికి కట్టుబడి పని చేయవలసిందే. కానీ సాధారణ సభ్యుల్లో చైతన్యానికి ఉన్న పరిమితులు మనకు తెలుసు. తరచూ ఊగిసలాటలు, పొరపాట్లు జరుగుతుంటాయి. సకాలంలో జోక్యం చేసుకొని సరిదిద్దవలసిన స్థానంలో కార్యకర్తలు ఉంటారు. అందుకే వీరిలో కమ్యూనిస్టు క్రమశిక్షణ గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటాం. సాధారణ పార్టీ సభ్యుల లాగే కార్యకర్తలు కూడా నాలుగు ప్రాథమిక బాధ్యతలు నిర్వహించవలసిందే. కానీ పై నాలుగు లక్షణాలు సాధారణ పార్టీ సభ్యుల నుండి కార్యకర్తలను వేరు చేస్తాయి. ఈ లక్షణాలలో లోపం ఉన్నపుడు సాధారణ పార్టీ సభ్యులకూ, వీరికీ తేడా ఉండదు.

కార్యకర్తలు సహజసిద్ధంగా దొరకరు. వారిని తయారు చేసుకోవడమంటేనే ఆ లక్షణాలను అభివృద్ధి చేసుకోవటం. కార్యకర్తలుగా ఎదిగే అవకాశం ఉన్నవారిని ఎంపిక చేసుకొని అభివృద్ధి చేసుకోవాలి. ఇది కూడా ప్రణాళికాబద్ధంగా జరగవలసిందే. తగిన వారిని ఎంపిక చేయడం, వారిపట్ల వ్యక్తిగత శ్రద్ధపెట్టటం ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇందుకు ప్రయోగాలు అనివార్యం. అయితే ప్రయోగాలకు కూడా కనీస ప్రాతిపదిక అవసరం. ఎంపిక సమయంలోనే జాగ్రత్త పడాలి. ప్రజల్లో చురుకుగా పని చేసే లక్షణం ఉండాలి. అధ్యయనం చేయగలవారై ఉండాలి. విషయాలు స్పష్టంగా చెప్పగలవారై ఉండాలి. ఉద్యమం పట్ల ఆకర్షితులైన వారిలో ఇలాంటివారిని ఎంపిక చేసి పనులు అప్పగించవచ్చు. పనిచేసే క్రమంలో వారి అభివృద్ధిని పర్యవేక్షించాలి. దగ్గరగా పరిశీలించాలి. పనిలో నైపుణ్యం మెరుగుపర్చేందుకు సహాయపడాలి. సైద్ధాంతిక, రాజకీయ అవగాహన పెంపొందించాలి. వారి పనిలో వ్యక్తమయ్యే లోపాల నుండే సరైన పద్ధతులు నేర్పించాలి. చంటి బిడ్డలను పెంచినట్టే నచ్చజెప్పాలి. ఈ మాత్రం తెలియదా అని హేళన చేయకూడదు. వారి వ్యక్తిగత సమస్యలపట్ల కూడా శ్రద్ధ వహించాలి. అన్ని సమస్యలూ పరిష్కారం చేయలేకపోవచ్చు. కానీ అప్యాయతను పంచాలి. శక్తిని బట్టి పనులు అప్పగించాలి. పనులను సాధ్యమైనంత చిన్నచిన్న ముక్కలు చేయాలి. అప్పుడు ఆ పనులు చేయగల సమర్థులు తగు సంఖ్యలో దొరుకుతారు. నిర్ణయాలను అమలు చేస్తున్న క్రమంలోనే వారి ప్రయత్నాలపై దృష్టిసారించాలి. నిర్ణయాలను సక్రమంగా అర్థం చేసుకున్నారా? లేక పొరపాటుగా అమలు చేస్తున్నారా గమనించాలి. వెంటనే జోక్యం చేసుకొని సరిదిద్దాలి. అంతా అయిపోయిన తరువాత తప్పులు లెక్కించడం వలన ప్రయోజనం లేదు. ఈ పద్ధతి కార్యకర్తలను ఉత్సాహ పరచదు. నిర్ణయాలను చైతన్యవంతంగా అమలు చేస్తున్నారా? లేక మొక్కుబడిగా చేస్తున్నారా గమనించాలి. మొక్కుబడిగా అమలు చేయటం వల్ల ప్రయోజనం ఉండదు. నిర్ణయాల తప్పొప్పులు తేలాలంటే పట్టుదలతో అమలు చేయాలి. అరకొరగా అమలు చేసినపుడు సరైన నిర్ణయాలు కూడా ఫలితాలను ఇవ్వవు. కార్యకర్త ఒక పనిలో సఫలం కాకపోతే తర్వాత కాలంలో పదేపదే దానినే గుర్తు చేయటం మంచిదికాదు. కార్యకర్తను నిరుత్సాహ పరుస్తుంది. తన శక్తి సామర్థ్యాల పట్ల విశ్వాసం కోల్పోతారు. ఒకసారి పనిలో విఫలమైనవారు తరువాత కాలంలో లోపాలను సరిదిద్దుకొని నైపుణ్యం పెంచుకునేందుకు కూడా అవకాశం ఉంటుంది. అందుకే కార్యకర్తల అభివృద్ధిని కూడా మార్పులో చూడాలి. ఇదే గతితార్కిక పద్ధతి. ఒక పనిలో విఫలమైన వారు మరొక పని అప్పగిస్తే జయప్రదం కావచ్చు. అందుకే కార్యకర్త పనిలో జయప్రదం కానప్పుడు వారి శక్తి సమార్థ్యాలకు తగిన పని అప్పగించామా లేదా అనే దృష్టితో కూడా పరిశీలించుకోవాలి. ఉద్యమ అవసరాలకు సంబంధించిన అనేక పనుల్లో ఏదో ఒక పనిలో వారి నైపుణ్యం ఉపయోగపడవచ్చు. ఏ పనిలో ఫలితాలు సాధించగలరో పరిశీలించాలి. ఇందుకోసం కార్యకర్తల పట్ల నిరంతర వ్యక్తిగత పర్యవేక్షణతోపాటు సమగ్ర దృక్పథంతో కూడా పరిశీలించాలి. కనీస సామర్థ్యం లేనివారిని ఎంపిక చేస్తే ఆపైన ఎంత ప్రయత్నించినా వారిలో అభివృద్ధి కన్పించకపోవచ్చు. అందుకే ఎంపిక దశ కీలకమైంది. అక్కడ విఫలమైతే తర్వాత ప్రయత్నాలన్నీ వృథా ప్రయాసే. తగిన వారిని ఎంపిక చేసినపుడు కూడా పనులు అప్పగించడంలోనూ, వ్యక్తిగత పర్యవేక్షణలోనూ లోపం జరిగితే కార్యకర్తల శక్తి సామర్థ్యాలు వృథా అవుతాయి. ఎదిగే అవకాశం ఉన్న కార్యకర్తలను కోల్పోతాం. సాధారణంగా ఎంపిక చేసిన వారికి తరగతులు నిర్వహించడంతో పని పూర్తయిందనుకుంటారు. కానీ అది ప్రారంభమే. అసలు పనులన్నీ తర్వాతనే ప్రారంభమవుతాయి. కార్యకర్తల అభివృద్ధి ప్రధానంగా వ్యక్తిగత శ్రద్ధతోనే సాధ్యం. ఇది సామూహిక ప్రక్రియ కాదు. సామూహిక కృషి ఇందుకు తగిన ఉత్సాహాన్ని ఇచ్చేది మాత్రమే. ⦿

> **"కార్యకర్తలు సహజసిద్ధంగా దొరకరు. వారిని తయారు చేసుకోవడమంటేనే ఆ లక్షణాలను అభివృద్ధి చేసుకోవటం. కార్యకర్తలుగా ఎదిగే అవకాశం ఉన్న వారిని ఎంపిక చేసుకొని అభివృద్ధి చేసుకోవాలి. ఇది కూడా ప్రణాళికాబద్ధంగా జరగవలసిందే. తగిన వారిని ఎంపిక చేయడం, వారిపట్ల వ్యక్తిగత శ్రద్ధపెట్టటం ముఖ్య పాత్ర పోషిస్తాయి."**

ఈ మాసం ప్రత్యేకం

# ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేది దామాషా ఎన్నికల విధానమే



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సభ్యులు, 'మార్క్సిస్టు' సంపాదకులు.

**ఎస్. వెంకట్రావు**

**భా**రత దేశంలో నేడు మనం అనుసరిస్తున్న ఎన్నికల విధానం బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనపై రుద్దిన అనాకారి విధానం. పూర్వపు బ్రిటిష్ వలస దేశాల్లోనే ఈ విధానం ఎక్కువగా అమలవుతోంది. మిగిలిన ప్రపంచమంతా అత్యధికంగా దామాషా విధానంలో ఎన్నికలను నిర్వహిస్తున్నది. ఎందుకంటే ఈ విధానంలో జరిగే ఎన్నికలనుండి ఏర్పడే చట్టసభలు ప్రజాభిప్రాయాన్ని కొంతమేరకు ప్రతిఫలిస్తాయి.

**ప్రస్తుత విధానం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది**

నేడు మన దేశంలో లోక్‌సభకూ, శాసనసభలకూ, కింద స్థానిక సంస్థలకూ జరుగుతున్న ఎన్నికల విధానాన్ని 'ముందొచ్చేవానిదే గెలుపు' (ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్) విధానం, లేక 'అందరికన్నా ఎక్కువ ఓట్లు (మెజారిటీ) సాధించేవాడిదే గెలుపు' విధానం అంటారు. ప్రపంచంలో చాలా తక్కువ దేశాల్లో మాత్రమే ఈ విధానం అనుసరిస్తున్నారు. చాలా ఐరోపా దేశాల్లో, ప్రపంచంలోని ఇంకా అనేక దేశాల్లో దామాషా విధానంలోనే ఎన్నికలు జరుగుతున్నాయి.

స్వాతంత్రం వచ్చి ఆరున్నర దశాబ్దాలుగా, నిజానికి స్వాతంత్ర్యం రాకపూర్వం నుండి కూడా మనదేశంలో 'ముందొచ్చేవానిదే గెలుపు' విధానం అమలులో ఉండడం వల్ల ఎన్నికలంటే ఇవే అనే భావం మన ప్రజల్లో ఏర్పడిపోయింది. కానీ ఈ విధానం వల్ల ఏర్పడుతున్న అనర్థాలు క్రమంగా పెరుగుతుండడంతో ఇటీవలి కాలంలో ప్రత్యామ్నాయ ఎన్నికల విధానంపై చర్చ ఊపందుకుంది. అనేక మంది మేధావులు దామాషా ఎన్నికల విధానంలోకి వెళ్లడమే దేశానికీ, ప్రజాస్వామ్యానికీ ప్రయోజనకరమని చెబుతున్నారు. నిజానికి వామపక్షాలు, ముఖ్యంగా భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) ఎప్పటినుండో దామాషా ఎన్నికల విధానం కోసం ప్రచారం చేస్తోంది. పార్టీ కార్యక్రమం 6.3, (1)వ పేరాలో జనతా ప్రజాస్వామ్య సంఘటన విజయం సాధిస్తే ఎలాంటి ప్రభుత్వం ఏర్పడుతుందో చెబుతూ "....వయోజన ఓటింగ్‌ద్వారా, దామాషా ఎన్నికల సూత్రంద్వారా, తిరిగి వెనక్కుపిలిచేందుకు అవకాశమున్న పద్ధతిలో ఎన్నికయ్యే ప్రజా ప్రతినిధులు, రాజ్యాధికారాన్ని నిర్వహించే సర్వోన్నత అధికారం కలిగి వుంటారు...." అని పేర్కొంది.

ప్రస్తుత మన ఎన్నికల విధానం వల్ల నాలుగు అనర్థాలు జరుగుతున్నాయి.

1. ఈ విధానంలో జరిగే ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని చట్టసభల్లో సక్రమంగా ప్రతిబింభించడానికి తోడ్పడడం లేదు. వుదాహరణకు 2014 సార్వత్రిక ఎన్నికలనే చూడండి: బిజెపీకి ఈ ఎన్నికల్లో 31 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ అది 282 స్థానాలతో లోక్‌సభలో పూర్తి మెజారిటీ సాధించింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు 19.3 శాతం ఓట్లు వచ్చాయి. కానీ దానికి వచ్చిన స్థానాలు 44. అంటే రెండు పార్టీల మధ్య 12 శాతం ఓట్ల తేడా ఉంది. కానీ లోక్‌సభ సీట్లలో మాత్రం 500 శాతం తేడా వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష సంఘటనకు 30 శాతం ఓట్లు వచ్చాయి. ఓట్ల దామాషాలో చూస్తే లోక్‌సభకు ఆ రాష్ట్రం నుండి 13 మంది సిపిఎం సభ్యులు వెళ్లాలి. కానీ వాస్తవంగా గెలిచింది ఇద్దరే. అదే రాష్ట్రంలో 10 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్‌కు 4 స్థానాలు వచ్చాయి. తృణమూల్ కాంగ్రెస్ 40 శాతం ఓట్లు తెచ్చుకుంది. ఓట్ల దామాషా ప్రకారం లోక్‌సభలో దానికి 17 స్థానాలు రావాలి కానీ అది 34 స్థానాలు అంటే మొత్తం స్థానాల్లో 80 శాతం గెలుచుకుంది.

తమిళనాడులో కూడా అదే పరిస్థితి. డిఎంకెకు 23.6 శాతం ఓట్లు వచ్చాయి. కానీ దానికి ఒక్క స్థానమూ రాలేదు. 18.6 శాతం ఓట్లు తెచ్చుకున్న నాలుగు పార్టీల కూటమి రెండు సీట్లు తెచ్చుకుంది. 44 శాతం ఓట్లతో అన్నా డిఎంకె మిగిలిన 37 స్థానాలు అంటే 94 శాతం స్థానాలు ఎగరేసుకుపోయింది. ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పికి 20 శాతం ఓట్లు వచ్చాయి కానీ ఒక్క సీటూ రాలేదు. 22.6 శాతం ఓట్లు వచ్చిన సమాజ్‌వాదీ పార్టీ అయిదు స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ 8 కన్నా తక్కువ శాతం ఓట్లు పొందింది. కానీ రెండు స్థానాలు సంపాదించింది. 42 శాతం ఓట్లు పొందిన బిజెపీ 90 శాతం స్థానాలు చేజిక్కించుకుంది.

ఇదంతా చూస్తుంటే పార్టీలు పొందిన ప్రజల ఓట్లకూ, వాటికి వచ్చిన సీట్లకూ మధ్య పొంతన లేని విషయం విధితం కావడంలేదూ? ఇంకో విషయం ఏమంటే ఈ దేశంలోని ఓటర్లలో 69 శాతం మంది బిజెపీని ఇష్టపడడంలేదు, ఇంకా చెప్పాలంటే 60 శాతం మంది బిజెపీ

దాని మిత్రపక్షాలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. కానీ మెజారిటీ ఓటర్లు ఇష్టపడని పార్టీ, దాని నాయకత్వంలోని కూటమి లోక్‌సభలో మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

నిజానికి స్వాతంత్ర్యానంతరం జరిగిన 16 లోక్‌సభ ఎన్నికలకుగానూ 1977లో ఎమర్జెన్సీ అనంతరం, 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో మినహాయించి మరే ఎన్నికల్లోనూ గెలిచిన పార్టీ లేదా కూటమికి 50 శాతం మించి ఓట్లు రాలేదు. కానీ అవి లోక్‌సభలో మాత్రం మెజారిటీ స్థానాలు గెలుచుకున్నాయి.

2. ప్రస్తుత ఎన్నికల విధానం వల్ల కోటీశ్వరులు మినహా సామాన్యులు ఎన్నికల్లో పోటీచేయడానికీ, పోటీ చేసినా గెలవడానికీ అవకాశాలు లేకుండా పోతున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన పార్లమెంటు సభ్యుల్లో 442 మంది అంటే మొత్తం సభ్యుల్లో 82 శాతం మంది కోటీ రూపాయలు, అంతకన్నా ఎక్కువ ఆస్తిపరులని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఎడిఆర్) తెలిపింది. 2009లో 52 శాతం మంది కోటీశ్వరులు గెలుపొందగా ఈ ఎన్నికల్లో వారి శాతం గణనీయంగా పెరిగింది. "కోటి రూపాయల కన్నా తక్కువ ఆస్తి ఉన్న వారిమీద కోటీశ్వరులు గెలవడానికి పది రెట్లు అవకాశాలున్నాయి" అని సంస్థ పేర్కొంది. 2009 ఎన్నికల్లో గెలిచిన లోక్‌సభ సభ్యుల సగటు ఆస్తి రూ. 5.35 కోట్లు. 2014లో ఈ సగటు ఆస్తి రూ. 14.61కి పెరిగింది. అంటే 173 శాతం పెరిగింది. ఈ విధంగా ఇప్పుడున్న ఎన్నికల విధానం క్రమంగా సామాన్యులను ఎన్నికల్లో పోటీకి దూరం చేస్తోంది.

3. ప్రస్తుత విధానం ఎన్నికలను వ్యాపారంగా మార్చేస్తోంది. మొదటిది, ప్రధాన పార్టీ అభ్యర్థులకే గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి కనుక ఎన్నికల్లో సీట్లు సంపాదించడానికి అభ్యర్థులు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రధాన బూర్జువా పార్టీలన్నీ కూడా ఎన్నికల్లో బాగా ఖర్చుచేయగలిగే వారికే సీట్లు ఇస్తున్నాయి. రెండోది, పోటీ చేసే అభ్యర్థులు కూడా గెలుపుకోసం ఓట్లను డబ్బిచ్చి కొనేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఓటుకు వందలు, వేల రూపాయల 'ధర' పలుకుతుండడంతో ప్రజలు ఓట్లను అమ్మడానికి సిద్ధపడిపోతున్నారు. ఈ విధంగా ప్రస్తుత ఎన్నికల విధానం ఎన్నికలను వ్యాపారంగా, ఓట్లను అమ్ముకునే, కొనుక్కొనే సరుకుగా మార్చేస్తోంది. ఫలితంగా ప్రజాస్వామ్యం క్రమంగా కుదించుకుపోయి ధనస్వామ్యం దాని స్థానాన్ని ఆక్రమిస్తోంది.

> **"ప్రస్తుత విధానం ఎన్నికలను వ్యాపారంగా మార్చేస్తోంది. మొదటిది, ప్రధాన పార్టీ అభ్యర్థులకే గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి కనుక ఎన్నికల్లో సీట్లు సంపాదించడానికి అభ్యర్థులు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రధాన బూర్జువా పార్టీలన్నీ కూడా ఎన్నికల్లో బాగా ఖర్చుచేయగలిగే వారికే సీట్లు ఇస్తున్నాయి. రెండోది, పోటీ చేసే అభ్యర్థులు కూడా గెలుపుకోసం ఓట్లను డబ్బిచ్చి కొనేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు."**



ప్రస్తుత ఎన్నికల విధానం మన దేశంలో ఎన్నికలను వ్యాపారంగా మార్చేసింది

4. ప్రస్తుత ఎన్నికల విధానం జాతీయ స్థాయిలో చిన్న పార్టీలకు క్రమంగా స్థానం లేకుండా చేస్తుంది. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చే అవకాశాలు తక్కువ ఉండే చిన్న పార్టీలకూ, బలహీనమైన పార్టీలకూ ఓట్లు వేయడం వల్ల తమ ఓటు వృధా అయిపోతుందనే భావన ప్రజలను పెద్ద పార్టీలవైపు, కూటముల వైపు నెడుతోంది. దాని వల్ల క్రమంగా చిన్న పార్టీలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతోంది. రాష్ట్రాల స్థాయిలో కూడా ఇదే జరుగుతోంది. కాబట్టి దేశంలో రెండు పార్టీల వ్యవస్థ ఏర్పడేందుకు ప్రస్తుతం అనుసరిస్తున్న 'ముందొచ్చేవాడిదే గెలుపు' అన్న పద్ధతి దోహదం చేస్తోంది. ఈ పద్ధతికి జన్మనిచ్చిన బ్రిటన్‌లోగానీ, దాన్ని అనుసరిస్తున్న అమెరికాలోగానీ రెండు పార్టీల వ్యవస్థ స్థిరపడిపోవడం వల్ల చిన్న పార్టీలు ఏర్పడినా ఎదగలేకపోతున్నాయి, మనుగడ సాగించలేకపోతున్నాయి. అలాకాకుండా దామాషా ఎన్నికల విధానం అనుసరిస్తున్న ఐరోపా, ఇతర దేశాల్లో బహుళ పార్టీల ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది.

### దామాషా ఎన్నికల విధానం

ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఓటరుకూ చట్ట సభలో ప్రాతినిధ్యం ఉండడం, ప్రతి రాజకీయ పార్టీకీ చట్టసభలో తనకు వచ్చిన ఓట్ల శాతం మేరకు ప్రాతినిధ్యం లభించడం అనేది దామాషా ఎన్నికల విధానంలో కీలకాంశం. ప్రస్తుతం మన దేశంలో జరుగుతున్న ఎన్నికల విధానంలో ఈ సూత్రం అమలు కాదు. ఎందుకంటే గెలిచిన అభ్యర్థికి ఓట్లు వేసిన వారికి మాత్రమే చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉంటుంది. ఓడిన అభ్యర్థికి ప్రాతి నిధ్యం లేకపోవడంతో పాటు అతనికి ఓట్లు వేసేవారి ఓట్లకు కూడా ప్రాతినిధ్యం పోతుంది. అందుకే ప్రస్తుత విధానంలో గెలిచే వానికే ఓట్లు వేయాలన్న భావన, ఓడే వ్యక్తికి ఓట్లు వేస్తే వృధా అయిపోతాయన్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది. దాని వల్ల గెలవడానికీ, గెలుస్తాడని ప్రచారం చేసుకోడానికీ పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేయడం జరుగుతోంది. కులమతాలనూ, ఇతర అస్థిత్వాలనూ ఉపయోగించుకోడానికి ఎక్కువ అవకాశం ఏర్పడుతోంది.

కానీ దామాషా ఎన్నికల విధానంలో ఒక పార్టీకి దేశం మొత్తం మీద, లేక ఒక ప్రాంతంలో ఎంత శాతం ఓట్లు వస్తే చట్టసభల్లో దానికి అంత శాతం ప్రాతినిధ్యం లభిస్తుంది. అంటే

> **“దామాషా ఎన్నికల విధానంలో ఒక పార్టీకి దేశం మొత్తం మీద, లేక ఒక ప్రాంతంలో ఎంత శాతం ఓట్లు వస్తే చట్టసభల్లో దానికి అంత శాతం ప్రాతినిధ్యం లభిస్తుంది. అంటే ఓట్ల శాతాన్ని బట్టి అభ్యర్థుల శాతం ఉంటుందన్న మాట. దీని వల్ల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష చాలా వరకు చట్ట సభల్లో ప్రతిబింబిస్తుంది. చిన్నచిన్న సామాజిక తరగతులకు కూడా తగిన ప్రాధాన్యత అభించే అవకాశం ఉంటుంది.”**

ఓట్ల శాతాన్ని బట్టి అభ్యర్థుల శాతం ఉంటుందన్న మాట. దీని వల్ల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష చాలా వరకు చట్ట సభల్లో ప్రతిబింబిస్తుంది. చిన్న చిన్న సామాజిక తరగతులకు కూడా తగిన ప్రాధాన్యత అభించే అవకాశం ఉంటుంది. ఈ పద్ధతిని వ్యతిరేకించేవారు దీనిపై విమర్శలు చేయకుండా లేరు. ఉదాహరణకు, దామాషా పద్ధతి వల్ల చిన్న చిన్న పార్టీలకు కూడా చట్టసభల్లో ప్రాతినిధ్యం వస్తుంది కాబట్టి అస్థిరత ఏర్పడుతుందని విమర్శించేవారున్నారు. అయితే ఇటువంటి దాన్ని అధిగమించేందుకుగాను, కనీసం అయిదు శాతం, లేక మూడు శాతం ఓట్లు వచ్చే పార్టీలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని వాటికి చట్టసభల్లో సీట్లు కేటాయించడం, మిగిలిన పార్టీలను తప్పించడం అనే పద్ధతిని కొన్ని దేశాల్లో అనుసరిస్తున్నారు.

ప్రస్తుత ఎన్నికల విధానంలో ఒక నియోజకవర్గానికి ఒక అభ్యర్థి ఉంటాడు. అంటే ఒక నియోజకవర్గం ఒక యూనిట్‌గా ఉంటుంది. కానీ దామాషా విధానంలో దేశమంతటినీ ఒక యూనిట్‌గా, లేక రాష్ట్రాన్ని లేక జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకోవచ్చు. ఉదాహరణకు తెలంగాణాలో 17 లోక్‌సభ స్థానాలుంటే మొత్తం తెలంగాణా అంతటినీ ఒక యూనిట్‌గా తీసుకోవచ్చు. ప్రతి పార్టీ 17 స్థానాలకూ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తుంది. లేదా తన బలాన్ని బట్టి అభ్యర్థులను ప్రకటించవచ్చు. ఇప్పుడు ఓటర్లు తమకు నచ్చిన పార్టీకి ఓట్లు వేస్తారు. ఒక్కో పార్టీకి వచ్చిన ఓట్లను బట్టి ఆయా పార్టీ ప్రకటించిన జాబితాలోని అభ్యర్థులు చట్టసభలకు వెళతారు.

### దామాషా విధానంలో రకాలు

దామాషా ఎన్నికల విధానంలో అనేక రకాలున్నాయి. మన దేశానికి ఏది సరిపోతే దాన్ని మనం అనుసరించవచ్చు. యూరప్‌లోని బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, గ్రీస్, రష్యా, ఇటలీ, హంగరీ, ఇజ్రాయిల్, లక్సెంబర్గ్, నార్వే, స్పెయిన్, స్వీడెన్, స్విట్జర్లాండ్ ఇంకా అనేక దేశాలు కొద్దిపాటి తేడాలతో దామాషా ఎన్నికల విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇంకా కొత్తగా విముక్తి చెందిన అనేక వర్ధమాన దేశాలు ముఖ్యంగా ఆఫ్రికా దేశాలు దామాషా విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. ఈ విధానంలో ఆయా దేశాలు తమకు అనువైన పద్ధతులను అనుసరిస్తున్నాయి. వీటిని ప్రధానంగా మూడు పద్ధతులుగా విభజించవచ్చు. 1. పార్టీ జాబితా ఓటింగు (పార్టీ లిస్ట్ ఓటింగ్) పద్ధతి 2. మిశ్రమ సభ్యత్వ దామాషా ఓటింగు (మిక్సిడ్ మెంబర్ ప్రపోర్షనల్ ఓటింగ్) పద్ధతి 3. ఏకైక బదిలీ ఓటింగు (సింగిల్ ట్రాన్సఫరబుల్ ఓటింగు) పద్ధతి.

### పార్టీ జాబితా ఓటింగు పద్ధతి

ప్రపంచంలోని అత్యధిక దేశాలు ప్రస్తుతం ఈ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. యూరప్‌లోనూ, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా ఖండాల్లోని అత్యధిక దేశాల్లో ఈ పద్ధతి పాటించబడుతోంది. పార్టీ జాబితా ఓటింగు పద్ధతిగురించి పైన కొంతవరకు చెప్పడం జరిగింది. ప్రతి రాజకీయ పార్టీ తన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తుంది. స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీ చేయవచ్చు. బ్యాలెట్ పెట్టెపై వారి జాబితా కూడా ఉంటుంది. ఓటరు తనకు నచ్చిన పార్టీకి, లేక స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేస్తారు. మొత్తం ఓట్లలో ఒక పార్టీకి వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి శాసన సభలో దానికి స్థానాలు కేటాయించడం జరుగుతుంది. ఉదాహరణకు మన లోక్‌సభలో మొత్తం స్థానాలు 545 ఉంటే, ఒక పార్టీకి 40 శాతం ఓట్లు వస్తే దానికి 40 శాతం స్థానాలు అంటే 218 స్థానాలు కేటాయిస్తారు. రెండో పెద్ద పార్టీకి 30 శాతం ఓట్లు వస్తే దానికి 30 శాతం స్థానాలు అంటే 163 స్థానాలు, మరో పార్టీకి 10 శాతం ఓట్లు వస్తే దానికి 10 శాతం స్తానాలు అంటే 54 స్థానాలు ఇలా కేటాయిస్తారు. మొత్తం మీద ఈ పద్ధతిలో ఆయా పార్టీలకు వచ్చే ఓట్లను బట్టి స్థానాలు కేటాయించబడతాయి. అంటే ఓటు వేసే ప్రతి ఓటరుకూ సభలో ప్రాతినిధ్యం లభించినట్లవుతుంది. అయితే మొత్తం దేశాన్ని ఒకే యూనిట్‌గా తీసుకుంటే ఈ విధమైన కేటాయింపులు జరుగుతాయి. కానీ రాష్ట్రాన్ని లేక జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని కూడా దామాషా ఓటింగ్ నిర్వహించవచ్చు. ఉదాహరణకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుంటే కొత్త ఆంధ్ర ప్రదేశ్‌లో 25 స్థానాలున్నాయి. ఇక్కడ ఒక్కో పార్టీకి వచ్చిన ఓట్లను బట్టి లోక్‌సభలో సీట్లు కేటాయించవచ్చు. అలా ప్రతి రాష్ట్రాన్ని లేక ప్రాంతాన్ని యూనిట్‌గా తీసుకుని దామాషా పద్ధతిలో ఓటింగ్ నిర్వహించడం అనేక దేశాల్లో ఉంది.

పార్టీ జాబితా ఓటింగ్ వద్ధతిలో రెండు ప్రధాన రకాలున్నాయి. 1. క్రమం చెదరని పద్ధతి. దీన్ని క్లోజ్డ్ లిస్ట్ పార్టీ లిస్టు ఓటింగ్ అంటారు 2. క్రమం చెదిరిపోయే పద్ధతి. దీన్ని ఓపెన్ లిస్ట్ పార్టీ లిస్ట్ ఓటింగ్ పద్ధతి అంటారు.


క్రమం చెదరని పద్ధతిలో ఒక పార్టీ ప్రకటించిన జాబితా క్రమం ఓటింగు అనంతరం యథాతథంగా ఉంటుంది. వచ్చిన ఓట్లను బట్టి జాబితాలో వరుస క్రమంలో అభ్యర్థులను గెలిచినట్లు ప్రకటించుకుంటూ పోతారు. ఉదాహరణకు బిజెపీ 545 స్థానాలకు 545 మంది అభ్యర్థుల జాబితా ముందుగానే ప్రకటించిందనుకోండి. అలాగే కాంగ్రెస్, వామపక్షాలు ఇతర పార్టీలు తమ తమ జాబితాలు ప్రకటించాయనుకోండి. గత ఎన్నికల్లో బిజెపీకి 31 శాతం ఓట్లు వచ్చాయి. దామాషా పద్ధతిలో అయితే దానికి 169 స్థానాలు వస్తాయి. అప్పుడు ఆ పార్టీ జాబితాలో పైన ఉన్న 169 మంది లోక్‌సభ సభ్యులుగా ఎన్నికవుతారు. కాంగ్రెస్‌కు 19.3 శాతం ఓట్లు వచ్చాయి. దానికి దామాషా ప్రకారం 105 స్థానాలు కేటాయించబడతాయి. అప్పుడు ఆ పార్టీ జాబితాలోని పై 105 మంది లోక్‌సభకు వెళతారు. సిపిఐ(ఎం)కు 3.2 శాతం ఓట్లు వచ్చాయి. దామాషా ప్రకారం అయితే దానికి 17 స్థానాలు వస్తాయి. అప్పుడు పార్టీ తన జాబితాలోని పై 17 మంది అభ్యర్థులను లోక్‌సభకు పంపుతుంది. (పార్టీ జాబితా పద్ధతిలో ఎన్నికలు జరిగినప్పుడు చిన్న పార్టీలకు మేలు జరుగుతుంది. ఉదాహరణకు, ప్రస్తుత విధానంలో వామపక్ష పార్టీలు దేశమంతటా పోటీ చేయలేవు. అందువల్ల దేశవ్యాపితంగా ఉన్న వామపక్ష ఓటర్లకు తమ పార్టీలకు ఓటు వేసే అవకాశం ఉండదు. కానీ దామాషా పద్ధతిలో దేశంలోని మారుమూల ఉన్న వామపక్ష ఓటరు కూడా తమ పార్టీలకు ఓటు వేసుకోగలుగతాడు. అంతే కాకుండా ఓడిపోయే అభ్యర్థికి ఓటు వేస్తే

తన ఓటు మురిగిపోతుందనే భావన ఓటరులో ఉండదు. కనుక ఈ పద్ధతిలో వాటి ఓటింగు బలం, ఆమాటకొస్తే అన్ని పార్టీల ఓటింగు బలం సరైన రీతిలో ప్రతిబింభిస్తుంది.)

పార్టీ ఓటింగు జాబితా పద్ధతిలో రెండోది క్రమం చెదిరిపోయే పద్ధతి. ఈ పద్ధతిలో పార్టీ జాబితా ఉంటుందీ, అదే సమయంలో ఓటర్లు అభ్యర్థులను కూడా దృష్టిలో పెట్టుకుని ఓట్లు వేస్తారు. ఓటర్లు తనకు నచ్చిన పార్టీ జాబితా లోని నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తారు. అంటే వారి ఓట్లు పార్టీకే కాకుండా ఆ పార్టీ జాబితా లోని అభ్యర్థికి చెందుతాయి. మన గత సార్వత్రిక ఎన్నికలనే ఉదాహరణగా తీసుకుంటే, ఇందులో 81.45 కోట్ల మంది ఓటర్లకు గాను 66.38 శాతం మంది అంటే 54 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం పోలైన ఓట్లను మొత్తం అభ్యర్థులతో భాగిస్తే (54 కోట్లు / 545) ఒక్కో అభ్యర్థికి సుమారు 9 లక్షల 91 వేల ఓట్లు రావాలి. అంటే ఇన్ని ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలిచినట్లే. పార్టీ జాబితాలో ఏ అభ్యర్థి కైనా ఈ సంఖ్యను దాటి ఓట్లు వస్తే అతను గెలిచినట్లే. కానీ ఒక్కోసారి ఒక అభ్యర్థికి కావలసిన దానికన్నా ఎక్కువ ఓట్లు రావచ్చు. అప్పుడు ఆ ఎక్కువ ఓట్లను జాబితాలో దిగువ, అవసరమైన వాటికన్నా తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థికి కలుపుతారు. ఇలా అవసరమైన ఓట్లు వచ్చిన అభ్యర్థులను గెలిచినట్లు ప్రకటిస్తూ వారికి వచ్చిన అదనపు ఓట్లను జాబితాలో దిగువన ఉన్న వారికి కలుపుతారు. పార్టీల అన్ని జాబితా ల్లోనూ అవసరమైన ఓట్లు వచ్చిన వారంతా గెలవగా మిగిలిన వారుంటారు. ఉదాహరణకు 545 స్థానాల్లో 540 స్థానాలు నిండిపోయా యనుకుందాం. కానీ మిగిలిన 5 స్థానాల్లో పార్టీల జాబితాల్లోని ఎవరికీ అవసరమైనన్ని ఓట్లు రాలేదనుకుందాం. అప్పుడు అన్ని జాబితా ల్లో మిగిలినవారిలో ఎవరికైతే ఎక్కువ ఓట్లు వస్తాయో వారిలో అయిదుగురిని వరుస క్రమం లో లోక్‌సభకు పంపుతారు. ఇక మిగిలిన వారంతా ఓడిపోయినట్లే అవుతుంది. ఈ పద్ధతి లో రాజకీయ పార్టీలు ప్రకటించిన జాబితా క్రమంలో ఉన్న అభ్యర్థులు కిందివారు మీదికీ, మీదివారు కిందికీ వస్తారు. ఈ పద్ధతి వల్ల అటు రాజకీయ పార్టీలకు వచ్చే ఓట్లూ నమో దవుతాయి, అదే సమయంలో ఓటరుకు ఇష్టమైన అభ్యర్థీ గెలుపొందుతాడు. అందుకే చాలా ఐరోపా దేశాలు ఈ 'క్రమం చెదిరిపోయే' (ఓపెన్‌లిస్ట్) పద్ధతిని అనుసరిస్తున్నాయి.

ప్రపంచంలోని అనేక దేశాలు తమ పార్ల మెంటులకూ, అసెంబ్లీలకూ, స్థానిక సంస్థలకూ

**❝ దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగినప్పుడు చిన్న పార్టీ లకు మేలు జరుగుతుంది. ఉదాహరణకు, ప్రస్తుత విధానం లో వామపక్ష పార్టీలు దేశమంతటా పోటీచేయలేవు. అందువల్ల దేశవ్యాపితంగా ఉన్న వామపక్ష ఓటర్లకు తమ పార్టీలకు ఓటు వేసే అవకాశం ఉండదు. కానీ దామాషా పద్ధతిలో దేశంలోని మారుమూల వున్న వామపక్ష ఓటరు కూడా తమ పార్టీలకు ఓటు వేసుకోగలుగతాడు. ❞**




జరిగే ఎన్నికల్లో పార్టీ జాబితా విధానాన్ని మరీ ముఖ్యంగా ఓపెన్‌లిస్టు విధానాన్ని అనుసరిస్తు న్నాయి. ఐరోపా పార్లమెంటుకు జరిగే ఎన్నికల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు.

**మిశ్రమ సభ్యత్వ దామాషా ఓటింగు (మిక్స్‌డ్ మెంబర్ ప్రపోర్షనల్ -ఎంఎంపి ఓటింగు)**

ఒక నియోజకవర్గానికి చెందిన ఓటర్లు తమ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులను గెలిపించుకోవాలనుకుంటారు. ఎందుకంటే గెలిచిన అభ్యర్థి తన నియోజకవర్గంలో వుంటా డు కనుక. దామాషా పద్ధతిలో ఈ అంశానికి ప్రాధాన్యత తగ్గిపోతుందని విమర్శ ఉంది. దీన్ని సరిదిద్దడం కోసం ఈ మిశ్రమ దామాషా పద్ధతి ప్రవేశ పెట్టారు. దీన్ని రెండు ఓట్ల పద్ధతి, జర్మన్ ఓటింగ్ పద్ధతి, అదనపు సభ్యుల పద్ధ తి...ఇలా అనేక పేర్లతో పిలుస్తారు. ఇందులో దామాషా పద్ధతీ, ముందొచ్చిన వారు గెలుపొం దినట్లు ప్రకటించే పద్ధతీ రెండూ కలిసి ఉ ంటాయి. అంటే మొత్తం సభ్యుల్లో సగం మందిని (దేశాలను బట్టి నిష్పత్తులు మారిపోతూ వుంటాయి) దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. మరో సగం మందిని ప్రస్తుత మన ఎన్నికల పద్ధతి ద్వారా ఎన్నుకుంటారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పశ్చిమ జర్మనీ ఈ ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టింది. న్యూజిలాండ్, హంగరీ, కొత్తగా వెనిజులా, బొలీవియా వంటి దేశాలు ఈ పద్ధతిని అనుసరిస్తున్నాయి.

**ప్రాధాన్యతా ఓటింగు లేదా సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటింగు**

మన దేశంలో శాసన మండలి ఎన్నికల్లో ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. ఐర్లాండ్, మాల్టా వంటి దేశాల్లో పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతిని ఉపయోగిస్తారు. ఇందులో ఓటరుకు ఒకే ఓటు కాకుండా అనేక ప్రాధాన్యత ఓట్లు వుంటాయి. తనకు నచ్చిన పార్టీ జాబితాలో వున్న ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేస్తూ అదే సమయంలో రెండవ ప్రాధాన్యతా ఓటు మరో అభ్యర్థికి వేయవచ్చు. గెలిచే అభ్యర్థికి ఎన్ని ఓట్లు రావాలి అనేది ఒక ఫార్ములా ప్రకారం నిర్ణయిస్తారు. మొత్తం స్థానాలకు ఒకటి కలిపి వచ్చిన సంఖ్యతో మొత్తం చెల్లిన ఓట్లను భాగి స్తారు. అప్పుడు వచ్చిన సంఖ్యకు ఒక ఓటు కలపగా వచ్చేదే గెలవడానికి అవసరమైన ఓటుగా పరిగణిస్తారు. (మొత్తం చెల్లిన ఓట్లు/

**❝ దామాషా ఎన్నికల విధానం కూడా పూర్తి ప్రజాస్వామికం అనుకో కూడదు. ఇవన్నీ కూడా బూర్జువా ప్రజాస్వామ్యంలో కొన్ని ఎన్నికల వ్యవస్థలు. ప్రజాస్వామ్యం ఒక్క సోషలిస్టు వ్యవస్థలోనే పూర్తిగా ఫరిడవిల్లుతుంది. అయితే బూర్జువా ప్రజాస్వామ్యం లోని ఎన్నికల వ్యవస్థల్లో పరిమితులను అధిగమించేందుకూ, మెరుగైన వ్యవస్థలు రూపొందించుకునేందుకూ పోరాడడం ద్వారానే మనం జనతా ప్రజాస్వామ్యంలోకీ, అంతిమంగా సోషలిజంలోకీ వెళ్లగలం.❞**

1+మొత్తం స్థానాలు)+1....ఇదీ ఆ ఫార్మలా. ఉదాహరణకు ఒక అసెంబ్లీలో 10 లక్షల మంది ఓటర్లుండి అక్కడ 100 స్థానాలున్నాయనుకోండి. 150 మంది పోటీ పడుతున్నారనుకోండి. అప్పుడు ఫార్మలా ప్రకారం 100+1=101తో 10,00,000ను భాగిస్తారు. 10,00,000/101= 9901 ఓట్లు. దీనికి ఒకటి కలిపితే... 9902 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చిన వ్యక్తి ఎన్నికైనట్లు ప్రకటించబడతాడు. ఇలా ఎంత మందికి వస్తే వారంతా మొదటి రౌండులో ఎన్నికవుతారు. వీరికి కావలసిన వాటికన్నా ఎక్కువ ఓట్లు వస్తే అవి రెండో రౌండుకు బదిలీ అవుతాయి. రెండో రౌండు లెక్కింపు జరిపేటప్పుడు మిగిలిన అభ్యర్థులకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లతోబాటు, గెలిచిన అభ్యర్థులకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరెవరికి ఎన్ని వచ్చాయో కలుపుతారు. అప్పుడు ఎవరికైనా గెలుపుకు అవసరమైన ఓట్లు వస్తే వారు గెలిచినట్లు ప్రకటిస్తారు. లేకుంటే కింది స్థాయిలో ఉన్న అభ్యర్థిని పోటీనుండి తొలగించి అతని




రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎన్ని వస్తే అన్ని కలుపుతారు. అప్పుడు గెలవడానికి అవసర మైనన్ని ఓట్లు ఎవరికి వస్తే వారు గెలిచినట్లు ప్రకటిస్తారు. ఇదంతా మనకు ఒక సంక్లిష్టమైన పద్ధతిలా కనిపిస్తుంది. కానీ ఈ సంక్లిష్టతతో ఓటరుకు పనిలేదు. అది లెక్కించేవారు చూసుకుంటారు. ఓటరు చేయాల్సినదల్లా జాబితా లోని అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓట్లు వేసి రావడమే. ఇది కూడా ఒక రకమైన దామాషా పద్ధతే. ఇందులో కూడా ఓటరు తీర్పు చాలా వరకు చట్టసభల్లో ప్రతిఫలిస్తుంది.

ఓటరు జాబితా పద్ధతి, మిశ్రమ పద్ధతి, ప్రాధాన్యతా ఓటింగు పద్ధతి... ఇవన్నీ కూడా దామాషా ఎన్నికల విధానంలో భాగాలే. అత్యధిక దేశాల్లో, మనకన్నా ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉన్న దేశాల్లో కూడా అనేక దశాబ్దాలుగా ఈ విధానం అమలవుతున్నది. దామాషా ఎన్నికల విధానం కూడా పూర్తి ప్రజాస్వామికం అనుకో కూడదు. ఇవన్నీ కూడా బూర్జువా ప్రజాస్వామ్యంలో కొన్ని ఎన్నికల వ్యవస్థలు. ప్రజాస్వామ్యం ఒక్క సోషలిస్టు వ్యవస్థలోనే పూర్తిగా ఫరిడవిల్లుతుంది. అయితే బూర్జువా ప్రజాస్వామ్యంలోని ఎన్నికల వ్యవస్థల్లో పరిమితులను అధిగమించేందుకూ, మెరుగైన వ్యవస్థలు రూపొందించుకునేందుకూ పోరాడడం ద్వారానే మనం జనతా ప్రజాస్వామ్యంలోకీ, అంతిమంగా సోషలిజంలోకీ వెళ్లగలం.

మనం ఇప్పుడు అనుసరిస్తున్న ఎన్నికల విధానం ధనస్వామ్యానికి దారితీస్తే దామాషా విధానం ప్రజాస్వామ్యానికి పెద్దపీట వేస్తుంది. అందువల్ల ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ మరింత భ్రష్టు పట్టక ముందే మనం దామాషా ఎన్నికల్లోకి వెళ్లడం మంచిది. అయితే అధికార పక్షంలో ఉండే పార్టీలు దీన్ని అంత తొందరగా అంగీకరించవు. ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న పార్టీ తన ఓట్ల శాతానికి తగ్గ సీట్లు రాలేదని బాధపడొచ్చు గానీ అదే పార్టీ అధికారంలోకి వచ్చేటప్పుడు ఈ విధానం వల్ల లాభపడుతుంది కాబట్టి దామాషా ఎన్నికల విధానానికి ఒప్పుకోదు. ఈ విధానంలో కేంద్రీకరణ జరుగుతుంది కాబట్టి బడాబూర్జువా-భూస్వామ్య పాలక పక్షాలు దీనికే మొగ్గు చూపుతున్నాయి. కాబట్టి నిజమైన ప్రజాస్వామ్యం వైపు దేశాన్ని తీసుకుపోవాలని కోరుకునే శక్తులు ప్రజల్లో దామాషా విధానంపై చర్చపెట్టి, వారిని చైతన్యపరిచి, పోరాటం ద్వారా పెద్ద ఒత్తిడి తేవాల్సి ఉంది. దామాషా ఎన్నికల విధానం కోసం జరిగే పోరాటం జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మాణంలో ఒక కీలకాంశంగా ఉంటుంది. ⊖

# వామపక్షాల ముందున్న కర్తవ్యం

(9వ పేజీ తరువాయి)

లంటే, ప్రజలను వారి స్వంత అనుభవం ప్రాతిపదికగా, పడిపోతున్న వారి జీవన ప్రమాణాలను నిలుపుకోవడం కోసం ఉద్యమాల్లోకి నడపాలి. నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడ్డం ద్వారా మాత్రమే వారు మతతత్వ శక్తులను నిలువరించగలరు. వామపక్షాలు ఈ పని తప్పకుండా చేయాలి.

వీటన్నిటినీ సమీక్షించుకుని రానున్న కాలంలో సిపిఐ(ఎం) ఒక సానుకూలమైన ఎజెండాతో మీ ముందుకు వస్తుంది. వామపక్షాలు ఇటీవలి ఎన్నికల్లో ఎదురైన ఎదురు దెబ్బలను అధిగమించి త్వరలోనే సంస్థాగతంగా బలపడ్డమే కాకుండా, నయా-ఉదారవాద విధానాలకూ, మతతత్వ శక్తులకూ వ్యతిరేకంగా ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించగలవన్న నమ్మకం నాకుంది.

కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య శత జయంతి ఉత్సవాల సందర్భంగా మనం ఆయన జీవితం నుండి స్ఫూర్తిని పొందుదాం. ఆయన నిబద్ధత గల మార్క్సిస్టు-లెనినిస్టు నాయకుడు. విదేశీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దేశంలో భూస్వామ్య-పెట్టుబడిదారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా మొక్కవోని దీక్షతో పోరాడారు. అందుకే ఆయన జీవితం మనకు నిత్యం స్ఫూర్తినిస్తుంది. ఆయన స్ఫూర్తిని గుండెలనిండా నింపుకుని మనం రానున్న కాలంలో మన పార్టీని పునర్నిర్మించుకోడానికీ, ప్రజా బలం పెంచుకోడానికీ తీవ్రంగా కృషి చేద్దాం.

ప్రపంచ గమనం

# గాజాపై ఇజ్రాయిల్ దాడులు అమెరికా వ్యూహంలో భాగం





**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ కార్యాలయం అంతర్జాతీయ విభాగం బాధ్యతలు చూస్తారు**

**ఆర్. అరుణ్ కుమార్**

*"ఈ రోజుల్లో ఒక రాజకుమారుడు, ఆయన పేరుచెప్పడం బాగుండదు, ఎప్పడూ శాంతి గురించీ, మంచితనం గురించీ మాట్లాడు తుంటాడు, కానీ ఆ రెండూ ఆయనకు నచ్చవు".*

**మాఖియవిల్లె, యువరాజు.**

నాడు మాఖియవిల్లె, ఆరగాన్ రాజు ఫెర్డినాండ్ గురించి చెప్పాడు. కానీ నేడామాటలు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాకు సరిగ్గా అతుకుతాయి. ఒబామా నోబుల్ శాంతి బహుమతి గెలుచుకున్నారు. అమెరికా ఎన్నికల్లో కూడా యుద్ధ-వ్యతిరేక ప్రచారంవల్ల, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లలో యుద్ధాన్ని వ్యతిరేకించడం వల్ల గెలుపొందారు. ప్రస్తుతం రెండో దఫా అధ్యక్ష పదవిని వెలగబెడుతున్న ఆయన తన నిజమైన ఊసరవెల్లి రంగులను బయటపెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్ష పదవి పొందాలని కలలు కన్న విదేశాంగ శాఖ ఉపమంత్రి జాన్ కెర్రీ ఇప్పుడు ఈ 'రాజు' గారికి బాగా సహాయం చేస్తున్నారు. ఆయన గారు ప్రస్తుతం ఇజ్రాయిల్ లో ఉన్నారు. అంతకు ముందు ఉక్రెయిన్ వెళ్లారు. ఆయన పనల్లా ఏమిటంటే ఎక్కడికి వెళితే అక్కడ యుద్ధాగ్ని జ్వాలలమీద ఆజ్యం పోసి రావడమే. అయితే యుద్ధజ్వాలలు రగిలించింది మాత్రం ఆయన కాదు. ఆ పని ఆయనకు ముందున్న అధ్యక్షుల వారు చేశారు. ఇజ్రాయిల్, తాలిబాన్, ఆల్ ఖైదా, ఐఎస్ఐఎస్, ఉక్రెయిన్‌లో నయా-నాజీలు... యుద్ధోన్మాదులెవరి పేరైనా చెప్పండి వారందరికీ డబ్బు, ఆయుధాలు, మందుగుండు అందింది అమెరికా నుండీ, దాని మిత్ర దేశాలనుండే.

ప్రపంచ వ్యాపితంగా మరీ ముఖ్యంగా సహజవనరులతో తులతూగే దేశాల్లోనూ, నౌకాయాన మార్గంలో ఉన్న దేశాల్లోనూ సామ్రాజ్యవాదులు ప్రారంభించిన "నిర్మాణాత్మక గందరగోళం" అనే కళ మూలంగా నేడు మనం అనేక చోట్ల దుర్మార్గాలను చూస్తున్నాం. 'దుర్మార్గం అనేది సాపేక్షమైనది అందువల్ల "తక్కువ దుర్మార్గులను" ఎన్నుకో' అనేది నేడు మన సమిష్టి చైతన్యం మీద సామ్రాజ్యవాదులు రుద్దుతున్న ఒక పెద్ద దుర్మార్గం. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లలో సామ్రాజ్యవాదులు జరుపుతున్న దుర్మార్గాలను చూసి దిగ్భ్రాంతికి లోనైన ప్రపంచం ఆ దిగ్భ్రాంతి నుండి కోలుకోక ముందే, లిబియా, సిరియాలల్లో దుర్మార్గాలకు పాల్పడ్డారు. వెనువెంటనే ఉక్రెయిన్, తరువాత మళ్లీ ఇరాక్ మీద, పాలస్తీనా మీద ఇలా మళ్లీ మళ్లీ దుర్మార్గాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇన్‌స్టాంట్ కాఫీలాగా ఇన్‌స్టాంట్ వార్తలు, ఇన్‌స్టాంట్ జ్ఞాపకాలకు అలవాటు పడిన వ్యాపారమయ ప్రపంచంలో సామ్రాజ్యవాదం వందలాది అమాయక ప్రాణాలు తీస్తూ మరో వంక ఆ వార్తలను కేవలం భావితరాలకు అందించే కొన్ని గణాంకాలుగా మార్చేసి మన మెదళ్లను మొద్దుబారుస్తోంది. బాధితులను పీడకులుగానూ, పీడకులను బాధితులుగానూ మార్చేసి విపరీతంగా ప్రచారం గావిస్తోంది.


### దురాక్రమణదారు ఇజ్రాయిల్

ఇజ్రాయిల్ మరోసారి గాజాపై సైనిక దురాక్రమణ దాడులు ప్రాంరభించింది. దానికి 'ఆపరేషన్ ప్రొటెక్టివ్ ఎడ్జ్' (రక్షణ చర్య) అని పేరు పెట్టింది. ఈ దాడిలో గాజాలో ఇప్పటి వరకు 700 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. ముగ్గురు ఇజ్రాయిలీలను ఎవరో తెలియని వ్యక్తులు అపహరించి చంపేసారు. దాన్ని సాకుగా చూపించి గాజాపై తాజా దాడులకు పాల్పడ్డారు. చంపిన వారు హమాస్‌కు చెందిన వారని ఇజ్రాయిల్ ఆరోపణ. అటువంటి హమాస్‌ను ఎన్నికల్లో పాలస్తీనియన్లు గెలిపించి ఉన్నారు గనుక శిక్ష వారందరికీ పంచాలని దాడులు చేస్తోంది. చాలా స్వేచ్ఛాపూరితంగా, న్యాయబద్ధంగా జరిగిన ఎన్నికల్లో పాలస్తీనా ప్రజలు హమాస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ పరిశీలకునిగా ఉన్నారు. ఇజ్రాయిల్ ఈ దురాక్రమణ దాడుల ద్వారా అన్ని రకాల అంతర్జాతీయ ఒప్పందాలనూ, చట్టాలనూ ఉల్లంఘించింది. చివరికి రెండు పక్షాలు అంగీకరించిన కాల్పుల విరమణను కూడా అది ఉల్లంఘించింది. కానీ సామ్రాజ్యవాద మీడియాలో ఈ విషయాలేవీ రావు, వచ్చినా ఎక్కడో చిన్న ముక్కగా రిపోర్టవుతాయి అంతే.

మనం కొన్ని మౌలిక వాస్తవాల్లోకి వెళదాం: 2000 సంవత్సరం నుండి ఇజ్రాయిల్ 1,500 మంది పాలస్తీనా పిల్లలను పొట్టన బెట్టుకుంది. 2009 గాజా మారణకాండలో ఇజ్రాయిల్ మొత్తంగా 1,400 నుండి 7000 మంది పాలస్తీనియన్ పౌరులను వధించారు. కానీ పాలస్తీనియన్లు ఇన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్ మీద చేసిన ప్రతిదాడుల్లో మరణించింది 26 మంది మాత్రమే. రెండు పక్షాలకు మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాల్లో అత్యధిక ఒప్పందాలను ఇజ్రాయిల్ ఉల్లంఘించింది. ప్రపంచంలో ఏ ఇతర దేశం కన్నా కూడా ఎక్కువగా ఇజ్రాయిల్ ఐక్యరాజ్య

> **“జెరూసలెం, ఆ చుట్టుపక్కల ప్రాంతాన్ని క్రైస్తవులు, ముస్లింలు, యూదులు పవిత్రమైనదిగా భావిస్తారు. వారి మతాలు ఇక్కడే పుట్టాయని మూడు మతాల వారూ అనుకుంటారు. ఈ మతాల పుట్టుక, విస్తరణకు సంబంధించిన పురాణాలన్నీ కూడా ఈ ప్రాంతం, ఇక్కడి పవిత్ర ప్రదేశాలూ తమ మతస్తులవే అని మూడు మతాలవారు చేసే వాదనలకు బలం చేకూరుస్తుంది.”**

1946 నుండి 2005 వరకు పాలస్తీనా కోల్పోయిన, ఇజ్రాయిల్ దురాక్రమించుకున్న భూభాగం




సమితి ఒప్పందాలను ఉల్లంఘించింది. ప్రస్తుతం గాజాపై తను చేస్తున్న దాడికి కారణం హమాస్, పాలస్తీనియన్లేనని ఇజ్రాయిల్ చేస్తున్న వాదన పూర్తిగా అవాస్తవం తప్ప ఇంకోటి కాదు. నిజానికి పాలస్తీనా భూభాగాలను ఆక్రమించుకోడంలో ఇజ్రాయిల్ అబద్దాలను ఒక కళగా పెంపొందించింది.

## సంక్షిప్త చరిత్ర

జరూసలెం, ఆ చుట్టుపక్కల ప్రాంతాన్ని క్రైస్తవులు, ముస్లింలు, యూదులు పవిత్రమైనదిగా భావిస్తారు. వారి మతాలు ఇక్కడే పుట్టాయని మూడు మతాల వారూ అనుకుంటారు. ఈ మతాల పుట్టుక, విస్తరణకు సంబంధించిన పురాణాలన్నీ కూడా ఈ ప్రాంతం, ఇక్కడి పవిత్ర ప్రదేశాలూ తమ మతస్తులవే అని మూడు మతాలవారు చేసే వాదనలకు బలం చేకూరుస్తుంది. ఇజ్రాయిల్ భూగోళశాస్త్రవేత్త ఓరెన్ యిఫ్టాచెల్ ఈ విధంగా రాశారు: “ఈ ప్రాంతమంతా యూదులదే కాబట్టి ఇక్కడ యూదులకు మాత్రమే స్థానం ఉండాలి (యూదీకరణ లేక అరబ్బులు లేకుండా చేయాలి) అనే కార్యక్రమాన్ని ఇజ్రాయిల్ రాజ్యం ప్రారంభ దినాల్లో చేపట్టారు. దాని కనుగుణంగానే ఇజ్రాయిల్ భౌగోళిక పునర్వ్యవస్థీకరణ జరుగుతోంది. యూదు దురహంకారం తలెత్తినప్పటినుండీ ఈ ప్రాంతం యూదులది మాత్రమే అనే భావనను పెంపొందించారు. దాని కనుగుణంగానే యూదీకరణ కార్యక్రమం జరుగుతోంది.” పాలస్తీనా భూభాగాలు, ముఖ్యంగా జెరూసలెం యూదులది అనే పురాణ కథల ఆధారంగా చరిత్రను తిరగరాయడం సరైందికాదని పురాతత్వ శాస్త్రవేత్తల పరిశోధనలు చెబుతున్నాయి. వాస్తవమేమంటే ఈ పరిశోధనలను పేరెన్నికగన్న ఇజ్రాయిలీ పురాతత్వ శాస్త్రవేత్తలే నివేదించారు.

టెల్ అవీవ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ సి. జెజెవ్ హెరోగ్ గత ఒకటిన్నర శతాబ్ద కాలంలో వెల్లడైన పురాతత్వ పరిశోధనాంశాలను సమీక్షిస్తూ హా అరెజ్ మ్యాగజైన్‌లో ఇలా రాశారు: “ఇజ్రాయిల్‌లో పురాతత్వ శాస్త్రవేత్తలు జరిపిన తవ్వకాలనుండి ఈ విషయాలు తెలుసుకున్నారు: ఇజ్రాయిలీలు ఏనాడూ ఈజిప్టులో నివసించలేదు. ఆ ఎడారుల్లో ఏనాడూ సంచరించలేదు. యుద్ధాల్లో అక్కడి భూభాగాలను జయించలేదు, వాటిని ఇజ్రాయిల్‌కు చెందిన 12 తెగలకు అందించనూ లేదు. ఇంకా మనకు మింగుడుపడకపోయినా ఒక వాస్తవం ఏమిటంటే బైబిల్‌లో ఒక ప్రాంతీయ శక్తిగా పేర్కొన్న డేవిడ్, సోలోమన్‌ల ఉమ్మడి రాజ్యం ఏదైతే ఉందో అది ఒక చిన్న గిరిజన రాజ్యం మినహా మరేమీ కాదు.” బైబిల్‌లో వర్ణించిన అంశాలను ఏమాత్రం ప్రశ్నించినా కూడా అది ‘చారిత్రకంగా తమ భూభాగంపై తమకు గల ఆధిపత్యాన్ని’ వమ్ముచేయడంగానూ, ప్రాచీన ఇజ్రాయిల్‌ను పునరుద్ధరిస్తున్న జాతి అనే భావనను పటాపంచలు చేయడంగా భావిస్తున్నారు. పురాణాల ఆధారంగా రూపొందిన ఇజ్రాయిల్ అస్థిత్వం లేదూ అంటే పెద్ద ప్రమాదం గనుక దాని పట్ల కళ్లు మూసుకోవడమే మంచిదన్న భావనలో వారు ఉన్నారు”.

ఇటీవలి వాస్తవాలు చెబుతున్నదేమంటే, ఇక్కడ మొట్టమొదటి యూదు నివాసం 19వ శతాబ్దం రెండవ భాగంలో నిర్మించబడింది. అప్పుడు ఇక్కడి జనాభాలో యూదులు 3 శాతం కన్నా తక్కువ ఉన్నారు. జనాభాలో 97 శాతం మంది పాలస్తీనా అరబ్బులుండేవారు. ఈ భూభాగాల్లో యూదులకు మాతృభూమి ఉండాలన్న డిమాండు అప్పటి నుండి పెరుగుతూ వచ్చింది. ఆనాడు వలసవాద దేశమైన బ్రిటన్‌పై పరపతి గల యూదులు ఈ విషయమై ప్రభావితం చేస్తూండేవారు. ఈ ప్రాంతంలో అత్యధిక భాగం నాడు ఒట్టమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. బ్రిటన్ నాడు ఒట్టమన్ సామ్రాజ్యంతో ఘర్షణ పడుతుండేది. సరిగ్గా నేటికి వందేళ్ల క్రితం ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధంలో రెండు సామ్రాజ్యాలూ తలపడ్డాయి. ఒట్టమన్లు ఓడిపోయారు.

## సైక్స్-పికాట్ ఒప్పందం, మొదటి ప్రపంచ యుద్ధం

మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు అన్యాయమైన సైక్స్-పికాట్ ఒప్పందం చేసుకున్నాయి. దీన్ని అధికారికంగా ఆసియా మైనర్ ఒప్పందం అంటున్నారు. ఈ రహస్య ఒప్పందం పశ్చిమాసియాలో ఎవరి నియంత్రణ, ప్రభావం ఏ భూభాగాలపై ఉండాలో నిర్దేశించింది. యుద్ధంలో గెలిస్తే అరేబియా ద్వీపకల్పం కాకుండా ఒట్టమన్ సామ్రాజ్యంలోని మిగిలిన అరబ్ ప్రాంతాలను ఎవరెవరు ఎలా పంచుకోవాలో నిర్ణయించుకున్నారు. రష్యన్ జారిస్టు ప్రభుత్వం కూడా సైక్స్-పికాట్ ఒప్పందంలో భాగంగా ఉంది. అయితే 1917లో మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం జయప్రదం కావడంతో లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ ప్రభుత్వం ఈ రహస్య ఒప్పందాన్ని లోకానికి వెల్లడించి, సామ్రాజ్యవాద కుట్రలను బయట పెట్టారు. దురాలోచనాపూరితమైన బల్‌ఫోర్ ప్రకటనకు కొద్ది వారాల ముందు లెనిన్ ఈ పని చేశారు. బెల్‌ఫోర్ ప్రకటన ఇలా పేర్కొంది: “పాలస్తీనాలో యూదు ప్రజలకు ఒక స్వంత దేశాన్ని ఏర్పాటు చేసే విషయమై ప్రభువుగారి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఈ లక్ష్య సాధనకు అది తన పలుకుబడినంతా ఉపయో

గిస్తుంది....."


ఈ ప్రకటన వెనుక దురాలోచనలను బల్ఫోర్ స్వయంగా ఇలా పేర్కొన్నారు: యుద్ధంలో గెలవడానికి రష్యా, అమెరికా దేశాలు బ్రిటన్‌కు అవసరం అదే సమయంలో "యూదుల ఆశలకు అనుగుణమైన ప్రకటన చేయడం ద్వారా ఈ రెండు దేశాల్లో బ్రిటన్ తనకు ప్రయోజన కరమైన ప్రచారం చేసుకోగలదు." ఆ కాలంలో బ్రిటన్ ప్రధాన మంత్రిగా వున్న డేవిడ్ లాయిడ్ జార్జి దీని గురించి మరింత స్పష్టంగా ఇలా చెప్పారు: "ఈ క్లిష్ట సమయంలో యూదుల సానుభూతి వుండడం, లేకపోవడం అనేది యుద్ధంలో మిత్రపక్షాలకు అనుకూలంగానో, వ్యతిరేకంగానో పనిచేస్తుంది. ముఖ్యంగా, యూదుల సానుభూతి వుంటే అమెరికాలోని యూదుల మద్దతు మరింత బాగా లభిస్తుంది, అదే సమయంలో తూర్పు రంగంలో జర్మనీ తన సైనిక బలాన్ని తగ్గించుకోవడం, ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవడం కష్టసాధ్యం అయిపోతుంది." అందువల్ల వలసవాదుల ప్రయోజనాల కోసమే పాలస్తీనా ప్రాంతంలో భూభాగాల విభజన జరిగిందనేదీ, ఈ క్రమంలో అక్కడి ప్రజల అభిప్రాయాలకు కనీస గౌరవం లభించలేదు, వారి కష్టాలను గురించి కొంచెం కూడా పట్టించుకోలేదనీ అర్థమవుతుంది. ప్రస్తుతం పాలస్తీనియన్లపై జరుగుతున్న మారణహోమానికి శతాబ్దం క్రితం నాటిని విషబీజాలే కారణం.

1930వ దశకంలో నాజీలు బలం పుంజుకుని, యూదులపై మారణహోమం సాగించడంతో ఐరోపాలనుండి పెద్ద ఎత్తున యూదుల వలసలు ప్రారంభమైనాయి. వారిలో కొందరు పాలస్తీనా చేరుకుని అక్కడ స్థిరపడడం ప్రారంభించారు. తమ ప్రాంతాలకు వలస వచ్చే యూదుల సంఖ్యను పరిమితం చేయాలని స్థానిక అరబ్బులు ప్రయత్నించారు కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత హిట్లరు ఓడిపోయి నాజీల పాలన అంతమైనాక వారి నేరాలపై ముఖ్యంగా యూదులపై వారి దమన కాండపట్ల ప్రపంచ వ్యాపితంగా నిరసనలు వ్యక్తమైనాయి. దీన్ని సరిగ్గానే 'వినాశనం' (హొలోకాస్ట్) అని పేర్కొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం అంతమవడంతోబాటు వలసవాదుల శక్తి అధికారం కూడా బలహీనపడింది. అనేక అరబ్బు ప్రాంతాలను ఆక్రమించుకున్న బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఆ ప్రాంతాలను విడిచి వెళ్లాల్సి వచ్చింది. కానీ వనరులతో తులతూగుతున్న ఈ ప్రాంతాలను వదిలిపెట్టడానికీ, అక్కడి దేశాలను స్వతంత్రంగా, సార్వభౌమాధికారంతో వుంచడానికి ఇష్టపడని వలసవాదులు కొత్తగా ఏర్పడిన ఐక్యరాజ్య సమితిని వుపయోగించుకుని అన్యాయంగా పాలస్తీనాను రెండు దేశాలుగా

**"1947 నవంబర్ 29న పాలస్తీనాను అరబ్బు దేశం, యూదు దేశం, జెరూసలెం నగరం... అనే మూడు భాగాలుగా విడగొడుతున్నట్లు ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం 181(2) తీర్మానాన్ని ఆమోదించింది. ఇజ్రాయిల్ దేశం ఏర్పడినట్లు 1948 మే 15న ప్రకటించడంతోనే పాలస్తీనియన్లను వారి స్వంత భూభాగాలనుండి తరిమేయడం ప్రారంభమైంది. 7,5 లక్షల మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ గాజా, (జోర్డాన్ నది) పశ్చిమ తీరాలకు తరిమివేసింది."**

## ఇజ్రాయిల్ దురాగతాలు



– ఇజ్రాయిల్, పాలస్తీనాగా– విడగొట్టారు.

1947 నవంబర్ 29న పాలస్తీనాను అరబ్బు దేశం, యూదు దేశం, జెరూసలెం నగరం... అనే మూడు భాగాలుగా విడగొడుతున్నట్లు ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం 181(2) తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ప్రతిపాదనను పాలస్తీనియన్లు నిరసించారు. యూదులకు 58 శాతం భూభాగాన్ని కేటాయించారు కాబట్టి డేవిడ్ బెన్–గురియోన్ నాయకత్వంలోని యూదులు దాని పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దేశం ఏర్పడినట్లు 1948 మే 15న గురియోన్ ప్రకటించాడు. ఇజ్రాయిల్ దేశాన్ని ప్రకటించడంతోనే పాలస్తీనియన్లను వారి స్వంత భూభాగాలనుండి తరిమేయడం ప్రారంభమైంది. దాంతో లక్షలాది మంది పాలస్తీనియన్లు శరణార్థులుగా మారారు. నాడు పాలస్తీనా జనాభాలో సగం మందిని అంటే 7,5 లక్షల మందిని ఇజ్రాయిల్ గాజా, (జోర్డాన్ నది) పశ్చిమ తీరాలకు తరిమివేసింది. ఐక్యరాజ్య సమితి ఈ రెండు ప్రాంతాలను పూర్తిగా పాలస్తీనియన్లకు రిజర్వు చేసింది. అయినా చివరికి ఇజ్రాయిల్ ఈ రెండు ప్రాంతాలను కూడా ఆక్రమించుకోవడం ప్రారంభించింది. పాలస్తీనియన్లను ఈ ప్రాంతం నుండి పూర్తిగా తరిమివేసి వారి భూమినీ, జల, ఇతర వనరులనూ స్వాధీనం చేసుకోవడమే ఇజ్రాయిల్ లక్ష్యం.

> **" ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకుని సామ్రాజ్యవాదులు పశ్చిమాసియాపై మొదటి నుండీ తమ పట్టు కొనసాగిస్తున్నారు. నాటి ఈజిప్టు అధ్యక్షుడు నాజర్ తన దేశంలోని సూయజ్‌కాలువను జాతీయం చేయడంతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు రెండూ ఇజ్రాయిల్‌తో కలిసి 1956లో ఈజిప్టుపై దాడికి దిగాయి. సినాయ్ ద్వీపకల్పాన్ని ఆక్రమించాయి. "**

ఇజ్రాయిల్ ఒక దేశంగా ఏర్పడిన వెంటనే అది పాలస్తీనా వాసులకు సానుభూతిగా ఉండే ఈజిప్టు, సిరియా, లెబనాన్, జోర్డాన్ వంటి దేశాలపై పలుమార్లు దురాక్రమణలకు పాల్పడింది. అప్పటి ఇజ్రాయిల్ విస్తరణ ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది.

ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకుని సామ్రాజ్యవాదులు పశ్చిమాసియాపై మొదటినుండీ తమ పట్టు కొనసాగిస్తున్నారు. నాటి ఈజిప్టు అధ్యక్షుడు నాజర్ తన దేశంలోని సూయజ్ కాలువను జాతీయం చేయడంతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు రెండూ ఇజ్రాయిల్‌తో కలిసి 1956లో ఈజిప్టుపై దాడికి దిగాయి. సినాయ్ ద్వీపకల్పాన్ని ఆక్రమించాయి. తరువాత అక్కడి



జార్జి బుష్ (సీనియర్)    బిల్ క్లింటన్

నుండి ఉపసంహరించుకోవాల్సి వచ్చినప్పటికీ ఆ ప్రాంతంలో సామ్రాజ్యవాదం ఏం చేయదలచుకున్నదో ఈ దాడి తెలియజేసింది. ఈ కాలంలోనే అంటే 1964లో యాసర్ అరాఫత్ నాయకత్వంలో పాలస్తీనా విమోచనా సంస్థ (పిఎల్ఓ) ఏర్పడింది. ఇజ్రాయిల్ దురాక్రమణ నుండి మొత్తం పాలస్తీనాను విముక్తి చేయడం దీని లక్ష్యంగా ఉండింది.

ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణలో 1967వ సంవత్సరం మరో మైలురాయిగా నిలుస్తుంది. అదే ఏడాది అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ తన పొరుగు దేశాలపై యుద్ధం ప్రారంభించి ఈజిప్టులోని సినాయ్‌ప్రాంతాన్నీ, సిరియాలోని గోలన్ దిబ్బలనూ, జోర్డాన్‌లోని పశ్చిమ తీరం, పాత జెరూసలెంనూ ఆక్రమించుకుంది. నాజర్ అనంతరం ఈజిప్టు, ఇజ్రాయిల్‌ల మధ్య అమెరికా మధ్యవర్తిత్వం చేసి సంధి కుదిర్చింది. దాంతో రెండు దేశాలూ అమెరికాకు మిత్రులైనాయి ఫలితంగా సినాయ్ భూభాగం ఈజిప్టు స్వాధీనమైంది. ఇక ఇజ్రాయిల్ నాడు స్వాధీనం చేసుకున్న ఇతర భూభాగాలను నేటికీ తన స్వాధీనంలోను ఉంచుకుంది.

ఇజ్రాయిల్ ఈ ప్రాంతంలో ఎటువంటి వ్యూహాత్మక విధానం అనుసరించాలో నిర్దేసిస్తూ యినోన్ ప్రణాళిక 1980వ దశకంలో రూపొందించబడింది. ఇజ్రాయిల్ ఒక ప్రాంతీయ సూపర్ పవర్‌గా మారాలనీ, తనకన్నా బలంగా ఉన్న ఇరాక్ వంటి దేశాలను బలహీనపరచాలనీ



# అంతర్యుద్ధాలు సామ్రాజ్యవాదుల సృష్టి

## నామ్‌చోమ్‌స్కీతో 'టెలిసుర్' పత్రిక విలేకరి ఆల్బర్ట్ ఇంటర్వ్యూ

**ఆల్బర్ట్:** అమెరికన్ సేనలు ఇరాక్ నుండి త్వరగా నిష్క్రమించటం వలన నేడున్న తీవ్ర గందరగోళ పరిస్థితులేర్పడ్డాయని కొంతమంది పండితులు విశ్లేషిస్తున్నారు. మీరు ఈ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారు?

**నోమ్ చోమ్‌స్కీ:** ఇరాక్ దుస్థితికి అమెరికా కారణమనేది నిర్వివాదాంశం. 50 సంవత్సరాల క్రితమే ఇరాక్‌లో సైనిక తిరుగుబాటును ప్రోత్సహించడం ద్వారా ఆ దేశంలో అమెరికా జోక్యం ప్రారంభించింది. 1980వ దశకంలో ఇరాన్‌పై సద్దాం హుస్సేన్ దండయాత్ర ప్రారంభించినపుడు అమెరికా ప్రభుత్వం సద్దాంకు గట్టిగా మద్ధతిచ్చింది. ఈ దండయాత్ర రెండు దేశాలకు అపార నష్టం కలిగించింది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లు ఈ దెబ్బతో రెండు దేశాలనూ నిలువరించ గలిగామని సంతోషించింది అమెరికా. సద్దాం హుస్సేన్‌ను అది ఎంతగా సమర్ధించిందంటే యుద్ధం ముగిసిన వెంటనే ఇరాకీ అణు ఇంజనీర్లకు అణ్వాయుధాల తయారీలో ఆధునిక శిక్షణ ఇప్పించేందుకు అమెరికా రమ్మని అధ్యక్షుడు జార్జి బుష్ (సీనియర్) ఆహ్వానించారు. ఏప్రిల్ 1990లో రిపబ్లికన్ పార్టీ భవిష్యత్ అధ్యక్ష పోటీదారుడైన బాబ్ డోల్ ఆధ్వర్యంలో సెనేటర్స్‌తో కూడిన అత్యున్నత స్థాయి బృందం ఇరాక్ సందర్శించి,తమ ప్రియమిత్రుడైన సద్దాంకు శుభాకాంక్షలు తెలపటమేకాక, అమెరికా ప్రధాన మీడియాలో ఇక ముందు ఇరాక్ గురించి అగౌరవపరచే పదజాలం, శత్రుత్వ భావన అనేవి రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. బహుశా అప్పటికే తమ వ్యూహం రచించే ఉంచారు కాబట్టి ఈ విషయాలన్నీ గోప్యంగా ఉంచారు.

ఇది జరిగిన కొద్ది నెలల తర్వాత సద్దాం మొదటి పొరపాటు చేశారు. అమెరికా అంతరంగాన్ని తప్పుగా అర్ధం చేసుకొని, లేదా కావాలనే అగౌరవపరచేలా కువైట్ మీదకి దాడికి దిగాడు. కాని అతిత్వరలోనే సద్దాం తన తప్పును తెలుసుకొని అమెరికా దాడిలో సర్వనాశనం అవ్వకముందే బయటపడటానికి ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే బుష్ ఆలోచనలు వేరేవిధంగా ఉన్నాయి. ఆంతరంగిక సంభాషణలలో సైనిక దళాల ప్రధానిధికారి కొలిన్ పావెల్ చెప్పినట్లుగా అమెరికా కనుక సద్దాంను తనంతట తానుగా కువైట్ నుండి వెనుదిరిగేటట్లు వదిలేస్తే, సద్దాం తన తొత్తులతో అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాడనీ, అది జరిగితే అరబ్బు దేశాలన్నీ సంతోషపడతాయనీ తెలిపాడు. అంటే సరిగ్గా కొన్ని నెలల క్రిందట అమెరికా పనామాలో ఏం చేసిందో, అదే ఇక్కడ జరిగేదనీ, కాకపోతే లాటిన్ అమెరికన్ దేశాలు ఏమాత్రం సంతోషంగా లేవనీ తెలిపాడు.

దానికి దిశానిర్దేశం చేయబడింది. ఈ కాలంలోనే ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్లను ప్రోత్సహిస్తూ మిగిలిన అరబ్బు ప్రాంతాలను కూడా ఒక క్రమపద్ధతిలో ఆక్రమించుకోవడం ప్రారంభించింది. ఇజ్రాయిలీ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా విమోచనా సంస్థ (పిఎల్‌ఓ) తొలి ప్రజాయుద్ధం –ఇంతెఫదా– ప్రారంభించింది.

సోవియట్ యూనియన్ పతనంతో పిఎల్‌ఓ సాయుధ పోరాటాన్ని విడనాడి 1990 ప్రారంభంలో ఇజ్రాయిల్‌తో శాంతి చర్చలకు పూనుకున్నది. ఫలితంగా 1993లో ఓస్లో శాంతి ఒప్పందం కుదిరింది. ఓస్లో తరువాత చర్చోప చర్చల అనంతరం 1999లో క్యాంప్ డేవిడ్ ఒప్పందం కుదిరింది. రెండు దేశాలూ తమ మధ్య సఖ్యత పెంచుకుని భవిష్యత్తులో మరింత క్లిష్ట సమస్యల పరిష్కారానికి పూనుకోవాలన్నది ఈ ఒప్పంద సారాంశం. ఇందులో కొన్ని కీలకమైన నిర్ణయాలు చేశారు: (1) పరిమిత కాలంలోనే తుదినిర్ణయానికి రావాలి. (2) శాశ్వత చర్చలపై ప్రభావం కల్పించే ఎటువంటి చర్యలకు పాల్పడకూడదు. (3) తుది పరిష్కారం 'ఐరాస భద్రతా సమితి తీర్మానాలు 242, 338 అమలుకు దారితీసేవిధంగా ఉండాలి.' ఎవరి భూభాగాలు కూడా బలప్రయోగంతో ఆక్రమించకూడదనీ, ఆక్రమిత భూభాగాల నుండి ఇజ్రాయిల్ క్రమంగా తన సేనలను ఉపసంహరించుకోవాలనీ ఈ తీర్మానాలు రెండూ చెబుతున్నాయి. కానీ ఈ కాలమంతటా ఇజ్రాయిల్ ఈ ఒప్పందాలను పూర్తిగా ఉల్లంఘిస్తూనే ఉన్నది.

> **❝ 21వ శతాబ్దంలో ఇజ్రాయిల్ దురాక్రమణ మరింత ఘోరంగా మారింది. పాలస్తీనా ప్రజలను వారి చారిత్రక ప్రాంతంలో 12 శాతానికి పరిమితం చేస్తూ అక్రమంగా, న్యాయ విరుద్ధంగా 320 కిలోమీటర్ల గోడనిర్మాణం చేపట్టింది. ఇది అన్ని రకాల అంతర్జాతీయ న్యాయచట్టాలకు విరుద్ధం. ఓస్లో చర్చల్లో అది ఇచ్చిన హామీలకు కూడా విరుద్ధం. ఈ దురాక్రమణతో ఇజ్రాయిల్ పశ్చిమ తీర భూమిలోనూ, నీటి వనరుల్లోనూ 60 శాతాన్ని అక్రంగా స్వాధీనం చేసుకుంది. ❞**



యాసర్ అరాఫత్ సద్దాం హుస్సేన్

అంతర్జా తీయ న్యాయసూత్రాలను ఉల్లంఘిస్తూ పాలస్తీనా ప్రజల హక్కులను కాలరాస్తూనే ఉన్నది.

21వ శతాబ్దంలో ఇజ్రాయిల్ దురాక్రమణ మరింత ఘోరంగా మారింది. పాలస్తీనా ప్రజలను వారి చారిత్రక ప్రాంతంలో 12 శాతానికి పరిమితం చేస్తూ అక్రమంగా, న్యాయ విరుద్ధంగా ఒక గోడనిర్మాణం చేపట్టింది. 320 కిలోమీటర్ల ఈ గోడ 1967లో ఇజ్రాయిల్ సరిహద్దుకు రెండింతలు పొడవైంది. ఇది అన్ని రకాల అంతర్జాతీయ న్యాయచట్టాలకు విరుద్ధం. ఓస్లో చర్చల్లో అది ఇచ్చిన హామీలకు కూడా విరుద్ధం. ఈ దురాక్రమణతో ఇజ్రాయిల్ పశ్చిమ

కేవలం సద్దాం హుస్సేన్‌ను కువైట్ నుండి తరిమివేయటం అనే అంశానికి పరిమితం కాకుండా, అమెరికా ఇరాక్‌పై భయంకరమైన యుద్ధానికి దిగి దాదాపు మొత్తం దేశాన్ని సర్వనాశనం చేసింది. కువైట్ నుండి ఇరాక్‌ను వెనక్కి రప్పించటానికి అనేక బేరసార పద్ధతులున్నా, వాటిని కావాలనే గుర్తించనట్లుగా నటించారు. మీడియా కూడా అమెరికా కనుసన్నల్లో నడుస్తూ అటువంటి ప్రత్యామ్నాయాలను కనపడనీయకుండా చేసింది. ఇరాక్‌పై విజయం తర్వాత అధ్యక్షుడు బుష్ సగర్వంగా ప్రకటించాడు, "మేము చెప్పిందే జరిగి తీరుతుంది" అని. అంటే ప్రపంచంలో ఏ దేశమైనా మా మాట వినకపోతే ఇదే గతి పడుతుందని హెచ్చరిక. కొన్ని వేల మంది పేద ఇరాకీ జవానుల శవాలను బుల్‌డోజర్లతో ఇసుక మేటలతో పూడ్చి వేయబడిన నరమేధం సాక్షిగా బుష్ ఈ ప్రకటన చేశాడు.

ఆ తరువాత క్లింటన్ ప్రభుత్వం వచ్చింది. ఇరాక్‌పై అనేక ఆంక్షలు విధించటం వలన, పౌర సమాజం తీవ్రంగా ఇబ్బందులకు గురయింది. ఈ ఆంక్షలలో మనవీయ కోణం కూడా ఉంది. అదే "ఆయిల్‌కు బదులుగా ఆహారం". ఈ పథకం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఖ్యాతి గాంచిన దౌత్యవేత్తలైన డెన్నిస్ హలిడే, హాన్స్‌వోన్ స్పోనెక్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఇటువంటి ఆంక్షలు మానవాళి నాశనానికి దారితీస్తాయని ప్రకటించి వారిద్దరూ రాజీనామా చేశారు. ఈ అంశం మీద వాన్ స్పోనెక్స్ రచించిన ముఖ్యమైన పుస్తకం "ఒక విభిన్నమైన యుద్ధం" నేటి వరకు అమెరికా, బ్రిటన్‌లలో నిషేధింపబడి ఉంది. ఈ ఆంక్షలు ఇరాక్ పౌర సమాజాన్ని తీవ్రంగా నష్టపరిచాయి. నియంత పరిపాలనను మరింత పటిష్టపరిచాయి. ప్రజలు తమ బతుకుతెరువు కోసం ఆయన అమలు చేసి ప్రజాపంపిణీ వ్యవస్థ మీద పూర్తిగా ఆధారపడేటట్లు చేశాయి. బహుశా అందుకే ఇతర ఘాతుక నియంతలుగా ఉండి తమ దేశాల అంతర్యుద్ధంలో పదవీచ్యుతులు కాబడిన సొమోజా, మార్కోస్, దువాలయర్, మొబుటు, సుహార్తో, ముబారక్‌లాగా కాకుండా సద్దాం కొంత కాలం రక్షించబడ్డాడు.


ఆ తరువాత కాలంలో అమెరికా–బ్రిటన్ దురాక్రమణ ప్రారంభమయ్యింది. ఇరాక్‌లో మిగిలినదేమన్నా ఉంటే అది కూడా సర్వనాశనమయ్యింది. అంతేకాదు సున్నీలు–షియాల మధ్య చిచ్చు రేపారు. అది నేటికీ కార్చిచ్చులాగా ఇరాక్‌ని దహించివేస్తూనే ఉంది. మొత్తం దేశమంతా విద్వేషాఘ్నులు విస్తరించాయి. ఒక దశాబ్ద కాలం పాటు అమెరికా శిక్షణ పొందిన ఇరాక్ సైన్యం, తర్వాత కాలంలో కేవలం కొన్ని వేల సంఖ్యలో ఉన్న తిరుగుబాటుదారుల దాడులను ఎదుర్కోలేక పతనమయ్యింది. అమెరికా మద్ధతు ఉన్నంత కాలం సద్దాం కూడా ఇతర నియంతలలాగా చాలా బలంగా ఉన్నారు. కాని సద్దాం హుస్సేన్ అధికారంలో ఉన్న కాలంలో సమాజం అభివృద్ధి చెందటమే కాదు, మొత్తం అరబ్ దేశాలన్నింటి కన్నా అద్భుత ఫలితాలు సాధించింది.

ఇదంతా గమనించిన తరువాత నాకు అమెరికన్ మెరైన్ కమాండెంట్‌గా 1966 వియత్నాం యుద్ధంలో పనిచేసిన, డేవిడ్ షాప్ వ్యాఖ్యలు గుర్తుకొచ్చాయి. "ఇప్పటికే అణగారిన జీవితాలు, తీవ్ర దోపిడికి గురయిన ఈ దేశాల వ్యవహార విషయాలలో (వియత్నాం తదితర) మన డాలర్ కోసం, లాభాల కోసం వారి అంతరంగిక విషయాలలో జోక్యం చేసుకునే బదులు, వారి స్వేచ్ఛకి వారిని వదిలేస్తే వారి అవసరాలకు తగ్గట్లు వారే వ్యూహాలు చేసుకొని, అవసరమైతే పోరాడి, తమ జీవితాలను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తారు".

**ఆల్బర్ట్:** ప్రస్తుతం ఇరాక్‌లో జరుగుతున్న ఘోరమైన మారణ కాండకు ఐ.యస్.ఐ.యస్

(పక్క పేజీలో)

> **"గాజా ప్రాంతం నేడు కేవలం 146 చదరపు కిలో మీటర్ల ఒక చిన్న పలకలాగా మార్చేయబడింది. ఈ చిన్న ప్రాంతంలో 15 లక్షల మంది పాలస్తీనియన్లు నివసించాల్సి వస్తోంది. ఈ భాగానికి మూడువైపులా ఇజ్రాయిల్, మరోవైపు మధ్యధరా సముద్రం ఆక్రమించి ఉన్నాయి. ఈజిప్టుతో ఒక చిన్న సరిహద్దు మాత్రమే ఉంది. ఇప్పుడు వాస్తవంగా గాజా ప్రాంతం ఒక జైలులాగా ఉంది."**



**శిథిలాల నుండే ప్రతిఘటన: ఇజ్రాయిల్ దాడుల్లో శిథిలమైనభవనం నుండి హమాస్ పతాకాన్ని ఎగురవేస్తున్న పాలస్తీనా చిన్నారులు**

తీర భూమిలోనూ, నీటి వనరుల్లోనూ 60 శాతాన్ని అక్రంగా స్వాధీనం చేసుకుంది. మిగిలిన 40 శాతం భూభాగాన్ని కూడా ముక్కముక్కలుగా చేసి, అన్నివైపులా ముట్టడించింది. ఈ రోజున పరిస్థితి ఏమిటంటే 70శాతం పాలస్తీనియన్లు శరణార్థులుగా మార్చబడ్డారు. వారిని ఇజ్రాయిల్ సైన్యం వారి ఇళ్లనుండీ, భూముల నుండీ తరిమేసింది.

గాజా ప్రాంతం నేడు కేవలం 146 చదరపు కిలోమీటర్ల ఒక చిన్న పలకలాగా మార్చేయబడింది. ఈ చిన్న ప్రాంతంలో 15 లక్షల మంది పాలస్తీనియన్లు నివసించాల్సి వస్తోంది. ఈ భాగానికి మూడువైపులా ఇజ్రాయిల్, మరోవైపు మధ్యధరా సముద్రం ఆక్రమించి ఉన్నాయి. ఈజిప్టుతో ఒక చిన్న సరిహద్దు మాత్రమే ఉంది. ఇప్పుడు వాస్తవంగా గాజా ప్రాంతం ఒక జైలులాగా ఉంది. ఇజ్రాయిల్ అధికారుల అనుమతి లేకుండా పూచికపుల్ల కూడా ఈ ప్రాంతంలోకి వెళ్లకూడదు, ఇక్కడి నుండి బయటకు వెళ్లకూడదు. ఇజ్రాయిల్ గాజా ప్రాంతాన్ని తన కబంధ హస్తాల్లో నలిపేస్తున్నట్లుంది. 2006లో పాలస్తీనాలో జరిగిన ప్రజాస్వామ్య ఎన్నికల్లో ఈ ప్రాంతంలో హమాస్ గెలుపొందటంతో ఈ పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ఇజ్రాయిల్ తన ఈ విధానాలన్నిటినీ నిస్సిగ్గుగా సమర్థించుకుంటుంది. "పాలస్తీనియన్లను అర్థాకలితో ఉంచాలనేగాని, వారిని కడు పుమాడ్చి చంపడం మా ఉద్దేశం కాదు" అని ఇజ్రాయిల్ ప్రధాని ఎహుద్ ఓల్మెర్ట్ సలహాదారుడైన డోవ్ వీస్‌గ్లాస్ కిరాతకంగా వ్యాఖ్యానించాడు.

1967 తరువాత ఆక్రమించిన అన్ని భూభాగాలనుండీ వైదొలగాలనీ, ఐక్యరాజ్య సమితి తీర్మానం 194 ప్రకారం పాలస్తీనా శరణార్థ సమస్యకు న్యాయమైన పరిష్కారానికి రావాలనీ అంతర్జాతీయ సమాజం చేస్తున్న విజ్ఞప్తులను ఇజ్రాయిల్ నిరంతరం పెడచెవిన పెడుతోంది. తూర్పు జెరూసలెం రాజధానిగా, 1967నాటి సరిహద్దులతో స్వతంత్ర, సార్వభౌమాధికార పాలస్తీనా ఏర్పడాలన్న విజ్ఞప్తులను కూడా ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది. ఇలా పాలస్తీనా దేశం ఏర్పడ్డం అంటే దాని స్వంత భూమిలో 22 శాతం మాత్రమే దానికి దక్కినట్లు. అయినా ఇజ్రాయిల్ వినిపించుకోవడం లేదు సరికదా ఇంకా దురాక్రమణ కొనసాగిస్తూనే ఉంది. ఇప్పటికొచ్చేసరికి చారిత్రక పాలస్తీనాలోని 88 శాతం భూభాగాన్ని తన ప్రత్యక్ష నియంత్రణలోకి తెచ్చుకుంది.

ఈ కింది వాస్తవాలు గమనిస్తే ఇజ్రాయిల్ అక్రమ ఆక్రమణలో ఉన్న పాలస్తీనాలోని పరిస్థితి మనకు సులువుగా అర్థమవుతుంది:

1967 సరిహద్దులకు రెండు వైపులా చాలా చిన్న భూభాగానికి పరిమితమైన ఇజ్రాయిలీ పరిపాలన కింద ఉన్న పాలస్తీనియన్లు ఎటువంటి మానవహక్కులు లేకుండా బతుకుతున్నారు. వారి కదలికలను ఇజ్రాయిల్ నియంత్రిస్తుంది. ఎక్కడికి వెళ్లాలన్నా వారు పాస్‌బుక్‌లు చూపించాలి.

1967 నుండి పాలస్తీనా జల వనరులను పూర్తిగా ఇజ్రాయిల్ అదుపులో పెట్టుకుంది. నీటిలో పాలస్తీనియన్లకు న్యాయమైన వాటా అందకుండా చేస్తోంది. మొత్తం నీటిలో 89 శాతాన్ని ఇజ్రాయిల్ తీసుకుని 11శాతం కన్నా తక్కువ నీటిని పాలస్తీనియన్లకు వదిలిపెడుతోంది. దాంతో ఆక్రమిత పాలస్తీనా భూభా

(ఇస్లామియక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ మరియు లివాంట్) వంటి సంస్థలు ప్రధాన కారణమని ప్రధానమైన అంతర్జాతీయ మీడియా, పత్రికలు అంటున్నాయి. దీనికి మీరేంటారు?

**చోమ్‌స్కీ:** ఈ విషయంలో నాకు తెలిసినంత వరకు వారు పక్కా సమాచారాన్ని ఇస్తున్నారు.

**ఆల్బర్ట్:** ఇరాక్‌పై అమెరికా అనుసరిస్తున్న, ప్రతిపాదిస్తున్న విధానాల గురించి మీ అభిప్రాయం ఏమిటి? ఉదాహరణకు, మిలటరీ శిక్షకులను పంపటం, ఇరాక్ ప్రభుత్వానికి ఆయుధాలు సరఫరా చేయటం, ప్రభుత్వ ఆధిపత్యం పెంచాలనీ, విస్తరింప చేయాలనీ వత్తిడి చేయటం, ప్రభుత్వ సైన్యానికి మద్దతుగా యుద్ధ విమానాలు, మానవరహిత డ్రోన్‌లను ఉపయోగించటం, పదాతి దళాలను పంపించటంపై మీ అభిప్రాయం?

**చోమ్‌స్కీ:** అమెరికన్ అప్రకటిత దురాక్రమణను ఇరాకీలు, 13వ శతాబ్దంలో మంగోలులు జరిపిన భయంకరమైన దురాక్రమణతో పోలుస్తూ గుర్తు చేసుకుంటుంటారు. ప్రపంచంలో ఇతర దేశాల మాదిరిగానే, ఇరాక్ కూడా యూరోపియన్ సామ్రాజ్యవాదపు సృష్టి. దాని అవసరాల రీత్యా ఇరాక్ సరిహద్దులు రూపొందించబడ్డాయి. టర్కీ మినహా ఎక్కువ భాగం సరిహద్దులు, ఉత్తరాన ఉన్న చమురు బావులు బ్రిటిష్ వారికి దారాదత్తం చేసేవిధంగా, పర్షియన్ గల్ఫ్‌కు వెళ్లే మార్గాలను మూసివేసే విధంగా నిర్ణయించబడ్డాయి. (కువైట్‌లో బ్రిటీష్ అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఇందులో భాగం). ప్రస్తుతం మెజారిటీ అరబ్ ఇరాకీలు (కుర్దులు తప్ప) దేశాన్ని ఒక్కటిగా ఉంచాలని కోరుకుంటున్నారు. ఇప్పుడా దేశం ఒక దౌర్భాగ్య, దిక్కు లేని స్థితిలో ఉన్నది. దేశీయంగా ఏదో ఒక రకమైన రాజకీయ పరిష్కార మార్గం చూడకుండా, అది ఎంత స్వల్పకాలిక దృష్టితో అయినా, కలగలుపుకునే పద్ధతిలో చేయకపోతే నిర్మాణాత్మకమైన అభివృద్ధి విధానం ఏదీ చేయలేము. ముఖ్యంగా ఎవరైతే గత కొన్ని సంవత్సరాలుగా ఈ దేశాన్ని దుస్థితిలోకి నెట్టారో వారివల్ల ఏమీ కాదు.

**ఆల్బర్ట్:** ఇకాక్‌లో సైనిక జోక్యం కోసం 50

> **❝ పాలస్తీనా ప్రజలు తమ స్వంత ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవడానికి వీల్లేకుండా ఇజ్రాయిల్ షరతులు పెట్టింది. దానివల్ల వారు ఇంధనం కోసం పూర్తిగా ఇజ్రాయిల్ మీద ఆధారపడాల్సిందే. 93 శాతం పైగా విద్యుత్తు ఇజ్రాయిలే సరఫరా చేస్తుంది. దాంతో పాలస్తీనా ప్రజలు ప్రపంచంలోనే అత్యధిక విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.❞**

గాల్లో నివసిస్తున్న పాలస్తీనియన్లు రోజుకు 60 లీటర్ల నీటితో జీవితాన్ని గడపాల్సి వస్తోంది. కొందరికైతే 10 లీటర్లు మాత్రమే అందుతోంది. అదే ఇజ్రాయిల్ పౌరులకైతే రోజుకు 280 లీటర్ల నీరు ఇస్తున్నారు. దీనివల్ల గాజాలో నివసిస్తున్న పాలస్తీనియన్లలో 40 శాతం మందికి పరిశుద్ధమైన నీరు లభించడం లేదు. మంచినీరు పరిశుద్ధంగా లేకపోవడం వల్ల గాజా ప్రాంతంలోని 60 మంది పాలస్తీనియన్లు అనేక రోగాల బారిన పడుతున్నారు.

ఇజ్రాయిలీల నియంత్రణ వల్ల పాలస్తీనియన్లు తమ పొలాల్లో సరిగ్గా పంటలు కూడా పండించుకోలేకపోతున్నారు. (1990వ దశకం వరకు పాలస్తీనా ప్రజల జిడిపిలో 30 శాతం వ్యవసాయం నుండి వచ్చేది. ఇప్పుడది 10 శాతానికి పడిపోయింది.)

పాలస్తీనా ప్రజలు తమ స్వంత ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవడానికి వీల్లేకుండా ఇజ్రాయిల్ షరతులు పెట్టింది. దానివల్ల వారు ఇంధనం కోసం పూర్తిగా ఇజ్రాయిల్ మీద ఆధారపడాల్సిందే. 93 శాతం పైగా విద్యుత్తు ఇజ్రాయిలే సరఫరా చేస్తుంది. దాంతో పాలస్తీనా ప్రజలు ప్రపంచంలోనే అత్యధిక విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

గాజా ప్రాంతంలో ప్రజలకు వచ్చే అంటురోగాలకు రోగనిరోధక మందులు సరఫరా చేయడానికి కూడా ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. ఈ మందులు ఇజ్రాయిల్‌కు జీవరసాయన ప్రమాదం తెస్తాయని అది వాదిస్తోంది. పాలస్తీనా జాతీయ పాలనా సంస్థ విదేశాలనుండి రేడియేషన్ థెరపీ పరికరాలను తెచ్చుకోడానికి కూడా ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. ఈ పరికరాలను బాంబుల తయారీకి వుపయోగిస్తారని సాకు చెబుతోంది.

1994లో ఆర్థిక సంబంధాలకు సంబంధించిన ఒక ఒప్పందంపై (పారిస్ ఒప్పందం) పిఎల్ఓ, ఇజ్రాయిల్‌లు సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం పన్నుల వసూలుకు సంబంధించి ఒక వ్యవస్థను ప్రవేశపెట్టింది. దాని ప్రకారం పాలస్తీనా దిగుమతులపై కస్టమ్స్ పన్ను, ఇతర పన్నులనూ, ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న పాలస్తీనియన్ల నుండి ఆదాయపు పన్ను, సామాజిక భద్రతా పన్ను, ఆరోగ్య బీమా, పాలస్తీనియన్లు ఇజ్రాయిల్‌లో జరిపే లావాదేవీలపై 'వాట్' నూ పాలస్తీనా పాలనా సంస్థ తరపున ఇజ్రాయిల్ వసూలు చేస్తుంది. ఇలా వసూలు చేసిన పన్నులను ఏ నెలకానెల ఇజ్రాయిల్ పాలస్తీనా పాలనా సంస్థ (పిఎన్ఎ)కు బదిలీ చేయాలి. ఈ రకమైన పారిస్ ఒప్పందం కుదిరినప్పుడు పాలస్తీనియన్లు ఈ పన్నులతో తమ అభివృద్ధికి బాటలు వేసుకోవచ్చునని ఆశపడ్డారు. కానీ ఇజ్రాయిల్ నియంత్రణలూ, పాలస్తీనియన్ల దిగ్బంధ విధా నమూ వారి ఆర్థికాభివృద్ధికి పెద్ద ఆటంకంగా మారిపోయింది. 2006లో పాలస్తీనాలో హమాస్ అధికారంలోకి వచ్చిందనే దుగ్దతో ఇజ్రాయిల్ అప్పటినుండి ఈ పన్నుల డబ్బును పాలస్తీనాకు ఇవ్వడం మానేసింది. ఈ మొత్తం నెలకు 6.5 కోట్ల డాలర్లుంటుంది. పాలస్తీనాకు వెళ్లే సరుకులన్నిటినీ ఇజ్రాయిల్ నియంత్రిస్తుంది. అక్కడకు వెళ్లే సరుకులన్నీ కూడా ఇజ్రాయిల్ చెక్‌పోస్టుల ద్వారా వెళ్లాల్సిందే. ఇది పాలస్తీనా వాణిజ్యాన్ని పూర్తిగా నష్టపరుస్తోంది. 2000 సెప్టెంబర్ నుండి ఇజ్రాయిల్ దిగ్బంధనం వల్ల పాలస్తీనాలో 'ఆర్థిక కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయనీ, నిరుద్యోగం, పేదరికం బాగా పెరిగిందనీ" ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది.

పేదరికంలో, ఖైదీల్లా బతుకుతున్న ఇటువంటి ప్రజలపై మళ్లీ ఇప్పుడు ఇజ్రాయిల్ దాడికి దిగి 1000 మందికి పైగా పాలస్తీనియన్లను పొట్టన పెట్టుకుంది. అమెరికా అధికారుల ప్రకటనలు ఎలా వున్నా ఇజ్రాయిల్ దాడులకు ఆ దేశం మద్దతు పూర్తిగా వుంది. ఇక్కడ ఒక వాస్తవం చెప్పుకోవాలి: నోబుల్ శాంతి బహుమతి పొందిన బరాక్ ఒబామా, ఇజ్రాయిల్‌కు ఏ ఇతర అమెరికా అధ్యక్షులకన్నా ఎక్కువ సైనిక సహాయం అందించాలని కోరారు. అందువల్ల ఇజ్రాయిల్‌కు తమ సహకారం లేదని అమెరికా చేస్తున్న ప్రకటనలన్నీ అబద్దాలు మినహా మరేమీ కావు. ఇజ్రాయిల్ చారిత్రకంగా ఐక్యరాజ్య సమితి తీర్మానాలనూ, ఒప్పందాలూ, చట్టాలనూ ఎలా వుల్లంఘిస్తున్నదో ప్రజల్లో ప్రచారం చేయాలి. ప్రతిఘటనను నిర్మించాలి. ⦿

---

కోట్ల డాలర్లు ప్రభుత్వాన్ని అడుగుతున్నాననిబరక్ ఒబామా ప్రకటించారు. అలాగే సిరియాలో ఉన్న అవకాశవాద ప్రతిపక్ష పార్టీలకు శిక్షణ ఇస్తానని తెలిపారు. దీనికి మీరేమంటారు?

**చోమ్‌స్కీ:** సిరియాలో పరిణామాలు తీవ్ర వినాశకర దిశగా అడుగులేస్తున్నాయి. దీని ఫలితంగా ఏదో ఒక విధమైన విభజన జరగటానికి ఆస్కారం కనిపిస్తోంది. అస్సాద్ పరిపాలనలో ఒక ప్రాంతం, కుర్దిష్‌ల చేతిలో ముక్కలైన ఒక ప్రాంతం, ఎంతోకొంత స్వయం ప్రతిపత్తి కలిగే మరో ప్రాంతంగా దేశం విడిపోవచ్చు. బహుశా ఈ ప్రాంతం ఇరాకీ ఖుర్దిస్థాన్‌తో భవిష్యత్తులో అనుసంధానం కావచ్చు. మరికొంత ప్రాంతం తిరుగుబాటు చేస్తున్న మిలిటెంట్ల ఆధీనంలో, ది ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ (గ్రూపు అధీనంలో ఉండవచ్చు. అమెరికా సైనిక జోక్యం చేసుకోవటం వలన ఈ భయంకరమైన వినాశ నం నుండి మెరుగైన స్థితికి ఎలా వస్తుందనేది ప్రశ్నార్థకమే.

నిజంగా అమెరికా, ఇజ్రాయిల్‌లు సిరియాలో అస్సాద్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతిపక్షానికి మద్ధతు ఇవ్వాలని భావిస్తే చాలా సరళమైన ప్రత్యామ్నాయాలు వారికున్నాయి. వుదాహరణకు, గోలన్ హైట్స్ (ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ ఆక్రమించిన సిరియన్ భూభాగం) దగ్గర ఇజ్రాయిల్ సేనలను మోహరించి ఉంటే తప్పనిసరి పరిస్థితులలో అస్సాద్ తన మిలటరీ బలగాలను సరిహద్దుల దగ్గర మోహరించి ఉండేవారు. దాని వలన తిరుగు బాటు దారుల మీద ఒత్తిడి తగ్గేది. కాని ఇటువంటి ఆలోచనలు చేస్తున్నారనే సంకేతాలు కూడా ఎక్కడా లేవు.

అరబ్బులు ఒకరినొకరు నరుక్కుంటే ఇజ్రాయిల్‌కి ఎటువంటి అభ్యంతరం లేదు. దీనివల్ల ఇజ్రాయిల్‌కే ప్రయోజనం. దాని నేర పూరితమైన దురాక్రమణలకు ప్రతిఘటన బలహీన పడు తుంది. మహారణ్యంలో ఒక అందమైన భవంతిలా ఇజ్రాయిల్ మనుగడ సాగించడానికి ఉపయోగపడుతుంది. అమెరికా కూడా తను ఊహించిన విధంగానే అస్సాద్ ప్రభుత్వం పతనమవుతుందని భావిస్తోంది.

**(అనువాదం : ఎల్.ఎస్.భారవి)**

**కార్మిక వర్గం**

# “ఆక్రమించు, ప్రతిఘటించు, ఉత్పత్తి చేయి”

## ఉద్యమంగా మారుతున్న గ్రీకు ఫ్యాక్టరీ కార్మికుల అనుభం

**మరీనా సిట్రిన్**



**రచయిత అంతర్జాతీయ మహిళా మానవహక్కుల కార్యకర్త, మేధావి, రచయిత. స్టోనీ బ్రూక్ విశ్వ విద్యాలయంలో ఆమె ప్రపంచ సామాజిక శాస్త్రాల్లో పరిశోధన చేశారు. అనేక పుస్తకాలు రాశారు.**

ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతున్నకొద్దీ అన్ని దేశాల ప్రభుత్వాలు ప్రజలకు చేయూతనివ్వకపోగా, మరింత కఠినంగా పొదుపు చర్యలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ పరిధిలోనే పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలు కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. అనంతంగా పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యకు సమాధానంగా మూతపడ్డ పరిశ్రమలకు తామే జీవం పోయటం ద్వారా ప్రత్యామ్నాయాలు చూపిస్తున్నారు. తమను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాల వెంటబడి డిమాండు చేయటం కన్నా, తోటి కార్మికులతో సంబంధాలు పెంచుకోవటం ద్వారా ఏదైనా సాధిద్దామని ఆలోచిస్తున్నారు. కార్మికులే నేరుగా మూసివేయబడిన పరిశ్రమలనూ, ఖార్ఖానాలనూ స్వాధీనం చేసుకోవటం, తిరిగి ఉత్పత్తి జరిగే విధంగా వాటిని పునరుద్ధరించడం, ప్రజాతంత్రంగా సమావేశాలు జరిపి అందరికీ సమాన వేతనాలు అందేలా చూడటం, పనిని కూడా అందరికీ దొరికేలా రొటేషన్ పద్ధతి అవలంభించటం వంటి వినూత్న ఆలోచనలను అమలు చేస్తున్నారు.

2001లో అర్జెంటీనాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం తరువాత వారి అనుభవాలను గుణపాఠంగా తీసుకొని కార్మికవర్గం తమ చుట్టూ నివసిస్తున్న స్థానిక ప్రజా సమూహాలు, వర్గాల మద్దతుతో ఉత్పత్తి కేంద్రాలను ఆక్రమించుకొని వాటికి జీవం పోసే ప్రయత్నం చేస్తున్నారు. యూరప్‌లోని గ్రీస్ దేశంలో థెశ్మలోనికి ప్రాంతంలో మొట్టమొదటిసారిగా ‘వయో మీ’ అనే ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించటంతో ఇది మొదలయ్యింది.

2011 వేసవి కాలంలో థెశ్శలోనికి ప్రాంతంలో ఒక గుంపుతో కూర్చొని అర్జెంటీనాలో జరిగిన ఆర్థిక సంక్షోభం, దాని తరువాత జరిగిన పరిణామాల గురించి మాట్లాడుతూ వారి చర్చలలో పాల్గొన్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి కేంద్రాల్లో జరుగుతున్న కార్మిక సమీకరణలు, వారి అనుభవాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి గ్రీకులలో కనిపించింది. వస్తు మార్పిడి విధానం గురించీ, దళారీలు లేకుండా నేరుగా ఉత్పత్తిదారుడు, కొనుగోలుదారునికి అమ్మే విధానంపై చర్చ జరిగింది. ఇది ఇప్పటికే గ్రీసులో చాలా ప్రాంతాలలో అమలవుతోంది. అలాగే నివాస ప్రాంతాలలో ఉండే ప్రజలతో కలిసి కొంత భూమిని సేకరించి సేంద్రీయ తోటల పెంపకాన్ని కూడా చేయడం ప్రారంభించారు. గ్రీసులో అవ్వనిదల్లా ఏమిటంటే పరిశ్రమలను ఆక్రమించుకొని వాటికి జీవం పోయటం. దీని మీద కూడా చాలా చర్చ జరిగింది. గ్రీసు లాంటి దేశంలో ఇటువంటి చర్యలు ఫలితాలివ్వవనీ, అది అసంభవమనీ, ఇక్కడి పని ప్రదేశాలు చాలా చిన్నవిగా ఉంటాయనీ, వారి సంస్కృతి వేరనీ మెజారిటీ ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ చర్చలు జరుగుతున్న కాలంలోనే, థెశ్శలోనికి ప్రాంతంలోని ‘వియో మీ’ ఉత్పత్తి కేంద్రాన్ని యజమాని మూసివేసి వెళ్ళిపోయాడు. కార్మికులకు కొన్ని నెలల జీతాలను బకాయి పెట్టడమేకాక, వారి భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా చేసి పారిపోయాడు.

దేశంలో అప్పటికే మూసివేయబడ్డ వేలాది పరిశ్రమలలో జీతాలు రాని, పని లేని కార్మికులలా కాకుండా ‘వియో మీ’ లోని నలభై మంది కార్మికులు ఒకే గ్రూపుగా సమావేశమై చర్చించి ఆ ఉత్పత్తి కేంద్రాన్ని ఆక్రమించుకున్నారు. ఇప్పటికి సరిగ్గా మూడు సంవత్సరాలయ్యింది. ‘వియో మీ’ ఉత్పత్తి కేంద్రం, కార్మికుల ఆధీనంలో విజయవంతంగా నడుస్తోంది. కలిసి ఉంటే కలదు సుఖం అనే వాతావరణంలో కొత్త కొత్త ఉత్పత్తులను కూడా తయారు చేసి స్థానిక ప్రజల సంపూర్ణ మద్దతుతో ఉత్పత్తులను అమ్ముతూ తమ ఉపాధిని కూడా రక్షించుకుంటున్నారు. అందుకే అంటారు “సాధ్యం కానిది ఏదీ లేదని”.

ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో ‘వియో మీ’ ఉత్పత్తి కేంద్రంలో కార్మికులను కలిసి వారితో మాట్లాడాను. వారు పరిశ్రమను ఎలా ఆక్రమించుకున్నారో, తమ చుట్టూ ఉన్న ప్రజలతో సంబంధాలు ఎలా పెంచుకున్నారో వివరించారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఇదేపద్ధతిలో పునరుద్ధరింపబడిన ఉత్పత్తి కేంద్రాలతో కూడా వారు సంబంధాలు ఏర్పరచుకున్నారు. మొట్టమొదటగా ఉత్పత్తి కేంద్రాన్ని ఆక్రమించుకుని, అందులో ఉన్న కొన్ని భవనాలనూ, కొన్ని హెక్టార్ల భూమినీ స్వాధీనం చేసుకున్నప్పుడు వారు దానికి జీవం పోయగలమని భావించలేదు. సాంప్రదాయంగా పని ప్రదేశాలను ఆక్రమించుకునే దానికీ, ఆక్రమించి ఉత్పత్తిని పునరుద్ధరించటానికీ చాలా తేడా ఉంది. యజమానులు తమ పాత బకాయిలు చెల్లించాలనీ, లేదా ఉత్పత్తి పునఃప్రారంభించాలన్న డిమాండ్లతో సాంప్రదాయ ఆక్రమణలు జరుగుతుంటాయి. కాని ఉత్పత్తి పునఃప్రారంభించే వారు మాత్రం మొదట పని ప్రాంతాన్ని ఆక్రమించుకొని, ఆ తరువాత అర్జెంటీనా అనుభవాలను ఆచరణలో పెట్టే ప్రయత్నం చేయటం లేదా బ్రెజిల్‌లో భూమి లేని వారు చేసే “ఆక్రమించు, ప్రతిఘటించు, ఉత్పత్తి చేయి” పద్ధతిని అమలు చేస్తారు. పునరుద్ధరణ యొక్క ఆశయం, సాధన ఎలా ఉందంటే సమిష్టిగా ఇది కార్మికులందరిదనే భావన, ఉత్పత్తి సమిష్టిగా చేయటం, తమకు కావలసింది వెనక్కి తీసుకోవటం అనే భావన అందరిలో వ్యాపించింది. ఇక ప్రతిఘటన అనేది సర్వసహజమని, ఏ పని ప్రదేశాన్ని ఆక్రమిం

చినా దాని యజమాని ప్రైవేటు వ్యక్తులు కావచ్చు లేదా ప్రభుత్వం కావచ్చు అణగతొక్కే ప్రయత్నం తప్పనిసరిగా జరుగుతుందని, దాన్ని తిప్పికొట్టిన తర్వాతే ఉత్పత్తి ప్రక్రియ ఆరంభమవుతుందని వారికి తెలుసు.

'వియో మీ'లో కార్మికులు పని ప్రదేశాన్ని ఆక్రమించుకుందామని నిర్ణయించిన తరువాత కూడా వారి అంచనాలలో తామందరం కలిసి పరిశ్రమను నడపగలమని లేదు. గ్రీసులో ఇటువంటి పరిణామాన్ని వారు ఊహించనే లేదు. అర్జెంటీనా అనుభవాన్ని విని ఉన్నా కూడా అటువంటి పరిస్థితి గ్రీసులో లేదని భావించారు. కాని అదృష్టవశాత్తు 'వియో మీ' కార్మికులు, గ్రీసులో జరుగుతున్న ఉద్యమాలు, ప్రపంచవ్యాప్త ఉద్యమ సంఘీభావ కార్మికవర్గంతో అనుసంధానం అయి ఉండటం వలన తమకు కావలసిన సమాచారాన్నీ, నిధులనూ సమీకరించుకో గలిగారు. అంతే కాదు, అర్జెంటీనాలో ఇప్పటికే పునరుద్ధరణ క్రమంలో అనుభవం కలిగిన లాలో అనే కార్మికుడిని తమ పని ప్రదేశానికి రప్పించుకున్నారు. ఈ విధంగా మూతపడిన ఉత్పత్తి కేంద్రాన్ని స్వాధీనంలోకి తీసుకుని తిరిగి ఉత్పత్తి ప్రారంభించడం గ్రీసులోని ఇతర కార్మికవర్గంపై ప్రభావం చూపించింది.

అన్ని తరగతుల కార్మికుల నుండి, అన్ని కోణాలలో అభిప్రాయాలు సేకరించటం, ప్రతి ఒక్కరి అభిప్రాయాలూ పరిగణలోకి తీసుకోవటం ద్వారా 'వియో మీ' కార్మికులు మొట్టమొదటి సమావేశం దగ్గరి నుండి స్పష్టమైన వైఖరితో ముందుకు సాగారు. నిర్ణయాలు తీసుకోగలిగే ఒకరిద్దరి అభిప్రాయాలతో లేదా అందరి తరపున వాదనలు వినిపించే వ్యక్తులతో కాకుండా మొత్తం సమావేశంలో ప్రజాతంత్రంగా వచ్చే వాదననే ఉమ్మడిగా ముందుకు తీసుకువచ్చారు. వారు తీసుకున్న మొట్టమొదటి నిర్ణయం ఏమిటంటే ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభించటం ఖాయమైంది కాబట్టి, ఇంతకు ముందు ఉత్పత్తి చేసిన సరుకులను తిరిగి ఉత్పత్తి చేయకుండా, కొత్తవి ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. అంతకు ముందు ఆ ఫ్యాక్టరీలో పారిశ్రామిక రసాయనాలు, పరిశుద్ధకాలు ఉత్పత్తి చేసేవారు. అనేక సార్లు చర్చలు జరిపిన తరువాత కార్మికులు తమ అభిప్రాయాలే కాకుండా తమ కుటుంబ సభ్యులు, తోటి పౌరులందరి అభిప్రాయాలు కూడా తీసుకొని, ఇక నుండి ఫ్యాక్టరీలో విషపూరిత పదార్థాలతో కూడిన ముడి సరుకులతో ఏదీ ఉత్పత్తి చేయరాదని నిర్ణయించారు. అందువలన ఇప్పుడు వారు స్థానికంగా తమకు దొరికేటువంటి సేంద్రీయ ముడి పదార్థాలతో

" అన్ని తరగతుల కార్మికుల నుండి, అన్ని కోణాలలో అభిప్రాయాలు సేకరించటం, ప్రతి ఒక్కరి అభిప్రాయాలూ పరిగణలోకి తీసుకోవటం ద్వారా 'వియో మీ' కార్మికులు మొట్టమొదటి సమావేశం దగ్గరి నుండి స్పష్టమైన వైఖరితో ముందుకు సాగారు. నిర్ణయాలు తీసుకోగలిగే ఒకరిద్దరి అభిప్రాయాలతో లేదా అందరి తరపున వాదనలు వినిపించే వ్యక్తులతో కాకుండా మొత్తం సమావేశంలో ప్రజాతంత్రంగా వచ్చే వాదననే ఉమ్మడిగా ముందుకు తీసుకు వచ్చారు. "



'వియో మీ' కర్మాగారాన్ని ఆక్రమించుకుని ఉత్పత్తికి పూనుకున్న కార్మికులు

ఉత్పత్తులు చేయటం ఆరంభించారు. వివిధ రకాల సుగంధాలు, ఆలీవ్ ఆయిల్ ఆధార పరిశుభ్రకాలు, సబ్బులు తయారు చేస్తున్నారు. ప్రస్తుతానికి అమ్మకాలు, తమ వేతనాలు తక్కువగా ఉన్నప్పటికీ, కనీస జీవనోపాధిని నెలకొల్పుకున్నారు. వారి జీవన పోరాటానికి చుట్టూ ఉండే ప్రజల నుండి మంచి మద్దతు లభిస్తోంది. తమ భవిష్యత్తు, కార్మికుల భవిష్యత్తుతో ముడిపడి ఉందని ప్రజలు భావిస్తున్నారు.

'వియో మీ' లోని పని ప్రదేశాన్ని కార్మికులందరు ఆక్రమించుకోగానే వారికి స్థానిక సమాజంలోని అన్ని తరగతుల వారి నుండి మద్దతు లభించింది. అర్జెంటీనాలో జరిగినట్లుగానే ప్రారంభంలో స్థానిక ట్రేడ్ యూనియన్స్, వామపక్ష పార్టీలు వారికి మద్దతు పలకలేదు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వాదనలే ఇక్కడ కూడా వచ్చాయి. సాంప్రదాయ మితవాద వామ పక్షాలూ, ఇతర అనేక యూనియన్లూ ఇవి యూనియన్ వ్యతిరేక కార్యక్రమాలనీ, వాటిని అంగీకరించలేమనీ ప్రకటించారు. అలాగే వామ పక్ష భావాలున్న సోషలిస్టులు, కార్మికులు పరిశ్రమను ఆక్రమించుకున్న తరువాత వారే యజమానులవుతారు కాబట్టి, వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. ఇలా అన్ని రకాల వ్యతిరేకతలు కార్మికులకు ఉపయోగపడ్డాయే తప్ప నష్టం కలిగించలేదు. ఎందుకంటే ఉన్న యూనియన్లు, పార్టీలలో ఎవరు నాయకత్వం వహించాలి అనే సమస్య లేకుండా పోయింది. అంతేకాదు, దీని వలన కార్మికులకే విస్తారమైన మద్దతు కూడగట్టే అనుసంధాన ప్రక్రియ అవసరమయింది. తద్వారా కొన్ని వేల మంది వీరికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతుగా పని చేస్తున్నారు. కొంత మంది ప్రత్యక్షంగా పని ప్రదేశాలలో ఉండి, కార్మికులను ఖాళీ చేయించే ప్రయత్నాలను ఎదుర్కోవటంలో తోడ్పడుతున్నారు. మరికొంత మంది ప్రజాతంత్రంగా జరిగే సమావేశాలలో పాల్గొని, తమ కమ్యూనిటీ తరపున సూచనలు, సలహాలు ఇచ్చి ఫ్యాక్టరీని నడిపించడానికి కార్మికులు చేసే నిర్ణయాలలో భాగస్వాములవుతున్నారు. ఈ రెండవ చర్య ఒక వినూత్నమైన కార్యక్రమము. ఫ్యాక్టరీ నిర్ణయాలలో భాగస్వాములై సమావేశాలలో ఓటున్నా సలహాదారునిగా పాల్గొంటుంటారు. 2014 మే నెలలో జరిగిన ఓపెన్ జనరల్‌బాడీ సమావేశంలో ఈ రకమైనవారు వందలమంది పాల్గొన్నారు. అర్జెంటీనాలో ఉన్నవిధంగానే, గ్రీసులోని 'వియో మీ' కార్మికులు కూడా తమ ఉద్యమం విజయవంతం కావా

**"ఒక పని ప్రదేశం ఆక్రమణతో పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించామని కాదు, కానీ ఈ అనుభవంతో పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావటం, తద్వారా విశాలమైన కార్మికవర్గం యొక్క అనుభవాల ద్వారా మరిన్ని ప్రాంతాలలో పని ప్రదేశాలను ఆక్రమించి, ఉత్పత్తిని ప్రారంభించటం ద్వారా, అంతిమంగా ఆ సమాజం మొత్తాన్ని, ప్రజల సహకారంతో నడపగలిగే పరిస్థితికి దారి తీయవచ్చు"**




**'ఆక్రమించు, ప్రతిఘటించు, ఉత్పత్తి చెయ్యి' గ్రీకు కార్మికవర్గానికి కొత్త అనుభం: ఏథెన్స్‌లో వెలసిన ఒక పోస్టరు**

లంటే స్థానికంగా ఉన్న ప్రజలతో తమ సంబంధాలే కీలకమని గుర్తించి, సమీకరణలలోను, సమావేశాలలోనూ అవే పద్ధతులు పాటించారు.

మూసివేయబడ్డ పరిశ్రమలను లేదా పని ప్రాంతాలను ఆక్రమించి వాటికి జీవం పోయటం అనేది పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం కాదని చాలా మంది వాదిస్తున్నారు. అలా అనుకున్నప్పటికీ, ఒకటిమటుకు వాస్తవం. కార్మికులు ఇక ఉపాధిరహితంగా ఉండబోవటం లేదని, అంతే కాదు, ఉపాధి కోల్పోయి, జీవన ప్రమాణాలు అణగతొక్కబడి నిస్సహాయంగా కూర్చోకుండా, తాము నిలబడటమే కాదు, ఇతర కార్మికవర్గానికి మార్గదర్శకంగా నిలబడుతున్నారు. 'వియో మీ' కార్మిక అసెంబ్లీ ప్రచార ప్రతినిధి అయిన "మాకిస్" ఇలా అన్నారు. "ఒక పని ప్రదేశం ఆక్రమణతో పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించామని కాదు, కాని ఈ అనుభవంతో పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావటం, తద్వారా విశాలమైన కార్మికవర్గం యొక్క అనుభవాల ద్వారా మరిన్ని ప్రాంతాలలో పని ప్రదేశాలను ఆక్రమించి, ఉత్పత్తిని ప్రారంభించటం ద్వారా, అంతిమంగా ఆ సమాజం మొత్తాన్ని, ప్రజల సహకారంతో నడపగలిగే పరిస్థితికి దారి తీయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశాడు."

పని ప్రదేశాలను పునఃప్రారంభించటమనేది సాంప్రదాయంగా నడపబడుతున్న సహకార సంస్థలకు పూర్తి భిన్నమైనది కనుకనే అది పెట్టుడిదారి సంబంధాలకు సవాలుగా మారింది. ఎందుకంటే ఈ సవాలు స్వీకరించిన తరువాత మొదటగా పని ప్రదేశాన్ని ఆక్రమించటం, సమిష్టి విధానం ద్వారా సహకార పద్ధతుల్లో ఉత్పత్తి చేయటం వలన అది పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ యొక్క పునాదినే సవాలు చేసినట్లయ్యింది. రెండవది మరీ ముఖ్యమైనది. సరికొత్త విలువలను నెలకొల్పటం, ప్రపంచ వ్యాప్తంగా వేల మంది కార్మికవర్గం ఈ పునరుద్ధరణ ప్రక్రియలో నేరుగా భాగస్వాములవటం, మరికొన్ని వేల మంది పరోక్షంగా పాల్గొనటం ద్వారా నూతన విలువలు గల సమాజం ఆవిర్భవిస్తోంది. అంటే మొత్తం కార్మికవర్గం ప్రజాతంత్ర పద్ధతులలో జరిగే సర్వసభ్య సమావేశాల ద్వారా నూతన సంబంధాలను ఏర్పరచుకోవటం, అలాగే పెట్టుబడిదారీ విధానపు ఉత్పత్తి ప్రక్రియను బద్దలు కొట్టటం వలన, దోపిడీ తీవ్రతను తగ్గించటంలోను, కొంత మెరుగైన జీవన స్థితులను అందుకోవటంలోను కృతకృత్యులయ్యారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో ఈ నూతన విలువల, సంబంధాల విధానం కొనసాగలేదు కాబట్టి, వారు ప్రత్యామ్నాయ విలువలను సృష్టించి, ఉత్పత్తి ప్రక్రియలో కూడా విలువలతో కూడిన పద్ధతులను అనుసంధానం చేస్తున్నారు. ఈ ఉద్యమాలలో భాగస్వాములైన వారి నియమం సంపద పోగు చేయటం లేదా అదనపు సంపదను సృష్టించటం కానేకాదు. వారి నియమం ఒక్కటే "విశాలమైన మద్దతు, స్నేహభావాలను పెంచడం" మాత్రమే. దీని వలన తమ పని ప్రదేశంలో, చుట్టూ ఉన్న సమాజంలో ఒకరికి ఒకరికి మధ్య ఉన్న సంబంధాలు కూడా నూతన విలువలతో మరింత పటిష్టంగా మారి, ఒక నూతన సమిష్టి విలువలతో కూడిన సమసమాజంగా మారుతోంది.

అర్జెంటీనాలోని ""యునిడాస్ పోర్ ఎల్ కెరాడో"" సహకార సంస్థ అడిడాస్ బూట్లు తయారు చేస్తుంది. దీనిని మూసివేసిన తరువాత కార్మికులే దీనిని ఆక్రమించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. అందులోని కార్మికుడే, గ్రీసులోని 'వియో మీ'కి వెళ్ళి వారిని ఉత్సాహ పరిచింది. ఆయన పేరు 'ఎర్నెస్టో లాలో పారెట్'. ఆయన మాటల ప్రకారం "ఈ పునరుద్ధరణ ప్రక్రియకు అనేక అవాంతరాలు ఎదురవుతాయని, అయినా ఈ విధానం ద్వారా ఫ్యాక్టరీలను లాభాలలో నడిపించగలిగామని, అంతకు ముందున్న యజమానులకు చేతకానిది తాము చేసి చూపించామని"తెలిపారు. అసలు మొత్తం సమాజమే కుళ్ళిపోయి ఉంటే ఇక గిట్టుబాటు అనేదానికి అర్థం లేదన్నారు. ఉత్పత్తిలో వచ్చే లాభాల ప్రవాహాన్ని గురించి ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్పవచ్చుకాక, కాని ఒక ఫ్యాక్టరీలో ఉత్పత్తి పునఃప్రారంభమయిందంటే, అది ఆ కార్మికునిలో నమ్మకం, పుంజుకున్నటువంటి అతని ఆత్మగౌరవం మరియు పుంజుకున్నటువంటి అతని వ్యక్తిగత జీవనం ప్రధాన కారణాలని విశ్లేషించాడు. తన సంతానానికి ఆదర్శంగా నిలబడటానికి ఆ కార్మికునికి దీని వలన అయ్యే ఖర్చెంత? తన చుట్టూ ఉన్న సమాజానికి, కుటుంబానికి, కమ్యూనిటీకి ఉపయోగపడే ఈ పునరుద్ధరణ ప్రక్రియ విలువని ఎంత లెక్క కట్టినా సరిపోదని ఆ కార్మికుడు గర్వంగా తెలిపారు.

**(అనువాదం : ఎల్.ఎస్.భారవి)**

స్ఫూర్తి

# చైనా సాంస్కృతిక విప్లవ సేనాని లూషన్



**"క్షీణ సంస్కృతి ప్రతినిధులు, పత్తేదార్లు, పెత్తందార్లు ఎన్ని శాపనార్థాలు పెట్టినా అంతిమంగా నిలిచేది, జయించేదీ శ్రామికవర్గ సంస్కృతి మాత్రమే"**

"నూతన సాంస్కృతిక దళానికి లూషన్ అత్యద్భుతమైన, ధీమంతుడైన పథగామి. చైనా సాంస్కృతిక విప్లవానికి చీఫ్ కమాండర్. యావత్ జాతి ప్రజానీదకం ప్రతినిధి శత్రుదుర్గాన్ని తుపానులా చుట్టుముట్టి నేలకూల్చాడు. సాంస్కృతిక రంగంలో నికార్సయిన, నికరమైన ధీశాలి. జాతియావత్తు కొనియాడదగిన కథా నాయకుడు. చరిత్రలో తనకు సాటిలేని అసమాన కథా నాయకుడు" అంటూ లూషన్ గురించి వివరిస్తాడు ఛైర్మన్ మావో.

లూషన్ జీవితం సమస్తం పోరాటాలమయం. కాలం విసిరిన సవాళ్ళను ఎదురొడ్డి నిలబడ్డాడు. సామ్రాజ్యవాదాన్ని, దాని తైనాతీ పాలకులను కూలదోసేందుకు, దోపిడీ శక్తుల కొమ్ముకాసే పాత సంస్కృతిని కూలదోసి, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని ఎల్లెడలా విస్తరింపచేసేందుకు మడమ తిప్పని పోరాటం చేశాడు.

అర్ధబానిస–అర్ధఫ్యూడల్ పాలనలో వున్న చైనాలో ప్రజలు సాంస్కృతికంగా తీవ్రమైన వెనుకబాటుతనంలో వుండేవారు. వారి ఆలోచనలు గతంలోనే ఖైదయిపోయాయి. వారి చైతన్యం గిడసబారిపోయింది. ప్రజలను నామావశిష్టులుగా మిగిల్చిన ఈ వ్యవస్థ అన్నా, ఈ సంస్కృతి అన్నా లూషన్‌కు పరమ ద్వేషం. అందుకే 'మార్పుకోసం ముందుకు సాగుదాం' అని పిలుపునిస్తూ పాత శక్తులనూ, బూజుపట్టిన ఆలోచలనూ, ఓటి సంస్కృతీ, సాంప్రదాయాలనూ, అలవాట్లనూ ఊడ్చిపారెయ్యాలనీ, అవి ఫిరంగులేగానీ, తాళపత్ర గ్రంథాలేగానీ, ప్రాచీన సాహిత్యమేగానీ, విలువైన విగ్రహాలేగానీ, సాంప్రదాయక వంటకాలేగానీ, ఆహార, ఆహార్య అలవాట్లేగానీ, మానవాళిని గతంలోనే కూరుకుపోయేట్లు చేసే సకలం ధ్వంసం కావాల్సిందే అని కంచుకంఠంతో చెప్పాడు. మానవ చైతన్యాన్ని బంధీచేసిన అన్ని బంధనాలనూ తుత్తునియలు చెయ్యాలని గొప్ప పోరాట స్ఫూర్తితో ప్రకటించాడు. శత్రు ప్రతీపశక్తుల మీద లూషన్ ఈ విధంగా యుద్ధం ప్రకటించినందునే అతను నవచైనా సాంస్కృతిక సేనానిగా నిలవగలిగాడు. తన కలాన్ని బాణంగా సంధించి నేరుగా శత్రువు గుండెలను ఛేదించేందుకు ఏమాత్రం వెరవలేదు. ఇందుకుగాను లూషన్ అనేక బెదిరింపులూ, ఒంటరిపాటు చేసే కుట్రలూ, చౌకబారు ఆరోపణలూ, విచారణలూ ఎదుర్కొన్నాడు. చావుకు కూడా వెరవని ధీరుడిగా నిలిచాడు. 'కళ్ళెర్రచేసి, వెయ్యిన్నొక్క చూపుడు వేళ్ళతో బెదిరించనీగాక – నేను లెక్క చెయ్యను' అనగలిగాడు. శత్రువుకు జడిసి, లొంగి, నంగి నంగిగా బతకడం కన్నా దౌర్భాగ్యం మరొకటి వుండదని స్పష్టం చేశాడు. ఛాందస భావాలనూ, ఛాందస శక్తులనూ తీవ్రంగా వ్యతిరేకించాడు. లూషన్ గొప్ప విప్లవకారుడు. పాత ఛాందసవాద ప్రపంచం అంతిమ ఘడియలు చవిచూసినప్పుడు లవలేశమైనా చింతించలేదు. ఛాందస ప్రపంచాన్ని అత్యంత నిర్ధయగా తిరస్కరించాడు.

'విధ్వంసం, తదనంతరమే నూతన నిర్మాణం' ఇదీ లూషన్ నమ్మిన సూత్రం. కొత్త ప్రపంచం, నూతన సంస్కృతి ఎలా వుంటుందనే దాని మీద నాకు స్పష్టత లేదు, కానీ పాత వ్యవస్థకూ, ఛాందస సంస్కృతికీ వ్యతిరేకంగా జరిపే పోరాటంలోనే నేను వాటిని గురించి నేర్చుకున్నాను' అంటాడు లూషన్. బూర్జువా ప్రతీపశక్తులు వల్లించే 'మానవ స్వభావ సిద్ధాంతం' 'మానవతావాదం' 'నవ మానవతావాదం' లౌకిక పరిణామవాదం' వంటి సిద్ధాంతాలకు వ్యతిరతేకంగా, ట్రాట్స్కీవాదుల తప్పుడు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో భాగంగా మార్క్సిస్టు వర్గ పోరాట సిద్ధాంతం నేర్చుకున్నాడు. ఆ ఆయుధంతోనే సమాజాన్ని పరిశీలించాడు, విశ్లేషించాడు. శత్రువుమీద దాడి చేశాడు. అదే సందర్భంలో ఆ ఆయుధంతోనే తనను తాను పదును తేల్చుకున్నాడు. తన ప్రాపంచిక దృక్పథాన్ని మార్చుకున్నాడు. ప్రయత్నపూర్వకంగా చైతన్యయుతంగా తనను తాను విప్లవకారుడిగా మలుచుకున్నాడు. సాంస్కృతిక రంగంలో పదునైన వర్గ పోరాటం చేశాడు కాబట్టే లూషన్ అతివాద ప్రజాస్వామిక వాదినుండి నికరమైన కమ్యూనిస్టుగా మారగలిగాడు.

'మరీ నిర్ధయగా విరుచుకుపడతాడు' అన్ని విమర్శలకు లూషన్, అంటే శత్రువుపట్ల నేను కరుణ చూపాలా? క్షమించాలా' అని ఎదురు ప్రశ్నించేవాడు. 'శత్రువు తన వర్గ స్వభావాన్ని ఎన్నడూ వదులుకోడు, నీరసించడు, ఊపిరి పీల్చుకోవడానికి మనం సందు ఇచ్చామా అతను

**" వర్గపోరాటంలో ఆదినుండి తుది వరకూ లూషన్ నికరంగా విప్లవశక్తుల పక్షాన నిలబడ్డాడు. ఈ మార్గం ఎంత కంటకప్రాయమైనా, ఎన్ని కష్టాలు మీదపడ్డా, ఎన్ని ప్రమాదాలు పొంచివున్నా, ఎన్ని ఆటంకాలు ఎదురైనా మడమ తిప్పలేదు. "**




**లూ షన్ 20వ వర్ధంతిని చైనా కమ్యూనిస్టు పార్టీ ఘనంగా నిర్వహించింది.**

పుంజుకొని మన మీదకు తిరగబడతాడు. అందుకు అవకాశం మనమెందుకు ఇవ్వాలి' అంటాడు.

'వర్గ పోరాటంలో తటస్థ న్యాయం అంటూ వుండదు. వుంటేగింటే అది గోడమీద పిల్లివాటం, పచ్చి అవకాశవాదం' అని కుండ బద్దలు కొట్టినట్లు చెబుతాడు లూషన్. బీషణమైన సాంస్కృతిక వర్గపోరు నడుస్తూ వుండగా, శాంతికి అవకాశం ఇవ్వండి', 'న్యాయంగా వుండండి', 'ధర్మంగా వుండండి' అంటూ సుద్దులు చెప్పేవాళ్ళు మంచికీ-చెడుకీ తేడా తెలియకపోయిన వాళ్లయి వుంటారు అంటాడు. 'మధ్యేవాదం కూడా మిధ్యే'. చివరికి వాళ్ళంతా రివిజనిస్టుల కోవలోకి చేరిపోతారు' అంటాడు లూషన్

అది సైద్ధాంతిక, సాంస్కృతిక వర్గ పోరాటం ఏదయినా సరే 'విప్లవకారులు రెట్టించిన పట్టుదలతో ఏది మంచో దానికోసం నిలబడాలి. మంచిని నిలబెట్టుకోవాలి. చెడుమీద సమస్త శక్తులూ కూడగట్టుకొని పోరాడాలి' అని చెప్తాడు లూషన్.

వర్గపోరాటంలో ఆదినుండి తుది వరకూ లూషన్ నికరంగా విప్లవశక్తుల పక్షాన నిలబడ్డాడు. ఈ మార్గం ఎంత కంటకప్రాయమైనా, ఎన్ని కష్టాలు మీదపడ్డా, ఎన్ని ప్రమాదాలు పొంచివున్నా, ఎన్ని ఆటంకాలు ఎదురైనా మడమ తిప్పలేదు. విప్లవమార్గాన పయనం సాదాసీదాగా ఆటుపోట్లకు తావులేకుండా వుంటుందని ఎవరూ భ్రమపడకూడదనీ, అలాంటి భ్రమలు వున్నవాళ్ళు కొద్దిపాటి కష్టానికే దిక్కుతోచక గంగవెర్రులెత్తిపోయి ద్రోహం చెయ్యడానికి కూడా వెనుకాడరనీ' లూషన్ వివరిస్తాడు. లక్ష్యం నెరవేరేందుకు గమ్యం చేరుకొనేదాకా తన నిబద్ధతను వదులుకోలేదు. శతృవు చుట్టుముట్టినా, ఎన్ని విచారణలకు గురిచేసినా నైతిక స్థైర్యాన్ని కోల్పోలేదు సరికదా మరింత రాటుతేల్చుకున్నాడు. కష్టాల కారుమబ్బులు కమ్ముకొని, ఒంటరిపాటయినాగానీ తన వైఖరిని ఇసుమంత మార్చుకోలేదు.

అణగారిన సమస్త ప్రజానీకంతోపాటే నేనూను అని దృఢంగా విప్లవ శక్తుల పక్షాన నిలబడ్డాడు. సత్యం మన పక్షాన వుంది, కార్మిదకులు, కర్షకులు, కష్టజీవులు, ఏనాటికైనా చారిత్రక విజయాన్ని సాధిస్తారు అని ప్రబల విశ్వాసాన్ని ప్రకటించాడు. ప్రతీపశక్తుల దాడులు వామపక్ష విప్లవ కారులను మరింత రాటుదేలుస్తాయన్న చారిత్రక గతితర్కాన్ని మనముందు ఆవిష్కరించాడు.

ప్రజల పట్ల అపారమైన ప్రేమను ప్రదర్శించేవాడు లూషన్. 'నా ప్రజల భవిష్యత్తుకదోసం ఎద్దులా ఎంతవరకైనా నా మెడమీద మోయడానికి నేను సిద్ధం' అని ప్రకటించాడు. అందుకే నవ చైనాలో నూతన శక్తుల ఆవిర్భవాన్ని, నూతన సంస్కృతి చిగురింతను వేనోళ్ళ ఆహ్వానించాడు. అక్కున చేర్చుకున్నాడు. ఎప్పటికప్పుడు నవతరాన్ని అన్వేషించి, ఆహ్వానించి వారిని నూతన సాంస్కృతిక విప్లవంలో భాగం చేసేవాడు. కార్మికవర్గం, చైతన్యవంతమైన ప్రజానీకం ముఖ్యంగా యువతరం భావి చైనా ఆశాదీపాలు అని నొక్కి చెప్పేవాడు. నూతన శక్తుల, నూతన సంస్కృతుల ఆవిర్భావాన్ని పసిగట్టిన దార్శనికుడు లూషన్. రాజకీయ కబోదులు మాత్రమే నూతన శక్తుల ఆవిర్భావం పట్ల గుడ్డి తనం ప్రదర్శిస్తారు అంటాడు. 'క్షీణ సంస్కృతి ప్రతినిధులు, పత్తేదార్లు, పెత్తందార్లు ఎన్ని శాపనార్థాలు పెట్టినా అంతిమంగా నిలిచేది, జయించేదీ శ్రామికవర్గ సంస్కృతి మాత్రమే' అన్న గొప్ప విశ్వాసాన్ని తన తరం ప్రజా సాంస్కృతిక సైనికులకు అందించాడు లూషన్. భావితరాలకు ఆదర్శంగా నిలిచాడు.

**(పెకింగ్ రివ్యూ వాల్యూం 9 - 45**
**1966 నవంబర్ 4 సంచికనుండి**
**అనువాదం- సత్యరంజన్)**

**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# పార్లమెంట్‌లో వామక్షాలబలం తగ్గిన పరిస్థితుల్లో పార్లమెంట్ బయట పోరాటాలకు ప్రాధాన్యత పెరిగింది

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**కామ్రేడ్ రాఘవులుగారికి, 1998 తరువాత బిజెపి-ఎన్డీఏ సంకీర్ణం అధికారంలో వున్నప్పుడు బిజెపి-కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా వుద్యమాలు నిర్మించాము. 2004 ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వామపక్షాలు బలపరిచాయి. కనీస వుమ్మడి కార్యక్రమంలోని అనేక అంశాలను కాంగ్రెస్ విస్మరించింది. అమెరికాతో అణు ఒప్పందం పై సంతకాలు చేసింది. మనం మద్దతు వుపసంహరించాము. కనీస వుమ్మడి కార్యక్రమం, రైతు రుణాల రద్దు పథకాల వల్ల 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ లబ్ది పొందింది. 86 సంవత్సరాల చదువులేని సిపిఎం సభ్యుడు, ముఠా కార్మికుడు ఈ ఎన్నికలపై వ్యాఖ్యానిస్తూ "సిపిఎంకు మనం ఓట్లు వేసి గెలిపిస్తే వీరు కాంగ్రెస్‌ను బలపరుస్తున్నారు. అసలు కాంగ్రెస్‌కే ఓట్లు వేస్తే పోలేదా అని ప్రజలు అనుకొన్నారు" అని సాధారణంగా చెప్పాడు. 1964 నుండి సిపిఐ కాంగ్రెస్‌ను బలపరచడం ద్వారా విలువలు కోల్పోయి పతనం అయింది. సిపిఎం కాంగ్రెస్ వ్యతిరేక పోరాటాల ద్వారా బలపడింది. 2004లో కాంగ్రెస్ సంకీర్ణాన్ని బలపరచడం ద్వారా సిపిఎం ఘోరంగా ఓడిపోయింది. ప్రజలు మనలను గెలిపిస్తే కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తామని బిజెపీ వారూ, మన వ్యతిరేకులూ ప్రచారం చేశారు. 2004లో కాంగ్రెస్‌ను బలపరిచిన మన నిర్ణయం వలన అనేక మంది మధ్య తరగతి వారూ, మేధావులూ పార్టీకి దూరమైనారు. పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో ఈ చిన్న విషయాన్ని గ్రహించలేకపోయిందా? ఇకనైనా పార్టీ బిజెపీ, కాంగ్రెస్‌ల ఎల్‌పిజీ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించి గతంలో సిపిఎం అనుసరించిన పోరాట విధానాలకు మళ్లుతుందా?**

**కొండా రామిరెడ్డి**, 16-8-494,
6వ లైను, బాలాజీ నగర్,
పాతగుంటూరు.

2004 ఎన్నికల తర్వాత బిజెపి అధికారానికి రాకుండా నివారించేందుకు కాంగ్రెస్‌ను బలపర్చాం. ఒక వేళ ఎవరూ ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో మళ్ళీ ఎన్నికలు వస్తే మతతత్వ శక్తులకు ఎక్కువ లబ్ది చేకూరుతుందన్న అంచనాతో కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదికగా యుపిఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతిచ్చాయి. ఈ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినందున లాభం ఎక్కువ జరిగిందా, నష్టం ఎక్కువ జరిగిందా అన్న మీమాంశ అనాడు - ఈనాడు కూడా జరుగుతూనే ఉన్నది. మనం అనుసరించిన ఎత్తుగడల వల్ల ప్రజలకు నష్టం కన్నా లాభం ఎక్కువ జరిగిందని పార్టీ భావించింది. వామపక్షాల బలంపై ప్రభుత్వ మనుగడ ఆధార పడి ఉన్న సందర్భాన్ని ఆసరా జేసుకుని ప్రజలకు ఉపయోగపడే కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకొనేట్టుగా చేయగలిగాం. ఉపాధి హామీ చట్టాన్ని చేయించగలిగాం. పాలక వర్గాలు తీవ్రమైన అభ్యంతరాలు వెల్లడిస్తున్నా వామపక్షాల పట్టుదల మూలంగానే ఈ చట్టం వచ్చింది. దీని వలన ఇప్పుడు దేశంలో కోట్లాది గ్రామీణ వ్యవసాయదారులు కొంత ఉపాధి పొందగలుగుతున్నారు. ఈ పథకం పేదలకు ఎంత వుపయోగపడుతున్నదంటే, పాలక వర్గాలు పథకాన్ని తొలగించటానికి సాహసించలేక పోతున్నాయి. అలాగే అటవీ హక్కుల చట్టాన్ని సాధించటంలోనూ వామ పక్షాల కృషి ప్రధానం. గిరిజనులు తమ భూములపై హక్కులు పొందేందుకు ఈ చట్టం కొంతమేరకైనా తోడ్పడింది. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించకుండా, వాటాలను తెగనమ్మకుండా వామపక్షాలు అడ్డుకోగల్గాయి. అయితే ఈ మంచి కృషివలన వామ పక్షాలు రాజకీయంగా, ప్రజా బలం పరంగా లబ్ది పొందాయని చెప్పలేం. వామపక్షాల మద్దతు వల్లనే ఈ ప్రయోజనకరమైన ఫలితాలు వచ్చాయని చెప్పుకునేందుకు అవసరమైన కనీస నిర్మాణంకూడా దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో లేకపోవడం ఒక ముఖ్య కారణం. అలాగే యుపిఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్న పరిస్థితులు, వామపక్షాల సూత్రబద్ధ వైఖరులను ప్రజలు అవగాహన చేసుకునేందుకు అవకాశం కలగలేదు. అమెరికాతో భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచనలో భాగంగా అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ఒడంబడికను చేసుకున్నప్పుడు వామపక్షాలు యూపిఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నాయి. ప్రజా జీవితంతో ముడిపడి ఉన్న సమస్య కాకపోవడం, తక్షణం ప్రజలకు హాని చేసే అంశం కొట్టొచ్చినట్టు కనపడకపోవడం, పైపెచ్చు విద్యుత్ అవసరాలను తీర్చడం కోసమే అణువొడంబడికను చేసుకుంటున్నట్టుగా మీడియా, పాలక వర్గాలూ ప్రచారం చేయడం, అప్పటి వరకు వామపక్షాలకు మద్దతు ఇచ్చిన కొన్ని ప్రాంతీయ పార్టీలు అవకాశవాదంతో వెనక్కి తగ్గడం, వీటన్నిటి వల్ల వామపక్షాల మద్దతు ఉపసంహరణ ప్రాముఖ్యతను వామ పక్షాలు ప్రజల్లోకి తీసుకెళ్ళిన మేరకైనా ప్రజలకు అర్థమయ్యేట్టు చేయగల్గామని చెప్పలేం.

అలాగే కాంగ్రెస్ పార్టీ, ఇచ్చినమాట తప్పే స్వభావాన్ని తక్కువ అంచనా వేశాం. దాని మాటమీద భరోసాతో సరైన సమయంలో ఖచ్చితంగా వ్యవహరించలేక పోయాం. దీని వలన ప్రజలకు తక్షణ నష్టం జరగకపోయినా వామ పక్షాలకు ఇబ్బందులు వచ్చాయి. 2009 ఎన్నికలలో పార్టీ రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నాం.

జాతీయోద్యమ కాలంనుండి బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహించే పార్టీగా కాంగ్రెస్ ఉన్నది. బ్రిటీష్‌కి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌తో కలిసి పోరాడింది. స్వతంత్రంగానూ వ్యవహరించింది. స్వాతంత్ర్యానంతరం కూడా


**'మార్క్సిస్టు'కు**
**మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

అలీన విధానం, భూసంస్కరణ చట్టాలు, రాజభరణాలు రద్దు, బ్యాంకుల జాతీయీకరణ వంటి అంశాలలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను సమర్థించింది. రాష్ట్రపతి ఎన్నికలలో బిజేపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థులను కొన్ని సందర్భాలలో సమర్థించింది. అయితే స్వాతంత్ర్యానంతరం దేశ పాలక వర్గాల ముఖ్య ప్రతినిధిగానున్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే పార్టీ యొక్క ప్రధానమైన పోరాటం ఉన్నది. అటు ప్రజల్లోనూ, ఇటు పార్టీ శ్రేణుల్లోకూడా కాంగ్రెస్ వ్యతిరేక శక్తిగా పార్టీని గుర్తించడం జరుగుతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వడాన్ని అందరూ హర్షించలేక పోవడం సహజంగానే జరిగింది. అయితే 1980 దశకంలో మతతత్వ శక్తులు పుంజుకోవడం, భారత పాలకవర్గాలు తమ ప్రతినిధిగా క్రమేణా మతతత్వ బిజేపిని ముందుకు తీసుకురావడం జరిగిన నేపథ్యంలో లౌకిక తత్వాన్ని కాపాడుకోవడం ఒక ముఖ్యమైన అంశంగా ముందుకు వచ్చింది. అందువలనే కొన్ని కీలక సందర్భాలలో బిజేపిని అధికారానికి రానీయకుండా చేయాల్సిన పరిస్థితుల్లో 2004లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమర్థించడం జరిగింది.

ఇప్పుడు మతతత్వ శక్తులు బిజేపి ఆధ్వర్యంలో సంపూర్ణమైన మెజార్టీని సాధించి అధికారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూపిఏ రెండో ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించింది. ఇటువంటి స్థితిలో కాంగ్రెస్, బిజేపిల విధానాలకు వ్యతిరేకంగా సంస్కరణల పేరుతో ప్రజలమీద మోపే భారాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలను చేయాల్సి ఉంది. పార్లమెంట్‌లో వామపక్ష బలం తగ్గిన పరిస్థితుల్లో పార్లమెంట్ బయట పోరాటాలకు ప్రాధాన్యత పెరిగింది. రాబోయే పార్టీ మహాసభల్లో అటువంటి కార్యాచరణకు రూపకల్పన జరుగుతుంది.

**కామ్రేడ్, గత కొన్ని ఎన్నికలను పరిశీలిస్తే వామపక్షాల బలం క్రమంగా తగ్గిపోతున్నది. ఈ విషయం పార్టీ నాయకులు కూడా చెబుతున్నారు. పరిస్థితుల్లో వస్తున్న మార్పులను పార్టీ నాయకత్వం సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం దీనికి కారణమని చెబుతున్నారు. అసలు సరళీకరణ విధానాల వల్ల ప్రజల్లో ఒక సెక్షన్ బాగా లాభపడింది. ఆ సెక్షన్ పార్టీని వీడిపోవడమే కారణమని అంటున్నారు. వాస్తవానికి మనం చెబుతున్నట్లు సరళీకరణ విధానాల వల్ల ప్రజలు బాగా నష్టపోతుంటే వారు ఉద్యమాల్లోకి పెద్ద ఎత్తున రావాలి కదా? మరి ఈ కాలంలో ఉద్యమాలు తక్కువగా జరగడానికి పార్టీ నాయకత్వ లోపం కారణమా? పరిస్థితులు కారణమా?**

**ఎస్. వి. సుందరరావు**
బృందావన్ కాలనీ,
డా॥ ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్.

**రాఘవులుగారికి, ఇటీవల విజయవాడలో మీరు చేసిన ప్రసంగాన్ని ఆసాంతం ఆలకించాను. చాలా కాలంగా నాలో కొన్ని సందేహాలున్నాయి. 'మార్క్సిస్టు' ద్వారా జవాబిస్తారని ఆశిస్తున్నాను.**

**1. ఎన్నికల సమయంలో "పొత్తు" లేకుండా స్వతంత్రంగా ఎందుకు పోటీ చేయడం లేదు?**

**2. అన్ని స్థానాలలోనూ గెలుపు ఓటముల కతీతంగా పోటీ చేస్తే ఓట్లు చీల్చవచ్చా. అసలు ఎంతమంది పార్టీ వెనుక ఉన్నారో తెలుస్తుంది కదా! ఆ దిశగా నిర్ణయం ఎందుకు తీసుకోవడం లేదు?**

**3. స్త్రీ అభ్యర్థులకు సరైన ప్రాధాన్యత ఇస్తున్నారా?**

**శమంతకమణి**, విజయవాడ.

**కామ్రేడ్, 2014 సార్వత్రిక ఎన్నికల్లో వామపక్షాలు ఘోరంగా వైఫల్యం చెందాయి ఎందువలన? ట్రేడ్‌యూనియన్ రంగంలో కొంతబలంగా ఉన్నా ఎన్నికల రంగంలో ప్రజల విశ్వాసం పొందలేకపోవడానికి కారణం ఏమిటి?**

**తుంపాల శ్రీరామమూర్తి,**
9-9-57/2, జోగవానిపాలెం,
కొత్తగాజువాక, విశాఖపట్నం.

దేశ వ్యాపితంగా చూసినప్పుడు కేరళ, బెంగాల్, త్రిపుర రాష్ట్రాలు మినహా మిగిలిన ప్రాంతాలలో వామపక్షాల ప్రజాబలం మొదటి నుంచి చాలా పరిమితంగానే ఉంది. ఈ మధ్య కాలంలో కొంత బలహీన పడింది కూడా. అయితే ఇప్పుడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్షాలకు కంచుకోటగా ఉన్న బెంగాల్‌లో కూడా ఓటింగ్ శాతం తగ్గింది. త్రిపురలో, కేరళలో బలం పెరిగినప్పటికీ బెంగాల్‌లో పునాది తగ్గడం ఆందోళన కల్గించే విషయం. అందువలన ప్రజాబలం తగ్గడానికి ఈ ఎన్నికలలో తాత్కాలికంగా వచ్చిన ఒడిదుడుకులు కారణమా ఇంకేమైనా మౌలికమైన కారణాలున్నాయా అన్న విషయాన్ని పరిశీలించాలని పార్టీ కేంద్రకమిటీ నిర్ణయించింది.

అనేక రాష్ట్రాల్లో బూర్జువా పార్టీలతో ఎన్నికలలో పొత్తుపెట్టుకోవడం ఉద్యమానికి లాభం జరుగుతుందా, నష్టం జరుగుతుందా అన్న విషయాన్ని సమీక్షించాలనుకుంది. ప్రాంతీయ పార్టీలతో సర్దుబాట్లు చేసుకోవడం ద్వారా బూర్జువా వర్గంలో ఉన్న చీలికలను వినియోగించుకొని అలాగే వాటి వెనక ఉన్న ప్రజలతో సంబంధాలను పెట్టుకొని వామపక్షాలు బలపడవచ్చని భావిస్తూ వచ్చాం. కానీ అనుభవంలో అటువంటి ప్రయోజనం జరగలేదు. బూర్జువా పార్టీలతో పొత్తులను అమలుజేయడంలో లోపాల మూలంగా మనకు ప్రయోజనం కలగడంలేదా? లేదా బూర్జువా పార్టీలతో పొత్తు పెట్టుకోవడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదా అనేది మనం పరిశీలించుకోవాల్సిన ముఖ్యమైన విషయం. పొత్తుపెట్టుకోవడం, స్వతంత్రంగా పోటీచేయడం అన్నది సమస్యకాదు. ఏ వర్గాలతో, ఏ విధానాల ప్రాతిపదికన కార్మిక వర్గ పార్టీ కలిసి పనిచేయవచ్చు అన్నది ప్రధానమైన సమస్య. ఈ సమస్య గురించే పార్టీ పరిశీలించబోతున్నది.

1990 తర్వాత సరళీకరణ విధానాలవలన వివిధ తరగతుల, ప్రజల ఆర్థిక, పని పరిస్థితులలో చాలా మార్పులొచ్చాయి. కార్మికులలో శాశ్వత ఉద్యోగులు తగ్గి కాంట్రాక్టు, తాత్కాలిక అసంఘటిత కార్మికవర్గం పెరిగింది. రైతులలో వైవిధ్యం పెరిగింది. సేవారంగం పెరుగుదల వల్ల మధ్యతరగతి ఏర్పడింది. ఈ మార్పులు ఉద్యమాలకు అనేక ఆటంకాలనూ, అవకాశాలనూ కల్పించాయి. పార్టీ, ప్రజా ఉద్యమాలను ఈ మార్పులకనుగుణంగా మల్చుకోగల్గామా, ఇంకా వెనకబడి ఉన్నామా అనేది అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నది.

అస్థిత్వ వాదాల పేరుతో కులం, మతం, ప్రాంతం, భాష, తెగ మొదలగు అస్థిత్వ అంశాల మీద ఆధారపడి ప్రజలను విభజనజేసే భావాలు వ్యాపించాయి, ఉద్యమాలు వచ్చాయి. ఇటువంటి భావాలు తీవ్రమై సంకుచితత్వ స్థాయికి చేరినప్పుడు ప్రజలమధ్య తగాదాలు, విభజనలు, అనైక్యతలు ఏర్పడుతున్నాయి. ఇవి విశాల ప్రజా ఉద్యమాలకు, వర్గ ఉద్యమాలకు ఆటంకంగా మారుతున్నాయి. మతం ప్రాతిపదికగా సంఘ పరివార శక్తులు రెచ్చగొడుతున్న మతోన్మాదం అత్యంత అభివృద్ధినిరోధకమైంది, ప్రమాదకరమైంది. అయితే దళితులు, గిరిజనులు మహిళలు మొదలగు బలహీన వర్గాల హక్కుల పేరుతో వచ్చే అస్థిత్వ ఉద్యమాలలో మనం అంగీకరించాల్సిన, ఆహ్వానించాల్సిన, సమర్థించాల్సిన అంశం ఉంటుంది. విశాల ఐక్యతకు ఆటంకంగా ఉండే ఒంటరి వాదాన్ని తిరస్కరిస్తూనే వామపక్షాలు వారి ప్రజాస్వామిక ఆకాంక్షలను బలపర్చాల్సి ఉంటుంది. గత రెండు దశాబ్దాలలో ముందుకొచ్చిన ఈ అస్థిత్వ భావాలు, వాదాలు, ఉద్యమాల స్వభావం గురించీ, వాటి పట్ల వామపక్షాలు వ్యవహరించాల్సిన వైఖరి గురించీ సమీక్షించాలని పార్టీ నిర్ణయించింది. దానిలో బాగంగానే పార్టీలో సామాజిక పొందికలో తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా చర్చించటం జరుగుతుంది.

ఈ సమీక్షల తర్వాత విధానాల లోపమా, నాయకత్వ లోపమా అన్నది తేలుతుంది. రానున్న పార్టీ మహాసభ అందుకు అనుగుణంగా అవసరమైన మార్పులను, చేర్పులను, నిర్ణయాలను చేస్తుంది.

# అల్లూరి

(2వ పేజీతరువాయి)

టియర్ గ్యాస్ బాంబులను కూడా ప్రయోగించారు. అనేకమందితోపాటు అల్లూరీ, వీరవల్లి సత్య నారాయణ కూడా గాయపడ్డారు. టియర్ గ్యాస్ మంటల వల్ల అప్పటికప్పుడు విద్యార్థులు కకావికలైనా మళ్లీ అక్కడికి చేరుకొని బహిరంగ సభను విజయవంతం చేశారు. మహాసభలో సత్యపాల్ డాంగ్ ఉత్తేజభరిత ఉపన్యాసంతో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. 1947లో అల్లూరి భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో ఇంటర్‌లో చేరి ఆ మరు సటి ఏడాదే పూర్తి చేశారు. ఆ సమయంలో ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీపై తీవ్ర నిర్బంధం కొనసాగుతోంది. జిల్లా నాయకుడు ప్రేరేప మృత్యుంజయుడు అల్లూరిని తన రహస్య కేంద్రానికి పిలిపించుకున్నారు. తాను చదువుకుంటూ ఉద్యమ సంబంధాలు ఏర్పాటు చేసుకున్న నరసాపురం ప్రాంతంలోనే పార్టీ బాధ్యునిగా పనిచేయవలసిందిగా కోరారు. శిరసావహించారు అల్లూరి.

పార్టీపై నిర్బంధం ఉండటంతో రహస్యంగా పనిచేయాల్సి వచ్చింది. కొన్నాళ్లకు ఒరిస్సా రాష్ట్రంలోని పూరీ పట్టణంలో రాష్ట్ర నాయకత్వం ఏర్పాటు చేసిన రహస్య కేంద్రానికి రావలసిందిగా అల్లూరికి పిలుపొచ్చింది. పూరీలో ప్రసిద్ధి చెందిన జగన్నాథుని ఆలయం ఉంది. సతి మన్మోహిని, ఆర్ఎస్‌లతో కలిసి భక్తుల మాదిరిగా పూరీ చేరుకొని రహస్య కేంద్రంలో హాజరయ్యారు. ఓ రోజు.. ఆ కేంద్రంపై పోలీసులు దాడి చేయనున్నారనే సమాచారం రావడంతో అక్కడి వారంతా తప్పుకోవలసి వచ్చింది. ఆ కాలంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దాదాపు 20 మందికిపైగా కమ్యూనిస్టు నేతలను కాంగ్రెస్ పొట్టనపెట్టుకుంది. పట్టుబడితే అల్లూరిని కూడా కాల్చి చంపేసేవారే. నిర్బంధం ఎత్తివేశాక పార్టీ నరసాపురం తాలూకా కార్యదర్శిగా అల్లూరి నియమితులయ్యారు. 1964లో పార్టీలో చీలిక వచ్చినప్పుడు జిల్లాలో క్యాడర్‌ను నిలబెట్టేందుకూ, పునర్నిర్మాణానికీ ఆర్ఎస్ వంటివారితో కలిసి విశేష కృషి చేశారు. రాష్ట్రంలో మార్క్సిస్టు పార్టీ నాయకత్వంపై పాలకవర్గం ఎక్కడికక్కడ కేసులు పెట్టి అరెస్టులు చేయించింది. ఆ సందర్భంగా అల్లూరీ, ఆర్ఎస్‌లను విశాఖ సెంట్రల్ జైల్లో పెట్టారు. 1968లో పాలకొల్లులో జరిగిన పార్టీ ప్లీనంలో కొందరు అతివాద దుందుడుకు పోకడలు అనుసరించారు. సాక్ష్యాత్తూ ఆనాటి జిల్లా కార్యదర్శి విచ్ఛిన్నానికి వ్యతిరేకంగా పార్టీలో అంతరంగిక పోరాటం నిర్వహించారు. జిల్లాలోని కార్యకర్తలను రాజకీయంగా, సైద్ధాంతికంగా నిలబెట్టడంలో అలుపెరగని కృషి చేశారు. విచ్ఛిన్నకుడైన జిల్లా కార్యదర్శి స్థానంలో అల్లూరిని పార్టీ నియమించింది.

అక్కణ్ణుంచి ఆయన ప్రజా ఉద్యమాలను ఉద్ధృతం చేయడం ద్వారా జిల్లాలో పార్టీని విస్తృత పరిచేందుకు కంకణబద్ధులయ్యారు. ఆర్ఎస్, తదితర నేతలతో కలిసి వ్యవసాయ కార్మికోద్యమాన్ని బలోపేతం చేశారు. చించినాడ, కలగంపూడి ప్రాంతాల్లో ఆర్ఎస్ నేతృత్వంలో వ్యవసాయ కార్మికుల లంక పోరాటాలు జరిగాయి. ఆ సందర్భంగా భూస్వాములు చించినాడకు చెందిన ముగ్గురు కార్యకర్తలనూ, కలగంపూడికి చెందిన ఒకరినీ దారుణంగా హత్య చేశారు. ఆ ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న ఆర్ఎస్‌పై 36 కేసులు పెట్టారు. జిల్లా కార్యదర్శిగా ఉన్న అల్లూరినీ ఆ కేసుల్లో ఇరికించారు. ఆయననూ, ఆర్ఎస్‌నూ రిమాండ్ ఖైదీలుగా రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించారు. చించినాడ, కలగంపూడి ఉద్యమాలపై భూస్వాముల, ప్రభుత్వ నిర్బంధకాండకు వ్యతిరేకంగా అల్లూరి జిల్లావ్యాప్తంగా అన్ని సంఘాల నుంచీ, ప్రజల నుంచీ విశేష సంఘీభావాన్ని కూడగట్టారు. ఉద్యమ రక్షణ నిధికి ప్రజల నుంచి విరాళాలు వసూలు చేసి కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడమేగాక ఉద్యమాన్ని నిలబెట్టారు. ఆయన రైస్ మిల్లు, జూట్ మిల్లు కార్మికుల సమస్యలపైన కూడా సమరశీల పోరాటాలకు నేతృత్వం వహించారు. ఐక్యకార్యాచరణ కమిటీ వేసి ఐదు వేల మంది జూట్ కార్మికులతో సమ్మె చేయించారు. 1980 తరువాత ప్రణాళికాబద్ధంగా విద్యార్థి, యువజన కేడర్‌పై కేంద్రీకరించి కొత్త నాయకత్వాన్ని జిల్లాకు అందించారు. హమాలీ, రైస్‌మిల్లు కార్మికుల ఉద్యమాన్ని జిల్లాతో ప్రారంభించి దానికి రాష్ట్ర రూపం తీసుకురావడంలో ఎంతో కృషి చేశారు. ఆయన హైదరాబాద్ నుంచి బాధ్యతలు నిర్వహించే కాలంలో శ్రీకాకుళం, విశాఖ, కృష్ణా జిల్లాల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలను గైడ్ చేశారు. విశాఖలో గైడెన్స్ ఇచ్చే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా జూట్ కార్మికుల సమన్వయాన్ని సాధించడంలో కృషి చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో పార్టీ గైడెన్స్ కూడా చూశారు.

ఆయన శైలి సుందరయ్యలా నిరాడంబరంగా ఉంటుంది. కార్యకర్తల పట్ల అమితమైన ప్రేమ, అభిమానం చూపేవారు. ఆయనలో ఓపిక, సహనం ఎక్కువ. ఏ రంగంలో పని చేస్తున్నా సంబంధిత కార్యకర్తలను పిలిచి పని వివరాలు తెలుసుకునేవారు. కార్యకర్తల పట్ల ఆయన పితృవాత్సల్యం కనబరిచేవారు. ఆయన వచ్చినా, పలుకరించినా కార్యకర్తలకు సంతోషంగా ఉండేది. తన అనుభవాలను ఎంతో ఆసక్తికరంగా చెప్పేవారు. ఆయన ఎంత సౌమ్యుడైనా రాజకీయ విషయాలను చర్చించేటప్పుడు కఠినంగానూ, దృఢంగానూ వ్యవహరించేవారు. ఆయన తన జీవితంలో ఎక్కడా అహంభావాన్నీ, అహంకారాన్నీ ప్రదర్శించలేదు. కార్యకర్తలను కోపగించుకోవడం, కసురుకోవడమూ జరగలేదు. కోపాన్ని ప్రదర్శించాల్సి వస్తే వర్గ శత్రువులపైనా, అన్యాయాలు, అక్రమాలపైనా చూపేవారు. అల్లూరు తన నిత్య కార్యాచరణలో ప్రజాతంత్ర పని పద్ధతిని తూచా తప్పకుండా ఆమలు చేశారు. కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతులతో సమస్యలు చర్చించేటప్పుడు ఓపికగా గంటల తరబడి వినేవారు. చివరిలో పరిష్కారాన్ని సూటిగా, సరళమైన భాషలో చక్కగా వివరించేవారు. పార్టీ కమిటీల్లో తన ప్రతిపాదనల సమయంలోగానీ, వ్యక్తిగతంగా నాయకులకూ, కార్యకర్తలకూ సూచనలు చెప్పే సందర్భంలోకానీ భిన్నాభిప్రాయాలు వస్తే చాలా ఓర్పు వహించి చర్చించేవారు. అత్యధికుల అభిప్రాయాలనూ, నిర్ణయాలనూ గౌరవించేవారు. భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినవారిపట్లా ఆత్మీయంగా వ్యవహరించేవారు. ఆయనో మంచి ప్రజాస్వామికవాది. పార్టీ పూర్తికాలం కార్యకర్తలకు ఆదర్శ వివాహాలూ చేశారు. పార్టీలో ఆయన ప్రత్యేక సౌకర్యాలను ఏనాడూ కోరుకోలేదు. పార్టీ అప్పగించిన ప్రతి పనినీ క్రమశిక్షణతో అమలు చేశారు. పార్టీ విధానాలు, నైతిక విలువలు కచ్చితంగా పాటించారు.

ఆయన ప్రజా ఉద్యమాల్లో, పార్టీ నిర్మాణ కార్యకలాపాలలో ఎంత తలమునకలైనా అధ్యయన కృషి నిరంతరంగా సాగేది. అధ్యయనం సిద్ధాంతం, రాజకీయాలకే పరిమితం కాకుండా అంతకన్నా ఎక్కువగా ప్రజా సమస్యల అధ్యయనం కోసం క్షేత్రస్థాయి వాస్తవాల పట్ల చాలా ఆసక్తి చూపేవారు. పార్టీ, ప్రజా ఉద్యమాల పనిపై ఎక్కడికి వెళ్లినా 'ప్రజల నుండి తెలుసుకోవడం.. ప్రజలకు చెప్పడం' ఆయన నిరంతర పనిలో భాగంగా ఉండేది.

పార్టీలో విద్యార్థి శాఖ కమిటీ కార్యదర్శిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడి వరకూ కొనసాగింది. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా, సమర్‌ముఖర్జీ నేతృత్వంలో ఏర్పడిన ఆలిండియా కంట్రోల్ కమిషన్ సభ్యుడుగా బాధ్యతలు నిర్వహించారు. చైనా పార్టీ ఆహ్వానం మేరకు చైనాలో పర్యటించారు. ప్రమాదరీత్యా కాలు స్వాధీనం తప్పినా, వృద్ధాప్యం వల్ల మంచానికి పరిమితమైనా ఆయన మనస్సులో నిరంతరం పార్టీ ప్రయోజనం, పార్టీ శ్రేయస్సే మెదులుతూండేది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన స్ఫూర్తి పార్టీ శ్రేణులకు ఆదర్శప్రాయంగా ఉంటుంది. ●



# ప్రజాస్వామికంగా ఉత్పత్తి చేసి, సమిష్టిగా అనుభవించేదే నాణ్యమైన జీవనం

**– జెడి టేలర్**

మన మెదళ్లు, మన వెన్నెముకలు ఉద్వేగంతో ఉన్నాయి. అలసిపోయాయి. మన మనస్సులు ఛిన్నాభిన్నం అయిపోయాయి. మన నరాలు బిగుసుకున్నాయి.... కారణం? మేనేజర్లనుండి వస్తున్న అసాధ్యమైన డిమాండ్లు: ఉత్పత్తిని పెంచండి. మరింతగా ఉత్పత్తిని పెంచండి. ఉత్పత్తి అవుతున్నదాని అవసరం ఒకవైపు తగ్గిపోతుంటే, దాని నాణ్యత గతంలో కంటే దిగజారిపోతుంటే ప్రతి చోటా ఇదే డిమాండ్ వినిపిస్తోంది: మరింత పనిచేయండి, ఇంకా వేగంగా చేయండి, ఇంకా బాగా చేయండి! మనంతట మనం ఏమీ చేయకూడదు, ఆలోచించకూడదు, స్పందించకూడదు, లేదా ఏది మంచిదో తెలుసుకోకూడదు. సమస్యేమిటంటే మనకు మంచిదేమిటో ఏనాడూ మనముందుంచరు, మనకు తెలపరు. మంచికి అవకాశం ఉందనేది అనూహ్యంగా ఉంటుంది. మంచి అంటే నా ఉద్దేశ్యంలో భవిష్యత్తు. ఒక వ్యక్తి భవిష్యత్తు కాదు. మనుగడకోసం, విజయం సాధించడం కోసం కష్టాలకు ఎదురీదే వ్యక్తి గురించి కాదు నేను చెప్పేది. మంచి అంటే నా ఉద్దేశంలో మనందరం ప్రజాస్వామికంగా ఉత్పత్తి చేసి, సమిష్టిగా అనుభవించే నాణ్యమైన జీవనం. అక్కడ సామాజిక అవసరాలు ఆర్థిక కార్యకలాపాలను నిర్ణయిస్తాయి. ప్రజాసేవా విలువలు రాజకీయ ప్రవర్తనను నిర్ణయిస్తాయి.....

.....

ఈ రోజున మనం ఖర్చుచేయబడ్డాం, ముక్కలు చేయబడ్డాం. కొద్ది దశాబ్దాల పాటు తక్కువ వేతనాలకు పనిచేయడానికి మాత్రమే పనికొస్తాం. తరువాత మార్కెట్ల చేత అనుత్పాదక పిప్పికింద పక్కకు విసిరేయబడతాం. మన మానసికాందోళనలనూ, మన మానసిక కుంగుబాట్లనూ రాజకీయంగా మార్చుకుని మన సమాజాలకు ఏది కావాలో ఏది వద్దో నిర్ణయించుకోడానికి పోరాడకపోతే పరిస్థితి మరింత క్షీణిస్తుంది. మనం పనిచేస్తున్న – నివసిస్తున్న – తీరు మనల్నీ, మన సంబంధాలనూ నాశనం చేస్తోందని తెలుసుకుంటున్నప్పటికీ మనపై పడిన ఒత్తిడి మనల్ని అచేతనం గావిస్తోంది, కదలనీకుండా చేస్తోంది. నయా–ఉదారవాద రాజకీయ, ఆర్థిక కార్యకలాపాల ప్రపంచీకరణ ఇప్పుడు అభద్రత, దుర్భరత్వం విషయంలో ప్రజలందరి మధ్య, ముఖ్యంగా యువకుల మధ్య సమానత్వం సృష్టిస్తోంది. యువకులకు ఈనాడు ఫించన్ పొందే అవకాశం లేదు. ముసలయ్యాక ఆర్థికంగా ఆదరణ పొందే అవకాశమూ లేదు. 0.01% సూపర్ ధనవంతుల విశ్వసనీయత, న్యాయబద్ధత ప్రశ్నించే గొంతులు బలహీనంగా ఉన్న ఈ మధ్యంతర దశలో మన భవిష్యత్తేమిటి? మనం కలలు కనే భవిష్యత్తును నిజం చేసుకోవాలి. దాన్ని వదిలిపెట్టకూడదు. మన భవిష్యత్తును ఆర్థిక స్వప్రయోజనాలు కలిగిఉన్న మోసకారి, అప్రజాస్వామిక కులీనులకు వదిలి పెట్టకూడదు. సమాజాలు తమ సమిష్టి కోర్కెను బలంగా వ్యక్తం చేయాలి, లేకుంటే వాటికి మనుగడ లేకుండా పోతుంది.

**(రచయిత దక్షిణ లండన్ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త. "ప్రతికూల పెట్టుబడిదారీ విధానాం: నయా–ఉదారవాద యుగంలో దురాలోచన" (2013) పుస్తకం రాశారు. రాజకీయ, సాంస్కృతిక, తత్వశాస్త్ర అంశాలపై అనేక వ్యాసాలు రాశారు. ఆయన రాసిన "ఖర్చయిపోయారా? పెట్టుబడిదారీ వ్యవస్థలో పెరుగుతున్న మానసికాందోళన సమస్య" అనే వ్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.4. Published on August 1, 2014